TARAJYOTHI TELUGU DAILY
తారాజ్యోతి
తెలుగుదిన పత్రిక
చీఫ్ ఎడిటర్ : డాక్టర్ జె.బి.ఎల్
మంగళవారం, సెప్టెంబర్ 08, 2026 | సంపుటి - 20 | సంచిక 339 | వెల - 4రూ | పేజీలు - 12
Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.

దేశాన్ని ముందుకు నడిపిస్తున్నది మహిళలే

భారత చరిత్రలో మహిళలది కీలక పాత్ర..

లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా కీలక వ్యాఖ్యలు



న్యూఢిల్లీ : భారతదేశ చరిత్ర, వారసత్వంలో మహిళలు ఎల్లప్పుడూ మార్పునకు మార్గదర్శకులుగా నిలుస్తూ దేశాన్ని ముందుకు నడిపిస్తున్నారని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా అన్నారు. వారి నాయకత్వ పటిమను మరింత బలోపేతం చేసేందుకు సరైన అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. నేడు ఫరీదాబాద్‌లో జాతీయ మహిళా కమిషన్ (ఎన్‌సీడబ్ల్యూ) ఆధ్వర్యంలో

తరువాయి 2లో

స్వర్ణాంధ్ర విజన్-2047తో ముందుకు



విజన్‌ను క్షేత్రస్థాయిలో అమలు చేద్దాం

రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిద్దాం

కార్యకర్త బలంగా ఉంటేనే పార్టీకి బలం

ప్రతి నియోజకవర్గానికి కోటి కేటాయింపు

వైసీపీది ఉగ్రవాదుల తరహా పాలిటిక్స్

ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక వ్యాఖ్యలు

లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో నేతలకు దిశానిర్దేశం

అమరావతి : తెలుగుదేశం పార్టీ నిర్వహించిన లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు పార్టీ ఎమ్మెల్యేలు, నేతలకు కీలక దిశానిర్దేశం చేశారు. కార్యకర్తల రాజకీయ, ఆర్థిక సాధికారతకు కృషి చేయాలని, అదే సమయంలో స్వర్ణాంధ్ర విజన్-2047ను క్షేత్రస్థాయిలో అమలు చేసి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని స్పష్టం చేశారు. కార్యకర్త బలంగా ఉంటేనే పార్టీ బలంగా ఉంటుందని, వారిని నిరాశకు గురికాకుండా చూడాల్సిన బాధ్యత

2లో

ప్రజలకు తక్కువ ధరకే నాణ్యమైన బియ్యం, సరుకులు

ఏపీ భవన్లో ప్రత్యేక రైస్ అవుట్‌లెట్ ప్రారంభించిన మంత్రి నాదెండ్ల మనోహర్

ఎన్‌సీసీఎఫ్ ద్వారా 64 రకాల నిత్యావసర సరుకులు విక్రయం

న్యూఢిల్లీ : దేశ రాజధాని న్యూఢిల్లీలో నివసిస్తున్న రాష్ట్ర ప్రజలకు తక్కువ ధరకే అత్యుత్తమ నాణ్యతతో కూడిన బియ్యం, నిత్యావసర సరుకులను అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం కీలక అడుగు వేసింది. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్ పౌరసరఫరాల కార్పొరేషన్ ఆధ్వర్యంలో, రెసిడెంట్ కమిషనర్ చొరవతో ఏపీ భవన్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక 'రైస్ అవుట్‌లెట్'ను పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ.. మన రైతాంగం కష్టపడి పండించిన ధాన్యం రాష్ట్రవ్యాప్తంగానే కాకుండా జాతీయ స్థాయిలోనూ అద్భుతమైన గుర్తింపు తెచ్చుకుందని కొనియాడారు. ముఖ్యంగా ఢిల్లీ నగరంలో స్థిరపడిన, నివసిస్తున్న తెలుగు ప్రజలందరికీ స్వచ్ఛమైన, నాణ్యమైన మన ఊరి రుచులను, వరి వంగడాలను అందించాలనే ఉద్దేశంతోనే ఈ అవుట్‌లెట్‌ను

తరువాయి 2లో

కోటి ఓట్ల తొలగింపునకు కుట్ర

బీజేపీ వ్యతిరేక ఓట్లపై ప్రత్యేక నిఘా

కొడంగల్‌లో 81 వేల ఓట్లు గల్లంతు

పేదలు, గిరిజనుల ఓట్లపైనా కుట్ర

దీనిపై లౌకిక శక్తులు ఏకం కావాలి

సర్‌పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్ :

తెలంగాణలో కోటి ఓట్లను తొలగించే కుట్ర జరుగుతోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. ఓటర్ల జాబితా సవరణ (సర్) ప్రక్రియపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వ్యతిరేక ఓటర్లను గుర్తించేందుకు బీజేపీ ప్రత్యేక ఏజెన్సీలను ఏర్పాటు చేసిందని విమర్శించారు. 2009 నుంచి ఓటింగ్ సరళిని పరిశీలించి బీజేపీకి వ్యతిరేకంగా ఉన్నవారి ఓట్లు తొలగిస్తున్నారని ఆరోపించారు. రవీంద్ర భారతిలో నేడు రైతు నేత సారంపల్లి మల్లారెడ్డి సంస్మరణ సభ జరిగింది. ఈ కార్యక్రమంలో సీఎం మాట్లాడారు. నరేంద్ర మోదీ విధానాలకు వ్యతిరేకంగా వ్యవస్థ మొత్తం సిద్ధమవుతోందని అన్నారు. అందుకే ఎస్ఐఆర్ పేరుతో కొత్త కుట్రలకు తెరలేపారని ఆరోపించారు. తెలంగాణలో కోటి ఓట్లు తొలగిస్తున్నా బీఆర్ఎస్ స్పందించడం లేదని మండిపడ్డారు. తన నియోజకవర్గం కొడంగల్‌లో వలస వెళ్లిన వేలాది మంది పేదల ఓట్లను తొలగిస్తున్నారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. కొడంగల్‌లో 81 వేల ఓట్లను అనామలీస్ జాబితాలో చేర్చారని తెలిపారు. ప్రస్తుత ఓట్లతోనే 2029లో మోదీ ఓటమికి పునాది పడుతుందని అన్నారు. బీజేపీ వ్యతిరేక ఓట్లు అంటే మైనార్టీలవే అనుకోవద్దని సీఎం చెప్పారు. పేదలు, గిరిజనుల ఓట్లను తొలగించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. జాతీయ స్థాయిలో లౌకిక శక్తులు ఏకమై మోదీకి వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. రైతుల కోసం జీవితాన్ని అంకితం చేసిన సారంపల్లి మల్లారెడ్డి మరణం రైతాంగానికి తీరని లోటని సీఎం అన్నారు. రైతు సమస్యలపై అవగాహన ఉన్న నాయకత్వం క్రమంగా తగ్గుతోందని పేర్కొన్నారు.

తరువాయి 2లో

అసెంబ్లీకి వెళ్లే ఎమ్మెల్యేలను అడ్డుకోవద్దు

తెలంగాణ రాష్ట్ర హైకోర్టు పోలీసులకు ఆదేశం

ఉల్లంఘనపై స్పీకర్ చర్యలు తీసుకుంటారు

రాష్ట్ర హోం శాఖకు హైకోర్టు నోటీసులు జారీ

హైదరాబాద్ : తెలంగాణ శాసనసభకు వెళ్లే ఎమ్మెల్యేలను అడ్డుకోవద్దని రాష్ట్ర పోలీసులను హైకోర్టు సోమవారం ఆదేశించింది. శాసన సభ్యులు ఏవైనా నిబంధనలు ఉల్లంఘిస్తే ఆ వ్యవహారాన్ని స్పీకర్ చూసుకుంటారని, పోలీసులు వారిపై ఎలాంటి చర్యలు తీసుకోరాదని న్యాయస్థానం స్పష్టం చేసింది. అసెంబ్లీ సమీపంలో సోమవారం ఉదయం చోటుచేసుకున్న పరిణామాలను పరిగణనలోకి తీసుకున్న ఉన్నత న్యాయస్థానం, ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉదంతంపై రాష్ట్ర హోం శాఖకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. విచారణలో భాగంగా, మహిళా ఎమ్మెల్యేలపై దాడికి పాల్పడ్డారన్న ఆరోపణలు

తరువాయి 2లో

త్రివిధ దళాల సామర్థ్యం మరింత బలోపేతం

1.10 లక్షల కోట్లతో ఆయుధాలు కొనుగోళ్లు

అత్యాధునిక ఆరుద్ర రాడార్లకు ప్రాముఖ్యత

కొనుగోళ్ల ప్రతిపాదనలకు ఆమోదముద్ర

న్యూఢిల్లీ : దేశ త్రివిధ దళాల సామర్థ్యాలను మరింత బలోపేతం చేసే దిశగా రక్షణశాఖ కీలక నిర్ణయాలు తీసుకుంది. ఏకంగా 1.10 లక్షల కోట్ల రూపాయల వ్యయంతో ఆయుధాలు, సైనిక పరికరాల కొనుగోళ్లకు పచ్చజెండా ఊపింది. ఈ మేరకు రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన సమావేశమైన డిఫెన్స్ అక్విజిషన్ కౌన్సిల్ పలు కీలక ప్రతిపాదనలకు ప్రాథమిక ఆమోదం తెలిపింది. 'ఆత్మనిర్భర్ భారత్' లక్ష్యానికి అనుగుణంగా ఆమోదం పొందిన

2లో

22ఏ పేరుతో సాగుతున్న భూదందా

భూదందా వెనుక పొంగులేటి ఉన్నారు

వేల కోట్లు కొల్లగొడుతున్న పొంగులేటి

బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి

గన్‌పార్క్ వద్ద బీజేపీ తీవ్ర నిరసన

హైదరాబాద్ : రాష్ట్రంలో సెక్షన్ 22ఏ నిషిద్ధ భూముల పేరుతో సాగుతున్న భారీ భూదందా వెనుక మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హస్తముందని, ఈ అక్రమాల ద్వారా ఆయన వేల కోట్ల రూపాయలు వెనకేస్తున్నారని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. శాసనసభ సమావేశాల ప్రారంభం సందర్భంగా గన్‌పార్క్‌లోని అమర వీరుల స్థూపం వద్ద నివాళులర్పించిన అనంతరం, బీజేపీ ఎమ్మెల్యేలతో కలిసి కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా ప్లకార్డులతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన మహేశ్వర్ రెడ్డి...

2లో

తెలంగాణలో 'సర్' గడువు మరోసారి పొడిగింపు

అక్టోబర్ 7 వరకు పొడిగిస్తూ ఈసీ నిర్ణయం

నవంబర్ 9న తుది ఓటర్ల జాబితా విడుదల



2

దేశాన్ని ముందుకు నడిపిస్తున్నది మహిళలే

మహిళా శాసనసభ్యుల కోసం నిర్వహించిన రెండు రోజుల వర్క్‌షాప్‌లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఓం బిర్లా మాట్లాడుతూ.. "భారతదేశ చరిత్రలో మహిళలు ఎప్పుడూ మార్పునకు మార్గదర్శకులుగా ఉన్నారు. స్వాతంత్ర్య పోరాటం నుంచి దేశ నిర్మాణం వరకు, రాజ్యాంగ రూపకల్పన నుంచి దేశాన్ని ప్రగతి పథంలో నడిపించడం వరకు వారి పాత్ర ఎంతో విశిష్టమైనది" అని కొనియాడారు. దేశం సంస్థాగత నిర్మాణం, ఆధ్యాత్మిక, మత, సాంస్కృతిక సంప్రదాయాలలో మహిళల సహకారం, గౌరవం, నాయకత్వం ఎన్నటికీ మరువలేనివని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుత కాలంలో మహిళలు కేవలం మార్పునకు సంకేతంగా నిలవడమే కాకుండా, వివిధ రంగాలలో అపూర్వమైన విజయాలు సాధిస్తూ, తమ నాయకత్వ ప్రతిభను ప్రదర్శిస్తున్నారని ఓం బిర్లా అన్నారు. వారిలో ఉన్న సహజసిద్ధమైన నాయకత్వ లక్షణాలను గుర్తించి, వాటికి మరింత పదును పెట్టేందుకు తగిన అవకాశాలు కల్పించడం మనందరి బాధ్యత అని ఆయన గుర్తుచేశారు. "మహిళలకు సాధికారత కల్పించడం, వారి కోసం ఇలాంటి సామర్థ్య పెంపుదల వర్క్‌షాప్‌లు నిర్వహించడం రెండూ అత్యంత ముఖ్యమైన అంశాలు" అని ఆయన నొక్కిచెప్పారు. ఈ సందర్భంగా, మహిళా శాసనసభ్యుల కోసం ఇంత మంచి కార్యక్రమాన్ని నిర్వహించినందుకు జాతీయ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ విజయ రాహత్కర్‌ను ఓం బిర్లా ప్రత్యేకంగా అభినందించారు. ఇలాంటి కార్యక్రమాలు మహిళా నాయకులలో కొత్త స్ఫూర్తిని నింపుతాయని, ప్రజాసేవలో వారిని మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ వర్క్‌షాప్ ద్వారా మహిళా ప్రజాప్రతినిధులు కొత్త విషయాలు నేర్చుకుని, తమ తమ నియోజకవర్గాల్లో ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందిస్తారని ఆయన అభిప్రాయపడ్డారు.

22ఏ పేరుతో సాగుతున్న భూదందా

రాష్ట్రంలో అసలు రూల్ ఆఫ్ లా అనేది అమలు కావడం లేదని, దీనిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే ప్రజలకు జవాబు చెప్పాలని డిమాండ్ చేశారు. 22ఏ నిషిద్ధ భూముల జాబితా పేరుతో పేద, మధ్యతరగతి ప్రజల న్యాయమైన భూములను నిలిపివేసి వారిని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. తక్షణమే ఆ భూములకు రక్షణ కల్పించి రిజిస్ట్రేషన్లు పునరుద్ధరించాలని కోరారు. 22ఏ భూకుంభకోణంపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరిపించాలని, అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న మంత్రి పొంగులేటిని బర్తరఫ్ చేయడంతో పాటు ఆయన రాజీనామాను ఆమోదించాలని పట్టుబట్టారు. రాబోయే శాసనసభ సమావేశాలను కనీసం 15 రోజుల పాటు నిర్వహించాలని అన్నారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ పెండింగ్ బకాయిలు, పోలీస్ నోటిఫికేషన్లు, ధరణి, భూభారతి అక్రమాలపై అసెంబ్లీ వేదికగా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీస్తామని హెచ్చరించారు.

ప్రజలకు తక్కువ ధరకే నాణ్యమైన బియ్యం, సరుకులు

అందుబాటులోకి తీసుకువచ్చినట్లు ఆయన వెల్లడించారు. రాబోయే రోజుల్లో ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేలా పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని మంత్రి స్పష్టం చేశారు. కేఎన్ఎం, బీపీటీ వంటి వివిధ రకాల బియ్యం వెరైటీలతో పాటు, ఎన్‌సీసీఎఫ్ ద్వారా సేకరించిన 64 రకాల నాణ్యమైన సరుకులను కూడా సబ్సిడీ రేట్లతో ఈ కౌంటర్ ద్వారా విక్రయించనున్నట్లు తెలిపారు. ప్రజలకు అందించే ఈ సేవల్లో ఎటువంటి లోపాలు తలెత్తకుండా అర్హత గల నిపుణులను నియమించి పారదర్శకంగా సేవలు అందిస్తామని మంత్రి పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో ఏపీ భవన్ స్పెషల్ కమిషనర్ అర్జా శ్రీకాంత్, ప్రభుత్వ సలహాదారు ఏకే జైన్, ఏపీ భవన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌లో యువకుడి హైడ్రామా..

పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుని పరుగులు..!

మెదక్ జిల్లా రామాయంపేటలో ఘటన

హైదరాబాద్,సెప్టెంబర్1 : మెదక్ జిల్లా రామాయంపేటలో తీవ్ర కలకలం రేపే ఘటన చోటుచేసుకుంది. ఓ యువకుడు పోలీస్ స్టేషన్‌లోనే పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటనతో రామాయంపేట పోలీస్ స్టేషన్‌లో ఒక్కసారిగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దుర్గాప్రసాద్ అనే యువకుడు గత కొద్దిరోజులుగా ఓ యువతిని వేధిస్తున్నాడనే ఆరోపణలపై రామాయంపేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ నేపథ్యంలో పోలీసుల చర్యలపై భయాందోళనకు గురైన యువకుడు తీవ్ర నిర్ణయం తీసుకున్నాడు. పెట్రోల్‌తో పోలీస్ స్టేషన్‌కు వచ్చిన దుర్గాప్రసాద్.. అక్కడే తనపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. మంటలను గమనించిన పోలీసులు వెంటనే అప్రమత్తమై యువకుడిని రక్షించే ప్రయత్నం చేశారు. అనంతరం తీవ్ర గాయాలతో అతడిని రామాయంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం దుర్గాప్రసాద్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఆస్పత్రిలో వైద్యులు చికిత్స అందిస్తున్నారు. యువకుడు పోలీస్ స్టేషన్‌లోకి పెట్రోల్‌తో ఎలా వచ్చాడు? ఘటనకు ముందు ఏం జరిగింది? కేసు నమోదు చేసిన తర్వాత అతడికి పోలీసుల నుంచి ఎలాంటి చర్యలు ఎదురయ్యాయి? అనే అంశాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు పోలీసుల విచారణ అనంతరం వెల్లడయ్యే అవకాశం ఉంది. రామాయంపేట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటన స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

యూపీలో ఘోర రోడ్డు ప్రమాదం..

ప్రయాణికులతో వెళుతున్న వాహనం బోల్తా

12 మంది మృతి, పదుల సంఖ్యలో గాయాలు

బాఘ్‌పత్ : ఉత్తరప్రదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. బాఘ్‌పత్ జిల్లాలో సోమవారం తెల్లవారుజామున ప్రయాణికులతో వెళుతున్న ఓ పికప్ వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ఈ దుర్ఘటనలో 12 మంది అక్కడికక్కడే మృతి చెందగా, పలువురు ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. రాజస్థాన్ నుంచి 32 మంది ప్రయాణికులతో బదౌన్‌కు బయలుదేరిన పికప్ వాహనం,. సోమవారం అర్థరాత్రి దాదాపు 12:30 గంటల సమయంలో ఖేక్డా పోలీస్ స్టేషన్ పరిధిలోకి రాగానే ప్రమాదానికి గురైంది. వాహనం ఒక్కసారిగా అదుపుతప్పి రోడ్డు డివైడర్‌ను బలంగా ఢీకొట్టడంతో బోల్తా పడింది. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, సహాయక బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ఖేక్డా, బాఘ్‌పత్‌లోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, జిల్లా ఆసుపత్రికి తరలించారు. వీరిలో కొందరి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం ఉన్నత స్థాయి ఆసుపత్రులకు తరలించారు. ఒక్కసారిగా పెద్ద శబ్దం రావడంతో మేల్కొనేలోపే వాహనం బోల్తా పడిందని క్షతగాత్రులు తెలిపారు. వెనుక నుంచి మరో వాహనం ఢీకొట్టడం వల్లే ఈ ప్రమాదం సంభవించిందని డ్రైవర్ పేర్కొం టున్నాడు. ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. మృతుల వివరాలను సేకరిస్తున్నామని, బాధితుల కుటుంబ సభ్యుల సమాచారం కోసం 9454417383 నంబర్‌లో సంప్రదించాలని బాఘ్‌పత్ పోలీసులు విజ్ఞప్తి చేశారు.

కోటి ఓట్ల తొలగింపునకు కుట్ర

కౌలు రైతులు, గిట్టుబాటు ధరలు సహా అనేక రైతు సమస్యలపై సారంపల్లికి అపారమైన అవగాహన ఉందని కొనియాడారు. కమ్యూనిస్టు ఉద్యమాల పోరాటాల వల్లే కాంగ్రెస్ పలు చట్టాలు తీసుకొచ్చిందని రేవంత్ రెడ్డి అన్నారు. కార్మికులు, పేదల సమస్యలపై కమ్యూనిస్టులు చేసిన పోరాటాలు తమ ప్రభుత్వ ఏర్పాటుకు ప్రత్యక్షంగా, పరోక్షంగా దోహదపడ్డాయని చెప్పారు. తెలంగాణలో సర్? ప్రక్రియ మొదలవ్వకముందు ప్రధాన ప్రతిపక్షం మాట్లాడింది. కోటి ఓట్లు తొలగించిన తర్వాత సర్?కు వ్యతిరేకంగా వారు ఒక్కమాట కూడా మాట్లాడటం లేదు. బీజేపీ కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నప్పుడు ప్రధాన ప్రతిపక్షం ఆ అంశాన్ని లేవనెత్తడం లేదు. 2029లో జరగబోవు ఎన్నికల్లో నరేంద్రమోదీ ఓటమికి ఈ ఓట్లతోనే పునాది పడుతుంది. ఈ ఓట్లు తొలగిస్తే మోదీకి వెయ్యేనుగుల బలం చేకూరుతుంది. ఎన్నికలు ఎప్పుడో ఉన్నాయి అప్పుడు చూద్దామనుకోవద్దు. గెలుపోటములను నిర్ణయించేంది ఎస్?ఐఆర్ అని అన్నారు. వ్యవసాయం గురించి సాధికారంగా మాట్లాడగలిగిన వ్యక్తి సారంపల్లి మల్లారెడ్డి అని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. భూమిలోని సారం నుంచి మొదలుపెట్టి నీరు, విత్తనం, పెట్టుబడి, పంట, గిట్టుబాటు ధర.. అన్ని అంశాలు కూలంకషంగా చెప్పేవారని గుర్తుచేశారు. వ్యవసాయం గురించి అవగాహన కోసం సారంపల్లి మల్లారెడ్డి రాసిన పుస్తకాలు చదివానని తెలిపారు. సారంపల్లి మల్లారెడ్డిని తక్కువసార్లే కలిసినప్పటికీ, ఆయన అంటే అపారమైన గౌరవం ఉందని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. కమ్యూనిస్టుల పోరాటాలు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేందుకు ఉపయోగపడ్డాయని చెప్పారు. దున్నేవాడికే భూమి అంటూ ఎన్నో రైతు సమస్యలపై కమ్యూనిస్టులు పోరాడారని రేవంత్ రెడ్డి కొనియాడారు. కమ్యూనిస్టులు అంటే తనకు పరోక్షంగా చాలా అభిమానమని వివరించారు. అసైన్డ్?, పోడు పట్టాలు దక్కాయంటే పోరాటం కమ్యూనిస్టులది, పరిష్కారం కాంగ్రెస్‌దని వివరించారు. వారి ఉద్యమాల ఫలితంగానే కాంగ్రెస్ అనేక చట్టాలు తెచ్చిందని గుర్తుచేశారు.

స్వర్ణాంధ్ర విజన్-2047తో ముందుకు

ఎమ్మెల్యేలదేనని ఆయన ఉద్ఘాటించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. "టీడీపీ కార్యకర్త హుషారుగా ఉంటే గెలుపును ఎవరూ ఆపలేరు. కార్యకర్తల్లో చాలా మంది పేదవారు ఉన్నారు. ప్రభుత్వ పథకాల ఫలాలు వారికి అందేలా చూడాలి. స్థానిక సంస్థల ఎన్నికల్లో బాగా పనిచేసిన వారికి, అక్కడి పరిస్థితులను బట్టి టికెట్లు కేటాయిస్తాం. వారు వ్యాపారాలు చేసుకుని అభివృద్ధి చెందేలా ఎమ్మెల్యేలు ప్రోత్సాహం, మార్గనిర్దేశం అందించాలి. ప్రజలు మెచ్చే విధంగా కార్యకర్తలకు న్యాయం చేస్తాం" అని హామీ ఇచ్చారు. జిల్లాల్లో, నియోజకవర్గాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించే బాధ్యతను మంత్రులు తీసుకోవాలని, లేనిపక్షంలో వారే జవాబుదారీగా ఉండాల్సి వస్తుందని హెచ్చరించారు. స్వర్ణాంధ్ర విజన్-2047 డాక్యుమెంట్‌పై సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా దృష్టి సారించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన విజన్‌కు నియోజకవర్గాల స్థాయిలో ఎమ్మెల్యేలు తమ ఆలోచనలతో విలువ జోడించాలని (వాల్యూ ఎడిషన్) సూచించారు. "విజన్ ప్లాన్ అమలు చేస్తే అభివృద్ధి సాధ్యమవడమే కాదు, ఎన్నికల్లోనూ గెలుపు ఖాయం. పేద-ధనిక మధ్య అంతరాలు తగ్గించడమే ఈ విజన్ ప్రధాన లక్ష్యం. ఆర్థిక కష్టాలు ఉన్నప్పటికీ, ప్రతి నియోజకవర్గానికి రూ.1 కోటి చొప్పున కేటాయించాలని నిర్ణయించాం" అని తెలిపారు. కేంద్ర మంత్రులుగా ఉన్నవారు జాతీయ స్థాయిలో శాఖలను పర్యవేక్షిస్తున్న స్ఫూర్తితోనే తమ జిల్లాలను అభివృద్ధి చేయాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. ప్రజాప్రతినిధుల్లో ఉన్నత విద్యావంతులు, రిటైర్డ్ ఉద్యోగులు, పారిశ్రామికవేత్తలు ఉన్నారని, వారంతా తమ అనుభవంతో విజన్ డాక్యుమెంట్లను అధ్యయనం చేసి, వినూత్నంగా ఆలోచించాలని కోరారు. "వందేళ్లలో జరిగే పనులను పదేళ్లలో పూర్తి చేసే టెక్నాలజీ ఇప్పుడు అందుబాటులో ఉంది. ప్రతి ఎమ్మెల్యే అకుంఠిత దీక్షతో పనిచేస్తే అద్భుతాలు సృష్టించవచ్చు" అని చంద్రబాబు అన్నారు. పెట్టుబడులను ఆకర్షించేందుకు 28 కొత్త పాలసీలు తీసుకొచ్చినట్లు ఆయన గుర్తుచేశారు. మరోవైపు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు కేవలం గౌరవం ఇవ్వడమే కాకుండా, వారికి రాజకీయ, ఆర్థిక సాధికారత కల్పించడమే అధినేత చంద్రబాబు నాయుడు ప్రధాన లక్ష్యమని పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. మంగళగిరిలో జరిగిన టీడీపీ లీడర్‌షిప్ శిక్షణా సదస్సులో 'రాజకీయ, ఆర్థిక సాధికారత' అనే అంశంపై ఆయన ప్రసంగించారు. 2040 నాటికి దేశంలో సాధారణ తలసరి ఆదాయం రూ.50 లక్షలకు చేరితే, టీడీపీ కార్యకర్తల కుటుంబాల ఆదాయం నీతివంతమైన మార్గాల్లో రూ.75 లక్షలు దాటాలనేది చంద్రబాబు ఆకాంక్ష అని ఏలూరి వెల్లడించారు. అధికారంలో ఉన్నా, లేకపోయినా నిరంతరం ప్రజల్లో ఉండే కోటి మందికి పైగా సభ్యులున్న ఏకైక పార్టీ టీడీపీ అని ఆయన కొనియాడారు. కార్యకర్త ఆర్థికంగా నిలదొక్కుకున్నప్పుడే పార్టీ మరింత బలోపేతం అవుతుందని అన్నారు. నారా లోకేశ్ ఆలోచనతో కార్యకర్తలకు రూ.5 లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పిస్తున్నామని, తల్లిదండ్రులను కోల్పోయిన కార్యకర్తల పిల్లలకు ఎన్టీఆర్ మోడల్ స్కూళ్ల ద్వారా నాణ్యమైన విద్య అందిస్తున్నామని తెలిపారు. టీడీపీ సభ్యత్వ కార్డు కేవలం గుర్తింపు మాత్రమే కాదని, అది ఆ కుటుంబానికి పార్టీ ఇస్తున్న బీమా, విద్య, వైద్య, ఉపాధి భరోసా అని వర్ణించారు. సాధారణ విద్యార్థి నాయకుడిగా ఉన్న తనకు ఎలాంటి రాజకీయ నేపథ్యం లేకపోయినా, కేవలం ప్రతిభ ఆధారంగా మూడుసార్లు ఎమ్మెల్యేగా అవకాశం కల్పించిన ఘనత చంద్రబాబుదేనని ఏలూరి గుర్తుచేసుకున్నారు. పార్టీలో సిఫార్సులకు తావులేదని, ప్రతిభకే పట్టం కడతారని స్పష్టం చేశారు. నారా లోకేశ్ నేతృత్వంలో 'కార్యకర్తే అధినేత' అనే సిద్ధాంతంతో నవతరం నాయకత్వాన్ని నిర్మిస్తున్నామని తెలిపారు. ప్రతి ఒక్కరూ "నా తెలుగుదేశం - నా బాధ్యత" అనే నినాదాన్ని స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. కాగా ముఖ్యమంత్రి చంద్రబాబు కేవలం తెలుగుదేశం పార్టీ ఆస్తి కాదని, యావత్ తెలుగు జాతి ఆస్తి అని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అభివర్ణించారు. టీడీపీ లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో భాగంగా 'స్వర్ణాంధ్ర విజన్ 2047' డాక్యుమెంట్‌పై ఆయన ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయకత్వ దార్శనికతను, ఆయన రూపొందించిన విధానాల వల్ల కలిగిన ప్రయోజనాలను ఉదాహరణలతో వివరించారు. ప్రతినిధుల హర్షధ్వానాల మధ్య ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. "వాట్ చంద్రబాబు థింక్స్ టుడే, నేషన్ థింక్స్ టుమారో (చంద్రబాబు ఈరోజు ఆలోచించింది, దేశం రేపు ఆలోచిస్తుంది)" అనేది అక్షర సత్యమని పయ్యావుల అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు చంద్రబాబు రూపొందించిన 'విజన్-2020' దేశంలోనే తొలి విజన్ డాక్యుమెంట్ అని, దానిని చూశాకే అనేక రాష్ట్రాలు తమ విజన్ పత్రాలను తయారు చేసుకున్నాయని గుర్తుచేశారు. నాడు విజన్-2020ని కొందరు అవహేళన చేసినా, అదే రాష్ట్రానికి దిక్సూచిగా మారిందని తెలిపారు. చంద్రబాబు దూరదృష్టికి ఐటీ రంగం అభివృద్ధి ఒక నిదర్శనమని పయ్యావుల పేర్కొన్నారు. హైటెక్ సిటీ ఏర్పాటుకు ముందే వందల సంఖ్యలో ఇంజనీరింగ్ కాలేజీలను ఏర్పాటు చేసి మానవ వనరులను సిద్ధం చేశారని, అందుకే ఇంజనీరింగ్ పూర్తిచేసిన యువతకు ఐటీ ఉద్యోగాలు వెంటనే లభించాయని వివరించారు. ఆయన ప్రణాళిక వల్లే నేడు ప్రపంచవ్యాప్తంగా తెలుగువారు ఐటీ నిపుణులుగా అత్యధిక ఆదాయం ఆర్జిస్తున్నారని అన్నారు. జలవనరుల నిర్వహణలో చంద్రబాబును 'వాటర్ మ్యాన్'గా అభివర్ణించారు. పట్టిసీమ ద్వారా 500 టీఎంసీల గోదావరి జలాలను కృష్ణా డెల్టాకు తరలించి, ప్రకాశం బ్యారేజీని 200 సార్లు నింపిన ఘనత చంద్రబాబుదేనని ప్రశంసించారు. 2024లో విధ్వంసానికి గురైన రాష్ట్రాన్ని తిరిగి వికాసం వైపు నడిపిస్తున్నారని అన్నారు. నియోజకవర్గాల వారీగా విజన్ ప్లాన్‌లను అమలు చేస్తున్న ఏకైక రాష్ట్రం ఏపీ అని, ఈ విషయంలో నీతి ఆయోగ్‌తో కలిసి పనిచేస్తూ జాతీయ స్థాయిలో ప్రశంసలు అందుకున్నామని పయ్యావుల తెలిపారు. నేతలంతా ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడమే లక్ష్యంగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు.

త్రివిధ దళాల సామర్థ్యం మరింత బలోపేతం

ప్రతిపాదనల్లో 98 శాతం దేశీయ రక్షణ రంగ సంస్థల నుంచే కొనుగోళ్లు చేయనున్నట్లు స్పష్టం చేసింది. సాయుధ దళాల ఆధునీకరణే లక్ష్యంగా ఈ ఏడాదిని 'సంస్కరణల సంవత్సరం'గా ప్రకటించిన రక్షణశాఖ త్రివిధ దళాల బలోపేతానికి కీలక నిర్ణయాలు తీసుకుంది. ఎలాంటి పరిస్థితులనైనా దీటుగా ఎదుర్కొనేందుకు వీలుగా సైన్యానికి అవసరమైన ఆయుధ పరికరాల సేకరణకు పచ్చజెండా ఊపింది. రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన సమావేశమైన డిఫెన్స్ అక్విజిషన్ కౌన్సిల్ ఏకంగా రూ. 1.10 లక్షల కోట్ల విలువైన ఆయుధ సంపత్తి కొనుగోళ్ల ప్రతిపాదనలకు ప్రాథమిక ఆమోదముద్ర వేసింది. డీఏసీ ఆమోదించిన ప్రతిపాదనల్లో భారత సైన్యానికి అవసరమైన కెమికల్, బయోలాజికల్, రేడియోలాజికల్, న్యూక్లియర్ రెక్కీ వాహనాలు ఉన్నాయి. ఈ వాహనాలు కలుషితమైన ప్రాంతాలను గుర్తించి, పర్యవేక్షించడంతో పాటు మార్కింగ్ చేయడంలో కీలకపాత్ర పోషిస్తాయి. అత్యంత క్లిష్టమైన సరిహద్దు భూభాగాల్లో దళాల వేగవంతమైన కదలికలు, లాజిస్టిక్స్, ఆపరేషనల్ సపోర్ట్ కోసం హై మొబిలిటీ వెహికల్స్ కొనుగోలుకు డీఏసీ ఆమోదం తెలిపింది. శత్రువులకు ముకుతాడు వేసేలా సవాలుతో కూడిన ప్రాంతాల్లో అత్యంత వేగంగా, సమర్థవంతంగా మందుపాతరలను అమర్చేందుకు సెల్ఫ్-ప్రొపెల్డ్ మెకానికల్ మైన్ లేయర్స్ కొనుగోలుకు సైతం ఆమోదముద్ర వేసింది. యుద్ధ సమయాల్లో క్లిష్టమైన భౌగోళిక ప్రాంతాల్లో అత్యంత సంక్లిష్టమైన మిషన్లలో కీలకంగా వ్యవహరించే అడ్వాన్స్‌డ్ లైట్ హెలికాప్టర్లు, ట్రాల్ ట్యాంకులు, సర్వత్ర బ్రిడ్జ్ సిస్టమ్, అడ్వాన్స్‌డ్ లైట్ హెలికాప్టర్ల కొనుగోలుకు డీఏసీ ఆమోదం తెలిపింది. భారత నావికాదళం కోసం 'ఆరుద్ర' రాడార్లతో పాటు మెరైన్ గ్యాస్ టర్బైన్ల రూపకల్పన, అభివృద్ధి, కొనుగోలుకు డీఏసీ ఆమోదం తెలిపింది. వివిధ నావల్ ఎయిర్ స్టేషన్లలో ప్రస్తుతం ఉన్న ఎయిర్ రూట్ సర్వైలెన్స్ రాడార్ల స్థానంలో ఈ అత్యాధునిక ఆరుద్ర రాడార్లను ప్రవేశపెట్టనున్నారు. యుద్ధనౌకలకు ఇంధన సిస్టమ్‌గా పనిచేసే మెరైన్ గ్యాస్ టర్బైన్ల కొనుగోలుతో ఇంజిన్ల విషయంలో విదేశీ సంస్థలపైన ఆధారపడటం తగ్గుతుందని రక్షణ శాఖ స్పష్టం చేసింది. భారత వాయుసేనకు చెందిన ఫైటర్ జెట్లు, రవాణా విమానాలు, హెలికాప్టర్ల యుద్ధ సామర్థ్యాన్ని పెంచే పలు ప్రతిపాదనలకు సైతం డీఏసీ ఆమోదం తెలిపింది. శత్రుదేశాల నిఘా రాడార్లను సమర్థంగా అడ్డుకునే గ్రౌండ్-బేస్డ్ మల్టీ-పర్పస్ జామర్ల కొనుగోలుకు పచ్చజెండా ఊపింది. రక్షణ వ్యవస్థల భద్రతను డిజిటలైజ్ చేస్తూ 'డిఫెన్స్ ఫోర్సెస్ సెక్యూర్ యాక్సెస్ కార్డ్' వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు డీఏసీ అంగీకారం తెలిపింది. దీని ద్వారా దళాల్లో ఇప్పటివరకు ఉన్న పాత పేపర్ గుర్తింపు కార్డులు, పాస్‌లు, పర్మిట్ల స్థానంలో పరస్పరం పనిచేసే అత్యాధునిక స్మార్ట్ కార్డులను అమలు చేయనున్నారు. ఈ కొనుగోలులో 98 శాతం దేశీయ పరిశ్రమల నుంచే సేకరించనున్నట్లు రక్షణ శాఖ స్పష్టం చేసింది. తద్వారా 'ఆత్మనిర్భర్ భారత్' లక్ష్యానికి మరింత ఊతమిస్తుందని వెల్లడించింది.

భగ్గుమన్న చమురు ధరలు!!

హర్మూజ్ జలసంధిలో మళ్లీ ఉద్రిక్తత

భారీగా తగ్గిన నౌకల రాకపోకలు

న్యూఢిల్లీ,సెప్టెంబర్7 : పశ్చిమాసియాలో మరోసారి ఉద్రిక్తతలు భగ్గుమన్నాయి. అమెరికా, ఇరాన్ మధ్య నౌకలపై పరస్పర దాడులు జరగడంతో ముడి చమురు ధరలు భారీగా పెరిగాయి. అంతర్జాతీయ చమురు రవాణాలో కీలకమైన హర్మూజ్ జలసంధి సమీపంలో చోటుచేసుకున్న ఈ పరిణామాలతో సరఫరాకు దీర్ఘకాలిక అంతరాయం కలుగుతుందన్న భయాలు మార్కెట్లను కుదిపేస్తున్నాయి. ఇరాన్ ఆయిల్ ట్యాంకర్లపై దాడులు చేసినట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ ప్రకటించింది. దీనికి ప్రతిగా, ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ నేవీ కూడా అమెరికా నౌకలతో పాటు, అనధికారిక మార్గాల్లో ప్రయాణిస్తున్న ట్యాంకర్లను లక్ష్యంగా చేసుకున్నట్లు తెలిపింది. ఈ పరిణామాలను విశ్లేషకులు 'ప్రధాన ఘర్షణ'గా అభివర్ణిస్తున్నారు. ఈ ఘర్షణల ప్రభావం హర్మూజ్ జలసంధిపై తీవ్రంగా పడింది. సాధారణంగా ప్రపంచ చమురు సరఫరాలో 20 శాతం ఈ మార్గం గుండానే జరుగుతుంది. ప్రస్తుతం ఇక్కడ నౌకల రాకపోకలు భారీగా పడిపోయాయి. గతంలో రోజుకు 100కు పైగా నౌకలు ప్రయాణించగా, ఇప్పుడు ఆ సంఖ్య కేవలం 10కి పరిమితమైంది. త్వరలో ఈ ప్రాంతంలో కొత్తగా 'రిస్ట్రిక్టెడ్ జోన్' ప్రకటించేందుకు ఇరాన్ సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఈ పరిణామాల నేపథ్యంలో, అంతర్జాతీయ బెంచ్‌మార్క్ బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర బ్యారెల్‌కు 0.54 శాతం పెరిగి 96.80 డాలర్లకు చేరుకుంది. అమెరికా బెంచ్‌మార్క్ డబ్ల్యూటీఐ క్రూడ్ ధర 0.72 శాతం పెరిగి 92.14 డాలర్ల వద్ద ట్రేడ్ అవుతోంది. గత వారంలోనే ఈ ధరలు 8-10 శాతం వరకు పెరిగాయి. మరోవైపు, సెప్టెంబర్ 6న సమావేశమైన ఒపెక్ ప్లస్ దేశాలు అక్టోబర్ ఉత్పత్తి విధానంలో ఎలాంటి మార్పులు చేయకూడదని నిర్ణయించాయి. హర్మూజ్ జలసంధిలో సరఫరా అంతరాయాలు కొనసాగితే ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. 2026 చివరి వరకు ఎగుమతులు పరిమితంగానే ఉంటాయని, పూర్తిస్థాయి పునరుద్ధరణ 2027లోనే సాధ్యమవుతుందని కొన్ని సంస్థలు అంచనా వేశాయి. ఈ ఉద్రిక్తతలు ప్రపంచ ద్రవ్యోల్బణం, ఆర్థిక వృద్ధిపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉంది. తదుపరి దాడులు, దౌత్యపరమైన చర్చలపైనే మార్కెట్ గమనం ఆధారపడి ఉంటుంది.

అసెంబ్లీకి వెళ్లే ఎమ్మెల్యేలను అడ్డుకోవద్దు

ఎదుర్కొంటున్న పోలీసు అధికారులను గుర్తించాలని ఆదేశించింది. ఈ ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది. ఈ మొత్తం వ్యవహారంపై సమగ్ర నివేదికను సమర్పించాలని డీజీపీని ఉన్నత న్యాయస్థానం ఆదేశించింది. అనంతరం తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. ఉదయం అసెంబ్లీ వద్ద జరిగిన పరిణామాల నేపథ్యంలో హైకోర్టు ఆదేశాలు అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

తెలంగాణలో 'సర్' గడువు మరోసారి పొడిగింపు

న్యూఢిల్లీ : తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) కార్యక్రమం గడువును కేంద్ర ఎన్నికల సంఘం పొడిగించింది. జాబితాపై అభ్యంతరాలు, క్లెయిమ్‌లు దాఖలు చేసేందుకు అక్టోబర్ 7వ తేదీ వరకు అవకాశం కల్పించింది. ఈ మేరకు సవరించిన షెడ్యూల్‌ను ఈసీ విడుదల చేసింది. గతంలో పొడిగించిన షెడ్యూల్ ప్రకారం ఈ గడువు సెప్టెంబర్ 16తో ముగియాల్సి ఉంది. అయితే, ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియకు మరింత సమయం కావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి కేంద్ర ఎన్నికల సంఘానికి వేర్వేరుగా లేఖలు రాశారు. వారి విజ్ఞప్తిని సానుకూలంగా పరిగణనలోకి తీసుకున్న ఎన్నికల సంఘం, గడువును మరోసారి పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. కొత్త షెడ్యూల్ ప్రకారం అక్టోబర్ 7 వరకు అభ్యంతరాలను స్వీకరించి, వాటిని పరిష్కరించిన అనంతరం నవంబర్ 9వ తేదీన తుది ఓటర్ల జాబితాను ప్రచురించనున్నారు. ఈసీ నిర్ణయంతో కొత్తగా ఓటరుగా నమోదు చేసుకోవాలనుకునే వారికి, అలాగే జాబితాలో తప్పులను సరిదిద్దుకోవాలనుకునే వారికి అదనపు సమయం లభించినట్లయింది.

తాతా మధును బర్తరఫ్ చేయాలి

స్పీకర్ పై అనుచిత వ్యాఖ్యలు

కేసీఆర్ క్షమాపణ చెప్పాలి: ఏలేటి

హైదరాబాద్,సెప్టెంబర్1 : తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ ను ఉద్దేశించి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసినట్టుగా భావిస్తున్న వ్యాఖ్యలు శాసనసభ వేదికగా తీవ్ర దుమారాన్ని రాజేశాయి. సభలో బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ... రాజ్యాంగబద్ధమైన స్థానంలో ఉన్న స్పీకర్‌పై తాతా మధు వాడిన భాషను తీవ్రంగా ఖండిస్తున్నామని బీజేపీ ఎమ్మెల్యేల తరఫున స్పష్టం చేశారు. ప్రతిపక్ష నేత కేసీఆర్ తక్షణమే దీనిపై సభకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. తాతా మధు కావాలని మాట్లాడారా లేక ఎవరైనా మాట్లాడించారా అని ప్రశ్నించిన ఏలేటి... ప్రజాస్వామ్య వ్యవస్థను అవమానించిన సదరు ఎమ్మెల్సీని పదవి నుంచి తక్షణమే బర్తరఫ్ చేయాలని పట్టుబట్టారు. ఇదే క్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా సభలో తీవ్రస్థాయిలో మండిపడుతూ, కేసీఆర్ క్షమాపణలు చెప్పాల్సిందేనని, మధుపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. దళిత వర్గానికి చెందిన స్పీకర్‌కు జరిగిన తీవ్ర పరాభవంపై మంత్రి సీతక్క అసెంబ్లీలోనే భావోద్వేగానికి గురై కంటతడి పెట్టగా... స్పీకర్ గడ్డం ప్రసాద్ కూడా తీవ్ర మనస్తాపంతో భావోద్వేగానికి లోనై కన్నీళ్లు పెట్టుకోవడం సభను కుదిపివేసింది. మరోవైపు 22-ఏ నిషిద్ధ భూముల వివాదంపై ప్రభుత్వాన్ని మహేశ్వర్ రెడ్డి నిలదీశారు. 22-ఏ భూముల్లో జరిగిన అక్రమాలపై స్వయంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డే క్షమాపణలు చెప్పాలని, అధికారుల మీద నెపం నెట్టి తప్పించుకోవాలని చూస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఈ భూకుంభకోణంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపిస్తామని మంత్రి శ్రీధర్ బాబు సభలోనే స్పష్టమైన హామీ ఇస్తే తమ నిరసనను విరమిస్తామని స్పష్టం చేశారు. దీనిపై ప్రభుత్వం నేరుగా సమాధానం చెప్పకుండా ఇతర అంశాలతో డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోందని మండిపడ్డారు. 'ధరణి'పై నిజంగానే ఫోరెన్సిక్ ఆడిట్ జరిగిందా అని నిలదీసిన ఆయన... ఒకవేళ జరిగితే ఆ ఆడిట్ నివేదికలను పబ్లిక్ డొమైన్‌లో పెట్టి ప్రజల ముందుకు తీసుకురావాలని డిమాండ్ చేశారు.

ఉద్యోగాల పేరుతో యూట్యూబర్ మోసం

శంషాబాద్ విమానాశ్రయంలో అరెస్ట్

హైదరాబాద్,సెప్టెంబర్1 : ప్రముఖ యూట్యూబర్ నందనను శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆమెపై ఇప్పటికే లుకౌట్ నోటీసులు పెండింగ్‌లో ఉండటంతో విమానాశ్రయంలో ఆమెను గుర్తించి అరెస్ట్ చేశారు. అనంతరం ఆమెను ఇబ్రహీంపట్నం పోలీసులకు అప్పగించారు. వివరాల్లోకి వెళితే.. నందన, ఆమె భర్త కలిసి లండన్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తామని పలువురి నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేశారని ఆరోపణలు ఉన్నాయి. ఈ మోసంపై బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇబ్రహీంపట్నం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసులో భాగంగానే ఆమెపై లుకౌట్ నోటీసులు జారీ అయ్యాయి. ఈ క్రమంలో సోమవారం శంషాబాద్ విమానాశ్రయానికి వచ్చిన నందనను ఇమ్మిగ్రేషన్ అధికారులు గుర్తించి, ఎయిర్‌పోర్ట్ పోలీసులకు సమాచారం అందించారు.

నేడు గణేష్ మండపాలపై సమావేశం.

గ్రామ సర్పంచులు ఉప సర్పంచ్ లు తప్పనిసరిగా హాజరు కావాలి.

కందుకూరు సీఐ, హెచ్ వెంకటేశ్వర్లు.

మహేశ్వరం సెప్టెంబర్ 07 (ది క్రైమ్ న్యూస్) : నేడు గణేష్ ఉత్సవాలపై సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు కందుకూర్ సిఐ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. నేడు మధ్యాహ్నం రెండు గంటలకు టంకరి రాంరెడ్డి ఫంక్షన్ హాల్ లో ఈ సమావేశం నిర్వహిస్తున్నామన్నారు ఈ సమావేశానికి మహేశ్వరం డిసిపి నారాయణరెడ్డి ఏసీపి జానకి రెడ్డి హాజరై గణేష్ మండపాలకు సంబంధించిన సూచనలు సలహాలు అలాగే భద్రత ఏర్పాట్లపై చర్చిస్తారన్నారు. కావున ఈ కార్యక్రమానికి కందుకూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామ సర్పంచులు ఉపసర్పంచ్ లు వార్డు సభ్యులు గణపతి ఉత్సవ కమిటీ సభ్యులు తప్పకుండా హాజరుకావాలని ఆయన సూచించారు.

చికిత్స కోసం రెండు లక్షల యాభై వేల ఎల్ఓసీ అందజేత

-అనారోగ్యంతో బాధపడుతున్న కొరకొప్పుల సత్యనారాయణ కి మంత్రి శ్రీధర్ బాబు భరోసా

-మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు చొరవతో సత్యనారాయణ కి వైద్య సహాయం

-రెండు లక్షల యాభై వేలు ఎల్ఓసీ మంజూరు చేయించిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

రామగిరి, సెప్టెంబర్ 07(ది క్రైమ్ న్యూస్):– రామగిరి మండలంలోని సుందిల్ల గ్రామానికి చెందిన కొరకొప్పుల సత్యనారాయణ గౌడ్ కీ తెలంగాణ రాష్ట్ర ఐటి ఉపరిశ్రమల, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రివర్యులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ రెండు లక్షల యాభై వేలు ఎల్ఓసీ మంజూరు చేసి ఇప్పించారు. సుందిల్ల గ్రామానికి చెందిన కోర కొప్పుల సత్యనారాయణ గౌడ్ కీ అనారోగ్య వైద్య చికిత్సకు సంబంధించి నిమ్స్ ఆసుపత్రి లో అనారోగ్యంతో చికిత్స పొందుతున్నట్లు సహాయం కొరకు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కి తెలుపగా వెంటనే సీఎంఆర్ఎఫ్ ద్వారా వైద్య ఖర్చుల నిమిత్తశీ వీరికి రెండు లక్షల యాభై వేలు ఎల్ఓసీ మంజూరు చేయించి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆస్పత్రి సహాయకులు హైదరాబాద్ లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో అందచేయడం జరిగింది. చికిత్స కోసం రెండు లక్షల యాభై వేలు ఎల్ఓసీ మంజూరు చేపించి అండగా నిలిచినా మంత్రి శ్రీధర్ బాబు కి కోర కొప్పుల సత్యనారాయణ గౌడ్ కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

రూ.20 వేల జరిమానా విధించిన రంగారెడ్డి జిల్లా కోర్టు

క్రైమ్ న్యూస్, రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి : నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలో 2017లో నమోదైన హత్య కేసులో నిందితుడు పొన్న నాగేశ్వరరావు ఏ నాగేష్ (47)ను న్యాయస్థానం దోషిగా నిర్ధారించి జీవిత ఖైదుతో పాటు రూ.20 వేల జరిమానా విధించింది. మంచిరేవుల గ్రామానికి చెందిన నాగేశ్వరరావు వృత్తిరీత్యా డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. పోలీసుల వివరాల ప్రకారం నాగేశ్వరరావు 2004లో పి. కల్పనను వివాహం చేసుకున్నాడు. వారికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. 2017 దసరా సమయంలో కుటుంబ సభ్యుల సమక్షంలో జరిగిన వివాదాలతో భార్యాభర్తల మధ్య విభేదాలు మరింత పెరిగాయి. 2017 అక్టోబర్ 5న సిగరెట్ విషయమై ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఈ సందర్భంగా నాగేశ్వరరావు భార్యపై దాడి చేసి విధులకు వెళ్లిపోయాడు. అనంతరం ఇంటికి తిరిగి వచ్చిన అతడు మరోసారి భార్యతో గొడవకు దిగాడు. ఈ క్రమంలో కల్పన గొంతును చేతులతో నొక్కి పట్టుకోవడంతో ఆమె మృతి చెందింది. అనంతరం నిందితుడు అక్కడి నుంచి పరారైనట్లు పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తులో పోలీసులు సాక్షుల వాంగ్మూలాలతో పాటు వైద్య ఆధారాలను సేకరించారు. కల్పనది హత్యాత్మక మరణమని వైద్య ఆధారాలు నిర్ధారించాయి. దర్యాప్తు అనంతరం నిందితుడు ఉద్దేశపూర్వకంగా ఆమె మరణానికి కారణమైనట్లు నిర్ధారించి, 2017 అక్టోబర్ 7న అరెస్ట్ చేశారు. అనంతరం దర్యాప్తు పూర్తి చేసి న్యాయస్థానంలో అభియోగపత్రం దాఖలు చేశారు. రాజేంద్రనగర్‌లోని రంగారెడ్డి జిల్లా పదో అదనపు జిల్లా, సెషన్స్ న్యాయస్థానంలో కేసుపై పూర్తిస్థాయి విచారణ జరిగింది. సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయస్థానం నాగేశ్వరరావును దోషిగా నిర్ధారించి జీవిత ఖైదుతో పాటు రూ.20 వేల జరిమానా విధించింది. ఈ కేసులో దర్యాప్తు అధికారి, నార్సింగి డివిజన్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ జి.వి. రమణ గౌడ్, ప్రభుత్వ న్యాయవాది పి. కృష్ణమూర్తి సమర్థవంతంగా పనిచేసి నిందితుడికి శిక్ష పడేలా కృషి చేశారు. వారి కృషిని సైబరాబాద్ నేర విభాగం డీసీపీ ఎ. ముత్యం రెడ్డి అభినందించారు.

ప్రతి పౌరుడి ఓటు హక్కును పరిరక్షించడమే ప్రధాన లక్ష్యం

జిల్లా ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ శ్రీ దేవసేన

ఖమ్మం ప్రతి నిధి, (ది క్రైమ్ న్యూస్) సెప్టెంబర్ 07 : ప్రతి అర్హత కలిగిన పౌరుడి ఓటు హక్కును పరిరక్షించడమే ప్రధాన లక్ష్యమని జిల్లా ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ ఎ. శ్రీ దేవసేన తెలిపారు. ఖమ్మం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం ఎస్ఐఆర్ కార్యక్రమంపై జిల్లా ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ ఎ. శ్రీ దేవసేన, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఆధ్వర్యంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ ఎ. శ్రీ దేవసేన మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి పౌరుడి ఓటు హక్కును పరిరక్షించడమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. రాజ్యాంగ పరిరక్షణ ప్రతి అధికారికి అత్యున్నత ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. ఖమ్మం జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించి ఇప్పటివరకు ఎటువంటి ప్రధాన సమస్యలు గుర్తించలేదని తెలిపారు. క్షేత్రస్థాయిలో ప్రజలు, ఓటర్లు ఎదుర్కొంటున్న సమస్యలు, సందేహాలను రాజకీయ పార్టీల ప్రతినిధుల ద్వారా తెలుసుకోవడమే ఎన్నికల సంఘం ఉద్దేశ్యమని పేర్కొన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు ఎప్పుడైనా తనను సంప్రదించి సమస్యలను తెలియజేయవచ్చని, చిన్న సమస్య అయినప్పటికీ ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అర్హత లేని ఓటర్లను తొలగించడంతో పాటు, అర్హత కలిగిన ప్రతి పౌరుడికి ఓటు హక్కు ఉండేలా చూడటమే ఎస్ఐఆర్ ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన ధృవపత్రాల్లో అవసరమైన ధృవ పత్రాన్ని సమర్పించాల్సి ఉంటుందని, అధికారులు తమ స్థాయిలో ధృవ పత్రం సమర్పణ నుంచి మినహాయింపు ఇవ్వలేరని పేర్కొన్నారు. వివాహిత మహిళల విషయంలో పేర్ల మార్పులు, పేర్లలో అక్షర దోషాలు, ఇతర చిన్నపాటి క్లరికల్ తప్పిదాలను స్వీయ ప్రకటన ద్వారా సరిచేసుకునే అవకాశం ఉందని తెలిపారు. మిగిలిన అంశాల్లో ఎన్నికల సంఘం సూచించిన ధృవ పత్రాల్లో ఒకదాన్ని తప్పనిసరిగా సమర్పించాల్సి ఉంటుందని వివరించారు. ఎస్ఐఆర్ నోటీసులు అందుకున్న ఓటర్లకు అవసరమైన ధృవ పత్రాలపై రాజకీయ పార్టీలు అవగాహన కల్పించి, విచారణకు హాజరయ్యే సమయానికి సంబంధిత పత్రాలను సిద్ధంగా ఉంచుకునేలా సహకరించాలని కోరారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో ఎక్కడైనా ఉద్దేశపూర్వకంగా అవకతవకలకు పాల్పడినట్లు గుర్తిస్తే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఖమ్మం జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియకు అన్ని రాజకీయ పార్టీలు ఇప్పటివరకు సహకరిస్తున్నాయని కలెక్టర్ పేర్కొన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల కోసం ఎస్ఐఆర్‌పై మరోసారి శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎస్ఐఆర్ నోటీసులు అందుకున్న ప్రతి ఓటరు తప్పనిసరిగా విచారణకు హాజరు కావాలని, అవసరమైన ధృవ పత్రాలు లేని వారికి సంబంధిత ధృవ పత్రాలు పొందేందుకు వీలైనంత సహకారం అందిస్తామని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు మాట్లాడుతూ, ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రారంభం నుంచే జిల్లా కలెక్టర్ ప్రజలకు, రాజకీయ పార్టీలకు మంచి అవగాహన కల్పించారని తెలిపారు. క్షేత్రస్థాయిలో ఎదురైన సమస్యలను పరిష్కరిస్తున్నారని పేర్కొన్నారు. ఓసీ వర్గానికి చెందిన కొంత మంది ఓటర్లు తమ ధృవ పత్రాలు సమర్పించడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో పెద్దగా సమస్యలు లేవని, పట్టణ ప్రాంతాల్లో మాత్రమే కొన్ని సమస్యలు ఉన్నాయని పేర్కొన్నారు. జన్మతేదీ ఆధారంగా తల్లిదండ్రుల ధృవ పత్రాలు సమర్పించాలని కోరుతున్న సందర్భాల్లో ఓటర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఖమ్మం ఆర్డీఓ శ్రీనివాస్, కలెక్టరేట్ ఎలక్షన్ విభాగం పర్యవేక్షకులు రాజు, డీటీ అన్సారీ, బీఆర్ఎస్ పార్టీ ప్రతినిధి బెల్లం వేణుగోపాల్, ఐఎన్ సి పార్టీ ప్రతినిధి అన్నెం గోపాల్ రావు, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి స్వర్ణ సుబ్బారావు, సీపీఐ(ఎం) పార్టీ ప్రతినిధి ఆర్. ప్రకాష్, టిడిపి పార్టీ ప్రతినిధి సిహెచ్. రాజరాజేశ్వరి, బిజెపి పార్టీ ప్రతినిధి వి. రాజేష్, బీఆర్ఎస్ వి ప్రతినిధి ఎల్. సతీష్ బాబు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే చెల్లించాలి..

అరెస్టులతో విద్యార్థుల సమస్యలపై పోరాటాన్ని అడ్డుకోలేరు : రవికుమార్ యాదవ్

క్రైమ్ న్యూస్, రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి : విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళనలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇన్‌చార్జి రవికుమార్ యాదవ్ పాల్గొన్నారు. బీజేపీ నేత రామచంద్రరావు నేతృత్వంలో విద్యార్థుల సమస్యలపై శాంతియుత ధర్నాకు పిలుపునివ్వగా పోలీసులు అడ్డుకోవడంతో, 'చలో అసెంబ్లీ' కార్యక్రమంలో భాగంగా శేరిలింగంపల్లి నియోజకవర్గ నాయకులతో కలిసి అసెంబ్లీ కార్యాలయాన్ని ముట్టడించేందుకు రవికుమార్ యాదవ్ ప్రయత్నించారు. దీంతో పోలీసులు ఆయనను అరెస్ట్ చేసి ఖైరతాబాద్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రంలో దాదాపు రూ.15 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఉన్నాయని ఆరోపించారు. సుమారు 14 లక్షల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ఫీజు బకాయిలు చెల్లించకపోవడంతో కొన్ని కళాశాలలు విద్యార్థులకు ధ్రువపత్రాలు, బదిలీ ధ్రువపత్రాలు ఇవ్వడం, కొత్త ప్రవేశాలను నిలిపివేయడం వంటి పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సమయంలో ఇచ్చిన హామీలైన రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, విద్యార్థులకు విద్యా భరోసా కార్డు వంటి అంశాలపై ఆయన ప్రశ్నలు సంధించారు. విశ్వవిద్యాలయాలు, గురుకులాల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ అందకపోవడంతో పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు ప్రైవేట్ కళాశాలల్లో ఉన్నత విద్యను కొనసాగించలేని పరిస్థితి ఏర్పడుతోందన్నారు. విద్యార్థులకు భరోసా కల్పించలేని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యాశాఖ మంత్రి పదవికి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలపై సభలు, శాంతియుత ధర్నాలు నిర్వహించకుండా అడ్డుకోవడం, అరెస్టులతో భయపెట్టాలని చూస్తే వెనక్కి తగ్గేది లేదని రవికుమార్ యాదవ్ స్పష్టం చేశారు. విద్యార్థులకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగుతుందని, ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు ఉద్యమాలను కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాధాకృష్ణ యాదవ్, రాష్ట్ర నాయకులు మహేష్, సింధు రెడ్డి, నాయకులు ఓబుల్ రెడ్డి, అనంత రెడ్డి, హర్షిత్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యూనిటీ ఎనక్లేవ్ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత

కాలనీలో త్వరలో పర్యటించి అభివృద్ధి పనులపై చర్యలు: తాజా మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్

క్రైమ్ న్యూస్, రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి : మియాపూర్ డివిజన్ పరిధిలోని యూనిటీ ఎనక్లేవ్ కాలనీ వాసులు కాలనీలో నెలకొన్న పలు సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై సోమవారం మియాపూర్ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌ను ఆయన నివాసంలో కలిశారు. కాలనీ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లి, వాటిని పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. కాలనీ వాసుల సమస్యలపై శ్రీకాంత్ సానుకూలంగా స్పందించారు. త్వరలోనే యూనిటీ ఎనక్లేవ్‌లో స్వయంగా పర్యటించి సమస్యలను పరిశీలిస్తానని తెలిపారు. ప్రజల నుంచి వచ్చిన వినతుల ఆధారంగా సమస్యలను గుర్తించి విడతల వారీగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. డివిజన్‌లో అత్యవసరంగా పరిష్కరించాల్సిన సమస్యలకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తామని, ప్రజలకు నిత్యం ఇబ్బందులు కలిగిస్తున్న ప్రాంతాల్లో అభివృద్ధి పనులను చేపడతామని శ్రీకాంత్ తెలిపారు. శాసనసభ పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ ప్రత్యేక చొరవతో అవసరమైన ప్రాంతాల్లో అభివృద్ధి పనులను వేగవంతం చేస్తామని చెప్పారు. యూనిటీ ఎనక్లేవ్ కాలనీలో మౌలిక వసతుల కల్పనకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తామని, ప్రజల నుంచి తన దృష్టికి వచ్చిన ప్రతి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని శ్రీకాంత్ అన్నారు. అభివృద్ధి పనులు నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలని, నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని అధికారులకు సూచిస్తామని తెలిపారు. పనుల్లో జాప్యం లేకుండా అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని, అన్ని వేళలా ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని శ్రీకాంత్ పేర్కొన్నారు. ఉమ్మడి మియాపూర్ డివిజన్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శవంతమైన, అగ్రగామి డివిజన్‌గా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనిటీ ఎనక్లేవ్ కాలనీ వాసులు చేతన్, శివరాం, సురేష్, ఆంజనేయులు, రమాకాంత్, వంశీధర్ రెడ్డి, హరి, సూర్య, రోహిత్, రాజ్ కిరణ్, గోపాల్, కిరణ్, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యను కాపాడటంలో రేవంత్ సర్కార్ విఫలం.

కాంపాటి పృథ్వీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు.

ఖమ్మం ప్రతి నిధి, (ది క్రైమ్ న్యూస్) సెప్టెంబర్ 07 : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర యేండ్లు అయినా ప్రభుత్వ విద్య ను అభివృద్ధి చేస్తామనే ఎన్నికల హామీని అమలు చేయకుండా ఉండడమే కాకుండా ప్రభుత్వ విద్య ను కాపాడటంలో రేవంత్ సర్కార్ విఫలమైందని పి డి యస్ యూ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కాంపాటి పృథ్వీ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించారు. సోమవారం పి డి యస్ యూ ఖమ్మం జిల్లా ముఖ్యుల సమావేశం రామ నర్సయ్య విజ్ఞాన కేంద్రంలో పి డి యస్ యూ జిల్లా అధ్యక్షులు తిప్పారపు లక్ష్మణ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన ముఖ్య వక్తలుగా హాజరై మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ఇటీవల కాలంలో కొడంగల్ నియోజకవర్గ పర్యటనలో భాగంగా మాట్లాడుతూ విద్యాభివృద్ధిలో తెలంగాణ రాష్ట్రం ముందంజలో ఉందని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చేనాటికి విద్యారంగంలో 28వ స్థానంలో ఉన్న తెలంగాణ 17వ స్థానంలోకి వచ్చిందని, పదివేల టీచర్ పోస్టులు భర్తీ చేసామని, ఉపాధ్యాయులకు ప్రమోషన్లు ఇస్తున్నామని మాట్లాడడం విడ్డూరంగా ఉందని ఎద్దేవ చేశారు. రేవంత్ రెడ్డి ఎన్నికలలో కాంగ్రెస్ అధికారం లోకి వస్తే 15% బడ్జెట్ ను విద్యారంగానికి కేటా ఇస్తామని, కెసిఆర్ పాలనలో మూసివేసిన 6000 పాఠశాల ల కు సౌకర్యాలు కల్పించి కొనసాగిస్తామని చెప్పారు. కానీ ఆచరణలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం 7శాతం మాత్రమే బడ్జెట్ కేటాయించారు. రెండున్నర సంవత్సరాల కాలంలో 6000 పాఠశాలలను కొనసాగించకపోగా మరో 2000 వేల పాఠశాలల ను మూసి వేయడానికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు విశ్వాసం కల్పించేందుకు మాత్రమే రేవంత్ రెడ్డి గంభీర స్వరంతో మాట్లాడుతు న్నారని ఈ క్రమంలో పలు సందర్భాలలో ఆయన మాట్లాడిన తీరు వివాదాస్పదంగా మారాయని అన్నారు. ప్రభుత్వ విద్యను కాపాడేందుకు వేల రూపాయలను విద్యార్థుల కు ఖర్చు చేస్తున్నామని కానీ ఫలితాలను రాబట్టడంలో విఫలమవు తున్నా మని, ఉపాధ్యాయులు నిబంధనతో పాఠాలు బోధించకుండా తల్లిదండ్రులకు విశ్వాసం కల్పించలేకపోతున్నారని దీనితో ప్రభుత్వ విద్య మీద తల్లిదండ్రులకు నమ్మకం లేకుండా పోయిందని ఉపాధ్యాయులపై నింద వేస్తూనే నేడు తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ వచ్చిన తర్వాత మాత్రమే విద్యాభివృద్ధి చెందిందని మాట్లాడడం ముఖ్యమంత్రి స్థాయిలో ఉండి మాట్లాడిన మాటల్లో ఎంత నైతికత ఉందో అర్థమవుతుందని అన్నారు. ఎవరికైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వ విద్యపై దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పి డి యస్ యూ ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షులు శశికిరణ్, యశ్వంత్, సహాయ కార్యదర్శి రఘు జిల్లా నాయకులు పృథ్వీ, నాయకులు కార్తీక్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల కోసం బిక్షాటన

హామీలను వెంటనే అమలు చేయాలని వాసిలి చంద్రశేఖర్ ప్రసాద్ డిమాండ్

క్రైమ్ న్యూస్, రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి : విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో బిక్షాటన కార్యక్రమం నిర్వహించారు. తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కవిత ఆదేశాల మేరకు శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి వాసిలి చంద్రశేఖర్ ప్రసాద్ ఆధ్వర్యంలో మదీనాగూడ గాంధీ సర్కిల్ నుంచి చందానగర్ పాత గాంధీ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వాసిలి చంద్రశేఖర్ ప్రసాద్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారంలోకి రాకముందు విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో పాటు రూ.5 లక్షల ప్రమాద బీమా, స్కూటీలు అందిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. అయితే ఇప్పటికీ ఆ హామీలు అమలుకు నోచుకోలేదని ఆరోపించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల కాకపోవడంతో విద్యార్థులు, వారి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయడంతో పాటు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించే వరకు తెలంగాణ రక్షణ సేన పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కుమార్, దయానంద్ ముదిరాజ్, సందీప్ డిసోజు, విష్ణు, రఘు, పవన్‌తో పాటు పలువురు విద్యార్థులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సంపాదకీయం

విలువలతోనే పత్రికల మనుగడ

ప్రింట్ మీడియా సంక్షోభం, భవిష్యత్తు అనే అంశం గురించి మాట్లాడుకునే ముందు అసలు భారతదేశంలోకి ప్రింట్ మీడియా ఎలా వచ్చిందనే విషయం గురించి చెప్పుకోవాలి. నిజానికి భారత పత్రికారంగ చరిత్ర చాలా అపూర్వమైనదీ, పురాతనమైనదీ కూడా. మన దేశంలో 245 సంవత్సరాల క్రితం మొట్టమొదటి పత్రిక ప్రారంభమైంది. అది కూడా భారతీయుడు ప్రారంభించింది కాదు, ఐర్లాండ్ దేశానికి చెందిన జేమ్స్ అగస్టే హిక్కి అనే ఒకాయన అప్పటి బ్రిటిష్ ఇండియా రాజధాని కలకత్తాలో 'బెంగాల్ గెజిట్' అనే పత్రిక ప్రారంభించారు. అప్పట్లో బ్రిటిష్ ఇండియాకి కలకత్తా రాజధానిగా ఉండేది. అక్కడే ఈ పత్రిక ఎందుకు ప్రారంభించారంటే అప్పటి బ్రిటిషర్ల వినోదం కోసం అని చెప్పాడాయన. ఆ తర్వాత ఆ పత్రిక.. జనానికి సమాచారం అందజేసే దినపత్రికగా రూపాంతరం చెందింది. ఆ తర్వాత స్వాతంత్య్ర పోరాట కాలంలో మన నాయకులు చాలా మంది పత్రికలు నడిపారు. మహాత్మా గాంధీ యంగ్ ఇండియా, హరిజన్, నవజీవన్, ఇండియన్ ఒపీనియన్ వంటి పత్రికలు నడిపారు. బాబా సాహెబ్ అంబేద్కర్.. మూర్తినాయక్, బహిష్కృత భారత్ అనే రెండు మరాఠీ పత్రికలు నడిపారు. జవహర్ లాల్ నెహ్రూ నేషనల్ హెరాల్డ్ అనే పత్రికను స్వాతంత్ర్యోద్యమ కాలంలోనే ప్రారంభించారు. అది చాలా కాలం మనుగడలో ఉంది. ఇప్పుడు ఆ పత్రిక 'టెయింటెడ్'గా తయారైంది. దానిపై ఎన్నో కేసులు వస్తున్నాయి. మోతీలాల్ నెహ్రూ ఇండిపెండెంట్ అనే పత్రిక ప్రారంభించారు. ఆయన 'హోమ్ రూల్ ఫర్ ఇండియా' అనే నినాదంతో ఆయన ఈ పత్రిక నడిపారు. లాలా లజపతి రాయ్ ఉర్దూలో 'వందేమాతరం' పేరిట పత్రిక నిర్వహించారు. ఇదంతా ఎందుకు చెప్పవలసి వస్తున్నదంటే, స్వాతంత్ర్య పోరాటానికి సంబంధించిన సమాచారాన్ని ప్రజలకు చేరవేసే క్రమంలో పత్రికలు ఉండాల్సిన అవసరం ఉందని అప్పట్లో భావించారు. ఇలా స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న నాయకులు, యోధులు చాలామంది స్వాతంత్ర్య పోరాటం గురించి ప్రజలకు సమాచారం తెలియాలని భావించి పత్రికలు నడిపారు. అప్పట్లో ఒక లక్ష్యంగా ప్రారంభమైన పత్రికల స్వభావం క్రమక్రమంగా ఎలా మారుతూ వచ్చిందో చెప్పుకోవాలి. స్వాతంత్ర్యం వచ్చాక, తమ లక్ష్యం నెరవేరింది కాబట్టి ఇక ఈ పత్రికలు ఎందుకు? అంటూ తొలి ప్రధాన మంత్రి జవహర్ లాల్ నెహ్రూ అధ్యక్షతన ఒక సమావేశం జరిగింది. చాలా మంది 'ఇక ఇప్పుడు పత్రికలు అవసరం లేదు' అన్నారు. ఎందుకంటే అప్పటికే పత్రికల్లో అసత్యాలు, అర్ధ సత్యాలు రాయడం మొదలైంది. అయితే మెజారిటీ పత్రికలు అలా లేవు. అవి విలువల్ని పాటిస్తూ, ప్రజలకు సమాచారం తెలిపే బాధ్యత నిర్వర్తిస్తున్నాయి. అయితే 'ఇక పత్రికలు ఎందుకు?' అనే వాదనను జవహర్ లాల్ నెహ్రూ అంగీకరించలేదు. 'పత్రికలు ఏం రాసినా సరే, అవి ఉండాల్సిందే. ప్రజాస్వామ్యంలో పత్రికలు అనేవి అవసరం' అని నొక్కి చెప్పడమే కాకుండా, వాటికి ఒక ప్రత్యేకమైన హోదా ఉండాలంటూ ఆయన 1952లో ఒక ప్రెస్ కమిషన్ వేశారు. ప్రెస్ కమిషన్ నివేదికలో భాగంగానే ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆవిర్భవించింది. అలాగే సమాచారాన్ని సేకరించి వార్తలు రాసి ప్రజలకు అందజేసే పనిని ఒక పవిత్ర లక్ష్యమని నెహ్రూ పేర్కొన్నారు. కాబట్టి జర్నలిస్టులకు ఒక ప్రత్యేకత ఉండాలి. అందరిలాగా ఉండకూడదు అని చెప్పి ఆయన వర్కింగ్ జర్నలిస్టుల చట్టం తీసుకొచ్చారు. ఈ చట్టం ప్రకారం ఉద్యోగ భద్రతతో సహా చాలారకాల వెసులుబాట్లు కల్పించారు. ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి వేజ్ బోర్డు వేయాలని కూడా ప్రెస్ కమిషన్ సిఫారసు చేసింది. అయితే ఇప్పుడున్న ప్రభుత్వాలు ఈ చట్టాలన్నిటినీ రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్స్ తీసుకొచ్చాయి. అంటే, ఇవాళ జర్నలిస్టులకు, ఇతర రంగాల్లో పని చేస్తున్నవారికీ తేడా ఏమీ లేదన్నమాట. ఆ నిబంధనలు ఇంకా అమలులోకి రానప్పటికీ ప్రస్తుతం అధికారంలో ఉన్న కేంద్ర ప్రభుత్వం వాటిని అమలు పరచడానికి సిద్ధంగా ఉంది. నెహ్రూ అంత ప్రజాస్వామ్యబద్ధంగా ఉన్నప్పటికీ, ఆయన కుమార్తె ఇందిరా గాంధీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమర్జెన్సీ విధించి ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాని రద్దు చేశారు. వాక్ స్వాతంత్ర్యం, భావప్రకటన స్వేచ్ఛ లేకుండాపోయాయి. 1978లో జనతా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మొరార్జీ ప్రభుత్వం రెండవ ప్రెస్ కమిషన్ వేసి, ప్రెస్ కౌన్సిల్‌ను పునరుద్ధరించింది. ఈ మార్పులన్నీ జరుగుతున్న సమయంలోనే వార్తా పత్రికలు వ్యాపార దృష్టిని అలవరచుకోవడం మొదలుపెట్టాయి. అంటే.. లక్ష్యం నుంచి వృత్తిగా మారి, వృత్తి నుంచి వ్యాపారం వైపు పత్రికలు మళ్ళిన తర్వాతనే ప్రింట్ మీడియా పతనం ప్రారంభమైంది. పతనం అంటే చాలా మంది అంగీకరించకపోవచ్చు. నా ఉద్దేశంలో పతనమంటే పత్రికలు లేకుండాపోవడం కాదు, విలువల రీత్యా పతనం ప్రారంభమైందని. వార్తాపత్రికలను ఏ ఉద్దేశంతో నడపాలో, ఏ లక్ష్యం కోసం పనిచేయాలో వాటినుంచి యాజమాన్యాలు పక్కకు జరిగి ధనార్జన ధ్యేయంగా చేసుకున్నాయి. ఎనభయ్యవ దశకం చివర్లో ఈ ధోరణి ప్రబలింది. అప్పట్లో నేను 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్'లో పని చేస్తున్నాను. ఒకసారి మా యజమాని ఒక పుస్తకం పంపించారు. దానిమీద 'మీరు చదవండి, పత్రికలో పని చేస్తున్న హెడ్స్ అందరితో కూడా చదివించండి' అని నోట్ పెట్టారు. అదొక అమెరికన్ రచయిత రాసిన పుస్తకం. దాని శీర్షిక ఏమిటంటే 'వేర్ ది న్యూస్ రూమ్స్ ఆర్ రూల్ బై ఎంబిఏస్' అని. అంటే మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ చేసిన వాళ్ళు న్యూస్ రూమ్స్‌లో పై పొజిషన్స్‌లో ఉండాలని దాని అర్థం. పత్రికలతో వ్యాపారం ఎలా చేయొచ్చు అని చెప్పే ఆ పుస్తకాన్ని నేను చదవలేదు సరికదా ఎవరికీ ఇవ్వలేదు కూడా. ఆ పుస్తకం చదివి అందరూ వ్యాపారం చేయడం మొదలుపెడితే పత్రికల్లో వార్తలు రాసేవారు ఎవరూ ఉండరని నేను ఆ పుస్తకాన్ని భద్రంగా కప్ బోర్డులో పెట్టి, ఆ పత్రికకు రాజీనామా చేసిన రోజున దాన్ని నాతోపాటే తీసుకువెళ్లిపోయాను. 1990 చివర్లలో 24 గంటల న్యూస్ ఛానళ్లు వచ్చాక ప్రింట్ మీడియా ప్రాభవం పూర్తిగా తగ్గిపోవడం మొదలైంది. డిజిటల్ మీడియా విజృంభణతో ఇంటర్నెట్, మొబైల్ పరికరాలు సమాచారాన్ని మరింత చేరువ చేశాయి. ఏదైనా సంఘటన జరిగిన మరుక్షణమే అందరికీ తెలిసేలా చేస్తున్నాయి. అదే సమాచారాన్ని వార్తా పత్రిక మరునాడు మనకు అందిస్తున్నది. దీంతో ఉదయం పేపర్ తెరవగానే అన్నీ చద్దివార్తలే కనబడుతున్నాయి. వార్తా పత్రికల చెల్లుబాటు తగ్గడానికి ఇదొక కారణం. యువతరం అలవాట్లు మారుతున్నాయి. మొబైల్ డివైస్‌లకు అలవాటు పడిన యువత పత్రికను చేతిలో పట్టుకోవాలంటే నామోషీగా భావిస్తున్నారు. తాజాగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వచ్చాక జర్నలిస్టుల పనులన్నీ కూడా ఈ తరహా యాప్ లే చేసేస్తున్నాయి. వార్తా ఛానళ్లు వచ్చాక చదవడానికంటే చూడటానికే జనం ప్రాధాన్యం ఇస్తున్నారు. ఆ తర్వాత మరో ముఖ్యమైన మార్పు.. అడ్వర్టయిజ్‌మెంట్ షిఫ్ట్. పత్రికలకు ఆదాయం వచ్చేది అడ్వర్టయిజ్‌మెంట్ల ద్వారానే. ఇవి ఎలక్ట్రానిక్ మీడియాకు షిఫ్ట్ కావడంతో పత్రికలకు ఆదాయం తగ్గుముఖం పట్టింది. ఫలితంగా వ్యాపార ప్రయోజనాలు ఆశించే యాజమాన్యాలు పత్రికలు నడపడానికి ఇష్టపడటం లేదు. చాలా పత్రికలు మూతపడుతున్నాయి. జర్నలిస్టుల సంఖ్యను కూడా తగ్గిస్తున్నారు. దాంతో జర్నలిజం కోర్సులు చదువుకోవడానికి వచ్చే వాళ్ళ సంఖ్య కూడా తగ్గిపోతోంది.ప్రింట్ మీడియా సంక్షోభానికి మరో కారణం పేపర్ ఖర్చు. ప్రస్తుతం ఒక దినపత్రిక ఖరీదు ఐదారు రూపాయలు ఉంటే, ఆ పత్రిక ఒక కాపీని ప్రింట్ చేసేందుకు అయ్యే ఖర్చు 35 రూపాయలు అవుతుంది. మిగతా 30 రూపాయలను వ్యాపార ప్రకటనల రూపంలో తెచ్చుకోవాల్సిందే. కానీ అవి రావడం లేదు. ఇక్కడ మరో విషయం చెప్పుకోవాలి. ప్రముఖ పత్రికా యాజమాన్యాలు కూడా తమ ఖర్చు తగ్గించుకునేందుకు పత్రికలను తక్కువ సంఖ్యలో ప్రింట్ చేస్తున్నాయి. బయటికి చెప్పుకోవడానికి లక్షల సర్కులేషన్ ఉందని చెప్తారు కానీ వాళ్ళు ప్రింట్ చేసేది 30 వేల నుంచి 40 వేలు మాత్రమే. ఇలాంటి పరిస్థితుల్లో ప్రింట్ మీడియా తన పద్ధతిని మార్చుకుంటే తప్ప భవిష్యత్తు కష్టసాధ్యమనేది నా అభిప్రాయం. ప్రింట్ మీడియాకు కాలం చెల్లిందని కొందరు అంటున్నారు కానీ, నా ఉద్దేశంలో అది నిజం కాదు. మార్పుతో పాటు మనమూ మారాలి. న్యూస్ ఛానల్లో చూపించే వార్తనే రేపు పొద్దున పేపర్‌లో రాస్తే ప్రయోజనం లేదు. కాబట్టి దానికంటే భిన్నంగా ఉండే ప్రయత్నం చేయాలి. పత్రికలు తాము ప్రచురించే వార్తలను భిన్నంగా ఉండేట్టుగా చూడాలి. ఎవరికీ అందని వార్తలు రాయాలి. ఒకప్పుడు జర్నలిజంలో ఒక ప్రత్యేకమైన అంశం పరిశోధనాత్మక జర్నలిజం. ఇప్పుడు ఇన్వెస్టిగేటివ్ రిపోర్ట్ అనేవి దాదాపుగా లేకుండా పోయాయి. ప్రస్తుతం వాట్సాప్ జర్నలిజం నడుస్తోంది. ఎవరైనా వాట్సాప్‌లో ఒక వార్త పెడితే దాన్ని తీసి కట్ అండ్ పేస్ట్ చేసి, పత్రికల్లో పెట్టి అమ్మేసే ప్రయత్నం చేస్తున్నారు. అలాంటి పత్రికలు నడిచే అవకాశం లేదు. ఏదైనా కొత్తదనం చూపిస్తే తప్ప ప్రింట్ మీడియాకు భవిష్యత్తు అనేది చాలా కష్టం. ప్రస్తుత కాలంలో పత్రికల్లో వ్యాపార ప్రయోజనాలతో పాటు రాజకీయాలు కూడా ప్రవేశించాయి. ప్రతి రాజకీయ పార్టీ మీడియా తన అధీనంలో, తన అదుపులో ఉండాలని కోరుకుంటోంది. అన్ని రాజకీయ పక్షాల తీరు అలానే ఉంది. తమకు వ్యతిరేకంగా ఒక్క వార్త కూడా రావడానికి వీలులేదు, వస్తే సహించడం లేదు. పత్రికలకు ఒకవైపు అడ్వర్టయిజ్‌మెంట్ల దెబ్బ, మరోవైపు రాజకీయాల ఒత్తిడి. ఈ పరిస్థితుల్లో పత్రికా యాజమాన్యాలే స్వచ్ఛందంగా రాజకీయాలు కోరుకుంటున్నాయి. రాజకీయ పార్టీలతో అంటకాగుతున్నాయి. ఇన్ని క్లిష్ట పరిస్థితులు ఎదురవుతున్నా వార్తాపత్రిక రంగం భవిష్యత్తుకు ఢోకా ఏమీ లేదు. ప్రింట్ మీడియాకి మళ్లీ మంచి రోజులు వచ్చే అవకాశాలు చాలా ఉన్నాయి. 0పత్రికలు ఇండిపెండెంట్‌గా రాగలిగితే వాటికి చక్కటి భవిష్యత్తు ఉంటుంది. ఎందుకంటే స్వతంత్రంగా ఉన్ననాడే పత్రికలకు విశ్వసనీయత ఉంటుంది. రాజ్యాంగం పత్రికా స్వేచ్ఛను ప్రత్యేకంగా నిర్వచించలేదు. భావప్రకటనా స్వేచ్ఛనే పత్రిక స్వేచ్ఛగా వ్యవహరిస్తున్నాం. సమాచారాన్ని తెలుసుకునే హక్కు ప్రజలకు ఉంటుంది. ఆ హక్కును కాపాడే బాధ్యత పత్రికలది కూడా కాబట్టి పత్రికలు స్వతంత్రంగా ఉంటే తప్ప వాటికి మనుగడ లేదు. ఇలాంటి పత్రికలకు క్రౌడ్ ఫండింగ్ జరగాలి. మీరు పత్రికకు ఒక పది రూపాయలు డొనేట్ చేసిన పక్షంలో మీరు ఆ పత్రికనుంచి ఏమీ ప్రయోజనం ఆశించరు. కానీ, ఓ పది కోట్లు ఇచ్చేవాడు తనకు అనుకూలంగా పత్రిక నడవాలని కోరుకుంటాడు. కాబట్టి జనం నుంచి పదో, వందో, వెయ్యో సేకరించి ఓ పత్రికనో, ఓ మీడియా సంస్థనో ప్రారంభించగలిగితే అది తప్పనిసరిగా నిలబడుతుంది. అలాంటి పద్ధతి ఈ దేశంలో రావాలి. వేరే దేశాల్లో ఇలాంటి ప్రయోగాలు జరుగుతున్నాయి. కొన్నిచోట్ల విజయవంతమయ్యాయి కూడా.

మద్యం ఆదాయంతోనా మనుగడా?

ప్రభుత్వానికి ఆదాయం రావడం తప్పు కాదు. కానీ ఆ ఆదాయానికి మూలం ఏమిటన్నదే అసలు ప్రశ్న. ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీసే మద్యం అమ్మకాలపై ప్రభుత్వ ఖజానాలు ఆధారపడాల్సిన పరిస్థితి వస్తే.. అది కేవలం ఆర్థిక అంశంగా చూడగలమా? ఒకవైపు మద్యపానాన్ని తగ్గించాలని ప్రచారం చేస్తూనే.. మరోవైపు మద్యం అమ్మకాల ద్వారా భారీగా ఆదాయం సమకూర్చుకోవడం ప్రభుత్వ విధానాల్లో కనిపిస్తున్న వైరుధ్యాన్ని బయటపెడుతోంది. మద్యం విక్రయాలు పెరిగితే ఖజానా నిండొచ్చు. కానీ అదే సమయంలో కుటుంబాలపై ఆర్థిక భారం పెరగడం, ఆరోగ్య సమస్యలు తీవ్రమవడం, సామాజిక సమస్యలు ఉత్పన్నం కావడం జరుగుతుంటే.. ఆ ఆదాయాన్ని అభివృద్ధికి విజయంగా ఎలా పరిగణించాలి? ప్రజల అవసరాల నుంచి వచ్చే ఆదాయం ఒక ఎత్తయితే.. ప్రజల బలహీనత నుంచి వచ్చే ఆదాయం మరో ఎత్తు. అయితే ప్రశ్న ఒక్కటే –ప్రభుత్వాల ఆర్థిక వ్యవస్థకు మద్యం ఎంతకాలం ప్రధాన ఆధారంగా ఉండాలి? ప్రజల ఆరోగ్యం, కుటుంబాల సంక్షేమం కంటే మద్యం ఆదాయానికే ప్రాధాన్యం ఇస్తున్నామా? అనేది ఆలోచించాలి. భారతదేశంలో ఏ రాష్ట్ర బడ్జెట్ చూసినా, ఏటా ఆదాయ వనరుల లెక్కలు తీసినా ఒక చేదు నిజం స్పష్టంగా కనిపిస్తుంది. దేశంలోని మెజారిటీ రాష్ట్రాల ఆర్థిక బండిని నడిపిస్తోంది 'మద్యం' అమ్మకాలే! ఉచిత పథకాలు, మౌలిక వసతుల కల్పన, ప్రభుత్వ ఉద్యోగుల జీతాలు... ఇలా దేనికైనా సరే, మద్యం ద్వారా వచ్చే ఎక్సైజ్ ఆదాయమే రాష్ట్ర ప్రభుత్వాలకు కామధేనువులా మారిందంటే అతిశయోక్తి కాదు. ఒక రకంగా చెప్పాలంటే, నేడు దేశంలో 'మద్యం అమ్మకాలతోనే ప్రభుత్వాలు నడుస్తున్నాయి' అనడం ఏమాత్రం అతిశయోక్తి కాదు. దేశవ్యాప్తంగా వస్తుసేవల పన్ను అమలులోకి వచ్చిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వాలకు సొంతంగా పన్నులు పెంచుకునే హక్కులు చాలా వరకు తగ్గిపోయాయి. కానీ, మద్యం, పెట్రోలియం ఉత్పత్తుల జీఎస్టి పరిధి నుంచి మినహాయించారు. ఇదే రాష్ట్ర ప్రభుత్వాలకు అతిపెద్ద అస్త్రంగా మారింది. ఒక విధంగా చెప్పాలంటే వరంగా మారిందనే చెప్పాలి. అడకత్తెరలో భారత్ ఆర్థిక ఇబ్బందులు తలెత్తినప్పుడల్లా, బడ్జెట్ లోటును పూడ్చుకోవడానికి ప్రభుత్వాలు ఎంచుకునే తక్షణ మార్గం మద్యంపై పన్నులు పెంచడమే. బాటిల్ ధర రూ. 1000.. ప్రభుత్వ వాటా రూ. 700! మద్యం విక్రయాల ద్వారా ప్రభుత్వాలు ఏ స్థాయిలో లాభపడుతున్నాయో తెలియజేసే విశ్లేషణ ఇది. మీరు కొనే ప్రతి రూ. 1,000 మద్యం బాటిల్‌పై దాదాపు రూ. 350 నుండి రూ. 700 వరకు పన్నుల రూపంలోనే ప్రభుత్వ ఖజానాకు చేరుతుంది. అంటే మద్యం అసలు తయారీ ధర, రవాణా ఖర్చుల కంటే దానిపై ప్రభుత్వాలు విధించే పన్నులే రెండు మూడు రెట్లు ఎక్కువగా ఉంటున్నాయి. పండుగల సీజన్‌లో కేవలం కొద్ది రోజుల వ్యవధిలోనే వందల, వేల కోట్ల రూపాయల మద్యం అమ్ముడుపోతుంది. గ్రామీణ ప్రాంతాల్లో సంక్రాంతి కోడిపందాలు, విందు వినోదాల కారణంగా పల్లెల్లో మద్యం ఏరులై పారుతుంది. పట్టణాల కంటే గ్రామీణ జిల్లాల్లో ఈ సమయంలో విక్రయాలు రెట్టింపవుతాయి. తెలంగాణలో దసరా పండుగ సమయంలో మద్యం విక్రయాలు భారీగా ఉంటాయి. ఇంకా వివరంగా చెప్పాలంటే డిసెంబర్ ఆఖరి మూడు రోజుల్లో అంటే డిసెంబర్ 29, 30, 31 తేదీల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణలలో కలిపి దాదాపు రూ. 1,000 కోట్ల నుండి రూ. 1,300 కోట్ల విలువైన మద్యం విక్రయాలు జరుగుతాయి. ప్రతి నిమిషానికి సగటున 90 కి పైగా లిక్కర్ బాటిళ్లు అమ్ముడవుతుంటాయి. ఈ ట్రెండ్ దేశంలోని అనేక రాష్ట్రాల్లో ఉంది. కేరళలో ఓనమ్ పండుగ సమయంలో కేరళ బేవరేజెస్ కార్పొరేషన్ ద్వారా కేవలం 10 –12 రోజుల్లోనే దాదాపు వెయ్యికోట్లకు పైగా మద్యం విక్రయాలు జరిగి సరికొత్త రికార్డు సృష్టించాయి. మద్యం ఆదాయంలో టాప్ రాష్ట్రాల విషయానికి వస్తే.. దేశంలో మద్యం వినియోగం, దాని ద్వారా వచ్చే రాబడి ఏటా రికార్డు స్థాయిలను తాకుతోంది. ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాలు ఇందులో ముందు వరుసలో ఉన్నాయి. దేశంలో తలసరి మద్యం ఖర్చులో అగ్రస్థానంలో ఉంది తెలంగాణ. ఇక్కడ ఏడాదికి సగటున ఒక వ్యక్తి మద్యం కోసం రూ. 11,351 ఖర్చు చేస్తుండగా, రాష్ట్ర ప్రభుత్వానికి దీని ద్వారా ఏటా రూ. 36,000 కోట్ల పైచిలుకు ఆదాయం లభిస్తోంది. ఇక కర్నాటక విషయానికి వస్తే దాదాపు రూ. 34,000 కోట్ల వార్షిక ఆదాయంతో దేశంలోనే అత్యధిక పన్నులు వసూలు చేసే రాష్ట్రాల్లో ఒకటిగా నిలిచింది. తమినాడు ప్రభుత్వ యాజమాన్యంలోని 'టాస్మాక్' (రూపా–హీూజ) ద్వారా ఏటా రూ. 32,000 కోట్లకు పైగా రాబడి వస్తోందని అంచనా. ఆంధ్రప్రదేశ్ లో తలసరి వార్షిక మద్యం ఖర్చు సగటున రూ. 6,399 గా ఉంది, దీని ద్వారా ప్రభుత్వానికి దాదాపు రూ. 17,500 కోట్ల ఆదాయం సమకూరుతోంది. ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, ఉత్తరాది, పశ్చిమ రాష్ట్రాల్లో కూడా ఏటా రూ. 12,000 కోట్ల నుండి రూ. 14,000 కోట్ల వరకు ఎక్సైజ్ రాబడి వస్తోంది. ప్రజాస్వామ్యంతో మోడీ ఘర్షణ ప్రస్తుతం చాలా రాష్ట్రాల్లో ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఉచిత విద్య, వైద్య, రైతు భరోసా, పెన్షన్లు వంటి సామాజిక సంక్షేమ పథకాలకు మద్యం అమ్మకాలే ప్రధాన ఇంధనంగా మారుతున్నాయి. మద్యం ద్వారా వచ్చే ఆదాయం నిలిచిపోతే, ఈ పథకాలను కొనసాగించడం దాదాపు అసాధ్యం అనే పరిస్థితి నెలకొంది. అందుకే ఎన్నికల సమయంలో 'మద్య నిషేధం' అని హామీలు ఇచ్చే రాజకీయ పార్టీలు సైతం, అధికారంలోకి వచ్చాక ఆర్థిక వాస్తవాలను చూసి వెనకడుగు వేస్తున్నాయి. నిబంధనలను సడలిస్తూ, సరికొత్త మద్యం పాలసీలతో అమ్మకాలను మరింత ప్రోత్సహిస్తున్నాయి. మద్యం అమ్మకాల ద్వారా ప్రభుత్వాల ఖజానా నిండుతున్న మాట వాస్తవమే అయినా, దీని వెనుక ఒక తీవ్రమైన సామాజిక నష్టం దాగి ఉందని విశ్లేషకులు చెబుతున్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాల సంపాదనలో అధిక భాగం మద్యం కోసమే ఖర్చవుతోంది. సంక్షేమ పథకాల ప్రజల చేతుల్లో డబ్బులు పెడుతూ, మద్యం ద్వారా ఆ డబ్బును ప్రభుత్వాలు తిరిగి లాక్కుంటున్నాయనే విమర్శలు కూడా ఉన్నాయి. ఏది ఏమైనప్పటికీ, ప్రస్తుత ఆర్థిక పరిస్థితుల్లో మద్యం అనేది ప్రభుత్వాలకు కేవలం ఒక వ్యసనం కాదు... వ్యవస్థను నడిపించే ఇంధనం అనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు.

నా వ్యాఖ్యలు స్పీకర్‌ను ఉద్దేశించి చేసినవి కావు

శాసనసభ ఘటనపై తాతా మధు వివరణ

హైదరాబాద్,సెప్టెంబర్1 : తెలంగాణ శాసనసభ బడ్జెట్ సమావేశాల సందర్భంగా సోమవారం (సెప్టెంబర్ 07) చోటుచేసుకున్న పరిణామాలపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు వివరణ ఇచ్చారు. ఈ ఘటనకు సంబంధించి తాను మాట్లాడిన మాటలను తనకు ఆపాదిస్తున్నారని పేర్కొంటూ.. ఈ విషయంపై తన వివరణ ఇవ్వాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ మేరకు ఆయన ఒక కీలక ప్రకటన చేశారు. శాసనసభలోకి వెళ్లే సమయంలో మహిళా శాసనసభ్యులతో పాటు తమ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో తోపులాట, ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయని ఎమ్మెల్సీ తాతా మధు చెప్పారు. ఈ క్రమంలో తనపై కూడా దాడి జరిగిందని, తన షర్టు, ఫ్యాంటు లాగేందుకు, గొంతు నొక్కేందుకు ప్రయత్నించినట్లు అనిపించిందని పేర్కొన్నారు. కొంతమంది తనను దుర్భాషలాడినట్లు పేర్కొన్నారు. ఈ పరిణామాలతో తీవ్ర ఆవేదనకు గురై.. తనపై దాడి చేసింది ఎవరు? తన షర్టు లాగేందుకు ఎవరు ప్రయత్నించారు? అలా చేయమని ఎవరు ఆదేశించారు? అంటూ తాను ప్రశ్నించినట్లు తాతా మధు వివరించారు. అయితే ఈ వ్యాఖ్యలను స్పీకర్‌ను ఉద్దేశించి చేసినవిగా భావించడం సరికాదని స్పష్టం చేశారు.స్పీకర్ వ్యవస్థ పట్ల, వ్యక్తిగతంగా స్పీకర్ పట్ల తనకు ఎంతో గౌరవం ఉందని తాతా మధు తెలిపారు. స్పీకర్‌ను ఉద్దేశించి తాను ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదని చెప్పారు. ఒకవేళ తన వ్యాఖ్యల్లో ఏదైనా స్పీకర్‌ను ఉద్దేశించినట్లు భావిస్తే.. ఆ మాటలను ఉపసంహరించుకుంటున్నానని, అందుకు విచారం వ్యక్తం చేస్తున్నానని పేర్కొన్నారు. శాసనసభలోకి వెళ్లే సమయంలో తమ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్యంగా మహిళా శాసనసభ్యులతో పోలీసులు వ్యవహరించిన తీరుపై తాతా మధు ఆందోళన వ్యక్తం చేశారు. మహిళా శాసనసభ్యులతో తోపులాట జరిగిందని, వారి పట్ల పోలీసులు వ్యవహరించిన తీరుపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా తమ సీనియర్ నాయకులను పోలీసులు అక్కడి నుంచి తీసుకెళ్లారని ఆయన తెలిపారు. ప్రజలచే ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులతో వ్యవహరించే విషయంలో ప్రభుత్వం తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.శాసనసభ్యులపై జరిగినట్లు పేర్కొన్న పరిణామాలపై ప్రభుత్వం స్పందించాలని తాతా మధు డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి, హోంశాఖ మంత్రి రేవంత్ రెడ్డి ఈ ఘటనపై స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. తాను మాట్లాడిన వ్యాఖ్యలపై ఏర్పడిన వివాదం కంటే.. శాసనసభలో చోటుచేసుకున్న అసలు పరిణామాలపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని తాతా మధు పేర్కొన్నారు. ప్రజాప్రతినిధుల పట్ల జరిగిన ఘటనలపై సమగ్రంగా పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.శాసనసభలో చోటుచేసుకున్న పరిణామాలపై అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య భిన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో.. తాతా మధు ఇచ్చిన తాజా వివరణ రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది.

తిరుపతికి మరో వందే భారత్ ఎక్స్‌ప్రెస్..!

అమరావతి,సెప్టెంబర్7 : తిరుమల శ్రీవెంకటేశ్వర స్వామిని దర్శించుకునే భక్తులకు, కర్ణాటక–ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య ప్రయాణించే వారికి భారతీయ రైల్వే శాఖ తీపి కబురు అందించింది. కర్ణాటకలోని శివమొగ్గ టౌన్ నుండి బెంగళూరు మీదుగా ఆంధ్రప్రదేశ్‌లోని ఆధ్యాత్మిక క్షేత్రం తిరుపతికి నూతన 'వందే భారత్ ఎక్స్‌ప్రెస్' రైలును ప్రారంభించాలని రైల్వే బోర్డు ప్రతిపాదించింది. ఓ ఎంపీ అభ్యర్థన మేరకు రైల్వే బోర్డు సానుకూలంగా స్పందించింది. ఈ ప్రతిపాదనతో ఏపీలో మరో వందే భారత్ ఎక్స్‌ప్రెస్ అందుబాటులోకి రానుంది. శివమొగ్గ పట్టణం, తిరుపతి మధ్య బెంగళూరు మీదుగా కొత్త వందే భారత్ ఎక్స్‌ప్రెస్ నడపాలన్న తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి అభ్యర్థనకు రైల్వే బోర్డు సానుకూలంగా స్పందించింది. ఈ సర్వీసు కోసం అధికారిక ప్రతిపాదనను కూడా సిద్ధం చేసినట్లు సమాచారం.తిరుపతి నుంచి రైలు అనుసంధానాన్ని విస్తరించి, మెరుగుపరచాలన్న ఎంపీ అభ్యర్థన మేరకు నైరుతి రైల్వే రూపొందించిన కార్యాచరణ ప్రణాళికలో ఈ ప్రతిపాదనను చేర్చారు. ఈ ప్రతిపాదనను పరిగణనలోకి తీసుకున్నందుకు రైల్వే బోర్డు ఛైర్మన్, సీఈఓకు గురుమూర్తి ధన్యవాదాలు తెలిపారు. అలాగే, మిగిలిన లాంఛనాలను వీలైనంత త్వరగా పూర్తి చేసి, త్వరలోనే ఈ సేవను ప్రారంభించాలని అధికారులను కోరారు.ప్రతిపాదిత రైలు తిరుపతి, శివమొగ్గ, బెంగళూరు మధ్య అనుసంధానాన్ని మెరుగుపరుస్తుందని, తద్వారా యాత్రికులకు, అలాగే విద్య, ఆరోగ్య సంరక్షణ, ఉపాధి, ఇతర ప్రయోజనాల కోసం ప్రయాణించే ప్రజలకు ప్రయోజనం చేకూరుస్తుందని భావిస్తున్నారు.

కుటుంబ బంధం అవసరం !

తిరుమల : ఆవు తనకు కట్టిన పలుపుతాడు తెంచుకొని వెళ్ళిపోవాలనుకుని అటు, ఇటు చుట్టూ తిరుగుతుంది. చివరకు తన పరిధి తాను తెలుసుకుని చతికిలపడుతుంది. మన నిస్సహాయతను మనం తెలుసుకోవాలి. అదే సమయంలో మనల్ని ఇలా ఉంచినవాడి గొప్పదనాన్ని గ్రహించాలి. ఎవరిమీదో కోపం వస్తుంది. ఎందుకో కోపం వస్తుంది. పారిపోవాలని అనిపిస్తుంది. తాళ్లతో కట్టి బంధించరెవరూ! అయినా వెళ్ళలేం. ఎందుకు, ఎవరు మనల్ని ఆపుతున్నారో తెలియదు.చూసిన ముఖాలే చూస్తూ, ఆడిన మాటలే ఆడుతూ, అదే తిండి తింటూ, నిద్రపోతూ తెల్లవారి లేచి మరో కొత్త సూర్యుడి కోసం ఎదురు చూస్తాం. ఇదే బంధం. మౌలికంగా మనిషి బతకడంలోనే బంధం ఉంది. అందం ఉంది. బంధాలు అందంగా ఉంటాయి. అవి ఇనుప గొలుసులైతేనేం, బంగారు గొలుసులైతేనేం– బంధాలు బయటకు కనిపించవు. తల్లి వెంట బిడ్డ, బిడ్డ వెంట తల్లి... ఆ బిడ్డ ఎదిగి తల్లి... అలా అందరూ కలిసి కుటుంబం. ఈ కుటుంబాలన్నీ ఈశ్వరుడివే.పరిస్థితులు అనుకూలంగా లేనప్పుడు మనసు వైరాగ్యానికి గురి అయినప్పుడు తట్టా బుట్టా సర్దుకుని ఎక్కడికైనా వెళ్ళిపోదాం అనిపిస్తుంది. కానీ, అంతలోనే ఆగిపోవాలి అనిపిస్తుంది. కనపడకుండా ఆపేదెవరని ఆలోచిస్తే– మనవాళ్లే కాదు... మనమధ్యలో ఉండే బంధమే అనిపిస్తుంది. కుటుంబ బంధం అంత బలమైనది. అందులోనే అందం, ఆనందం ఉంది.



ఆధ్యాత్మికం

హామీల అమలుకు బీఆర్ఎస్ పోరు

● కేసీఆర్‌పై వ్యాఖ్యలపైనా నిరసన.. కాప్రా సర్కిల్ వద్ద ధర్నా ● 420 హామీలు, 13 డిక్లరేషన్లు, 6 గ్యారంటీలు అమలు చేయాలని డిమాండ్

మేడ్చల్, సెప్టెంబర్ 7: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన 420 హామీలు, 13 డిక్లరేషన్లు, 6 గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ నాయకులు సోమవారం కాప్రాలో ఆందోళన చేపట్టారు. ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు ప్రజావాణి కార్యక్రమంలో సంబంధిత అధికారులకు వినతిపత్రం అందజేశారు. అనంతరం కాప్రా మున్సిపల్ కార్యాలయంలో డీసీకి వినతిపత్రం సమర్పించి ధర్నా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చిందని, అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే హామీలను అమలు చేస్తామని ప్రకటించినప్పటికీ ఇప్పటివరకు అనేక హామీలు అమలుకు నోచుకోలేదని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుని హామీలను పూర్తి స్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం జాప్యం చేయకుండా తక్షణమే చర్యలు చేపట్టాలని కోరారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ నిరంతరం పోరాడుతుందని నాయకులు స్పష్టం చేశారు.కాగా, బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు (కేసీఆర్)పై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ కాప్రా సర్కిల్ కార్యాలయం వద్ద బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. కార్యకర్తలు రోడ్డుపై బైఠాయించి నినాదాలు చేస్తూ ధర్నా నిర్వహించడంతో కాప్రా సర్కిల్ పరిసర ప్రాంతాల్లో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సుమారు కిలోమీటర్ మేర ట్రాఫిక్ నిలిచిపోవడంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు సోమశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనతో పాటు రాష్ట్ర అభివృద్ధికి కృషి చేసిన కేసీఆర్‌పై ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తి వ్యక్తిగత విమర్శలు, అవమానకర వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. రాజకీయంగా భిన్నాభిప్రాయాలు ఉండటం సహజమేనని, అయితే రాజకీయ ప్రత్యర్థుల అభిప్రాయాలను గౌరవించాలని అన్నారు. కేసీఆర్‌పై చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకుని ముఖ్యమంత్రి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య విలువలను, రాజకీయ విభేదాలను గౌరవించాలని కోరారు. ఆందోళన నేపథ్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేసి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. నిరసనలో పాల్గొన్న పలువురు బీఆర్ఎస్ కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు కొత్త రామారావు, జెర్రీ పోతుల ప్రభుదాస్, పన్నాల దేవేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు కాసం మైపాల్‌రెడ్డి, మహేష్‌గౌడ్, నవీన్‌గౌడ్, బద్రుద్దీన్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేల అరెస్ట్‌పై భగ్గుమన్న బీఆర్ఎస్.. కరీంనగర్‌లో భారీ రాస్తారోకో

కరీంనగర్ టౌన్, సెప్టెంబర్7: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తయినా సబ్బండ వర్గాలను మోసం చేసిందని, ఏ ఒక్క వర్గం కూడా సంతోషంగా లేదని నిరసిస్తూ బీఆర్ఎస్ పార్టీ చేపట్టిన ఆందోళనలు ఉధృతమయ్యాయి. ప్రజా సమస్యలపై నిలదీసేందుకు అసెంబ్లీ సమావేశాలకు నల్ల చొక్కాలు ధరించి వెళ్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను పోలీసులు అడ్డుకుని, అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని నిరసిస్తూ కరీంనగర్‌లో గులాబీ శ్రేణులు కదం తొక్కాయి.?కరీంనగర్ బీఆర్ఎస్ నగర శాఖ అధ్యక్షులు చల్ల హరిశంకర్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు భారీ సంఖ్యలో తరలివచ్చి కరీంనగర్ బస్టాండ్ ఎదురుగా రాస్తారోకో నిర్వహించారు. రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేశారు. ఈ ఆందోళన కారణంగా ప్రధాన రహదారిపై కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయి భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. వెయ్యి రోజుల పాలనలో సర్వనాశనమైన వ్యవస్థలు ఈ సందర్భంగా నగర బీఆర్ఎస్ అధ్యక్షులు చల్ల హరిశంకర్, తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ వెయ్యి రోజుల పాలనలో రాష్ట్రంలో ఏ ఒక్క వర్గం కూడా సంతోషంగా లేదని ధ్వజమెత్తారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ అందడం లేదని, నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్ లేదు, పేదలకు ఆసరా పెన్షన్లు సక్రమంగా అందడం లేదని విమర్శించారు. రైతన్నలకు రైతుబంధు, రైతు బీమా కరవయ్యాయని, జీవిత కాలం సేవ చేసి రిటైర్ అయిన ఉద్యోగులకు కూడా రిటైర్మెంట్ బెనిఫిట్స్ రాక నానా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఇలా అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం, ప్రజా సమస్యలపై అసెంబ్లీలో ప్రశ్నిస్తారనే భయంతోనే నల్ల చొక్కాలతో వస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అరెస్ట్ చేయించిందని మండిపడ్డారు. ఇది కాంగ్రెస్ ప్రభుత్వ చేతకాని పాలనకు పరాకాష్ట అని విమర్శించారు.తక్షణమే ఎమ్మెల్యేలను విడుదల చేయాలని డిమాండ్అరెస్ట్ చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను వెంటనే బేషరతుగా విడుదల చేయాలని, వారిని అసెంబ్లీలోకి అనుమతించాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలపై గళం విప్పితే అణచివేయాలని చూస్తే ప్రజలే తగిన విధంగా బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు గారు, బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు జివి రామకృష్ణ రావు , మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్ , మాజీ గ్రంథాలయ చైర్మన్ పొన్ను అనిల్ కుమార్ , బిఆర్ఎస్ పార్టీ కార్పొరేటర్లు మాజీ కార్పొరేటర్లు, డివిజన్ ఇన్చార్జిలు డివిజన్ అధ్యక్షులు నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో రాస్తారోకలో పాల్గొని ప్రభుత్వ తీరుపై తీవ్ర నిరసన తెలిపారు.

ఆరు గుంటల భూమి... అన్నకు దక్కని వాటా!

- వారసత్వ భూమిలో వాటా ఇవ్వకుండా నిర్మాణాలు చేస్తున్నారంటూ ఆరోపణ - తమ్ముడిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు బాధితుడి ఫిర్యాదు



పెద్దపల్లి ప్రతినిధి : తండ్రి నుంచి వారసత్వంగా వచ్చిన ఆరు గుంటల స్థలంలో తనకు రావాల్సిన వాటా ఇవ్వకుండా, తన తమ్ముడు మొత్తం స్థలాన్ని తన భార్య పేరున రిజిస్ట్రేషన్ చేయించి ప్రస్తుతం అక్కడ ఇల్లు నిర్మిస్తున్నాడని భోజనపేట గ్రామానికి చెందిన ఆవులయ్య ఆరోపించారు. ఈ సమస్యపై అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు పరిష్కారం లభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆవులయ్య వివరాల ప్రకారం.. ఆయన తండ్రి చిన్న మల్లేష్ నుంచి వారసత్వంగా వచ్చిన ఆరు గుంటల స్థలంలో తనకు, తన తమ్ముడు ఆవుల ఓదెలుకు సమాన వాటా ఉందన్నారు. అయితే తనకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా మొత్తం ఆరు గుంటల స్థలాన్ని తమ్ముడు తన భార్య పేరున రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ఆరోపించారు. ఈ విషయమై తమ్ముడిని ప్రశ్నించడంతో తనను దుర్భాషలాడుతూ దాడి చేసి గాయపరిచాడని ఆవులయ్య తెలిపారు. ఈ ఘటనపై పెద్దపల్లి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నంబర్ 32/2025 నమోదైందని పేర్కొన్నారు. ప్రస్తుతం తన వాటాను పరిగణనలోకి తీసుకోకుండా అదే స్థలంలో ఇల్లు నిర్మిస్తున్నారని ఆరోపించారు. వివాదాన్ని పరిష్కరించేందుకు గ్రామ పెద్దల సమక్షంలో పంచాయతీ నిర్వహించగా, తన వాటాకు న్యాయం చేయాలని నిర్ణయించినప్పటికీ ఆ నిర్ణయాన్ని సైతం తమ్ముడు పట్టించుకోవడం లేదని ఆవులయ్య అన్నారు. దీంతో కలెక్టర్ కార్యాలయాన్ని ఆశ్రయించి పలుమార్లు ఫిర్యాదు చేసినా అధికారులు తన సమస్యపై తగిన చర్యలు తీసుకోవడం లేదని వాపోయారు. “కోర్టుకు వెళ్లాల్సిందే.. మేమేమీ చేయలేం” అంటూ అధికారులు చెబుతున్నారని ఆయన తెలిపారు. వారసత్వ భూమిలో తనకు ఉన్న హక్కు, వాటాను పరిశీలించి న్యాయం చేయడంతో పాటు, వివాదంపై సమగ్ర విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని ఆవులయ్య అధికారులను కోరారు.

ఎంఎస్పి మహిళా విభాగం మండలాధ్యక్షురాలిగా మాతంగి శ్రీజ

శంకరపట్నం, సెప్టెంబర్7: కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలకేంద్రంలో పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు ఆడెపు నరసయ్య మాదిగతో పాటు ముఖ్య నాయకుల ఆధ్వర్యంలో ఎంఎస్పి మహిళా విభాగానికి ఎన్నికలు నిర్వహించారు. మండలాధ్యక్షురాలిగా మాతంగి శ్రీజ మాదిగ, అధికార ప్రతినిధిగా మాతంగి రాజేశ్వరి మాదిగను ఎన్నుకుని శాలువాతో సన్మానించి అభినందించారు. ఎంఆర్పిఎస్ రాష్ట్ర సీనియర్ నాయకులు ఆవుల ప్రభాకర్ మాదిగ, ఎంఎస్పీ కన్వీనర్ బుద్దుల వాణి,కో-కన్వినర్ లోకిని అంజలి, ఎంఆర్పిఎస్ మండలాధ్యక్షుడు కోడూరీ మహేష్ మాదిగ, ఎంఎస్పి అధ్యక్షుడు నాత్రి సమ్మయ్య మాదిగ, ఎమ్మార్పీఎస్ అధికార ప్రతినిధి యమునూరు నాగరాజు మాదిగ, కలకోట సమ్మయ్య మాదిగ, బిక్షపతి,పావని లక్ష్మీ,మాదిగ మహిళలు అధిక సంఖ్యలో ఎన్నికలో పాల్గొన్నారు.

మేడిపల్లి హెచ్ఎండీఏ లేఔట్‌లో నిబంధనల ప్రకారం నిర్మాణాలు చేపట్టాలి

ప్రజావాణిలో బోడుప్పల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌కు వెల్ఫేర్ అసోసియేషన్ వినతి

మేడ్చల్, సెప్టెంబర్ 07(ది క్రైమ్ న్యూస్): మేడిపల్లి హెచ్ఎండీఏ లేఔట్‌లో నిబంధనలకు అనుగుణంగా ఇళ్ల నిర్మాణాలు జరిగేలా అధికారులు చర్యలు చేపట్టాలని కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ పరిధిలో నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేసిన నిబంధనల ప్రకారమే ఇళ్ల నిర్మాణాలు చేపట్టేలా పర్యవేక్షించాలని విజ్ఞప్తి చేశారు. సోమవారం బోడుప్పల్ సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎంపల్లి పద్మారెడ్డి, ఈదునూరి హేమంత్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రతినిధులు డిప్యూటీ కమిషనర్ శైలజకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా లేఔట్‌లో ఇళ్ల నిర్మాణాల సమయంలో నిబంధనలు పాటించేలా అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలనలు నిర్వహించాలని, అనుమతులకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడితే తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కాలనీ అభివృద్ధి, ప్రజల సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని నిబంధనల అమలుపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని వారు విజ్ఞప్తి చేశారు. ప్రజావాణిలో సమర్పించిన వినతిపత్రంపై సానుకూలంగా స్పందించిన అధికారులు సమస్యను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో రాజిరెడ్డి, డీఎస్ నాయక్, సాంబయ్య, సంతోష్‌రెడ్డి, హనుమాన్‌రెడ్డి, శ్రీనివాస్, వెంకటేష్, సతీష్, నవీన్, అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడిగా కనకం అశోక్

మానకొండూర్, సెప్టెంబర్7: కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం పచ్చునూరుకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కనకం అశోక్ కాంగ్రెస్ ఎస్సీ సెల్ మండలా ధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు కొరివి అరుణ్ కుమార్ నియామక పత్రాన్ని అశోక్ కు అందజేశారు. తనపై నమ్మకంతో మరోసారి ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడిగా నియమించడం పట్ల టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్, ఎమ్మెల్యే కవ్వంపల్లికి, జిల్లా అధ్యక్షుడు కొరివి అరుణ్ కుమార్ కి సహకరించిన కాంగ్రెస్ నాయకులకు కృతజ్ఞతలు తెలుపుతూ ఎస్సీ వర్గాల సమస్యలను పరిష్కరిస్తూ మండలంలో కాంగ్రెస్ బలోపేతానికి తన శాయశక్తులా కృషి చేస్తానని కనకం అశోక్ హామీ ఇచ్చారు.

కొత్తపల్లి స్వయంభు శ్రీ వెంకటేశ్వర స్వామి చిన్నగుట్ట గిరి ప్రదక్షిణ విజయవంతం

కరీంనగర్ టౌన్, సెప్టెంబర్7: కరీంనగర్ జిల్లా కొత్తపల్లి స్వయంభు శ్రీ వెంకటేశ్వర స్వామి వారి చిన్నగుట్ట గిరి ప్రదక్షిణ కార్యక్రమం సోమవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. సుమారు 1,500 మంది భక్తులు ఈ గిరి ప్రదక్షిణలో పాల్గొని “గోవిందా... గోవిందా...” నామస్మరణతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పారు.ఉదయం 7.15 గంటలకు పూజ్య గురువులు, సురేష్ ఆత్మారామ్ మహారాజ్ ఆధ్వర్యంలో గోమాత పూజ నిర్వహించిన అనంతరం గిరి ప్రదక్షిణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన భక్తులు భక్తిశ్రద్ధలతో గిరి ప్రదక్షిణలో పాల్గొన్నారు.పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్ వినియోగాన్ని నివారించాలనే సంకల్పంతో కార్యక్రమ నిర్వాహకులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. గిరి ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులకు ప్రసాదం, అరటి పండ్లు, మంచినీరు అందజేశారు. పర్యావరణ పరిరక్షణపై భక్తుల్లో అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా సురేష్ ఆత్మారామ్ మహారాజ్ మాట్లాడుతూ, ప్రతినెల అమావాస్యకు ముందు వచ్చే ఏకాదశి రోజున కొత్తపల్లి స్వయంభు శ్రీ వెంకటేశ్వర స్వామి చిన్నగుట్ట గిరి ప్రదక్షిణ కార్యక్రమం క్రమం తప్పకుండా నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ “దేశం -- ధర్మం -- దేవుడు” అనే ధార్మిక భావనతో ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దివ్య ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. భక్తులు ప్రతినెల జరిగే గిరి ప్రదక్షిణలో పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు. గిరిప్రదక్షిణ అనంతరం సురేష్ ఆత్మారామ్ చేతులమీదుగా వెంకటేశ్వర స్వామి దేవాలయ ముఖద్వార తోరణానికి(ఆర్చ్) భూమిపూజ చేశారు.ఈ కార్యక్రమంలో బండ గోపాల్ రెడ్డి, బండ కిషన్ రెడ్డి, నరహరి నారాయణ రెడ్డి, పెద్ది కొమురయ్య (కుమార్), శ్రీనివాస్ రెడ్డి వూట్కూరి, బోగ సుదర్శన్, ముత్యం గణపతి, సామల శ్రీనివాస్, బూస శంకర్, మందల నారాయణ రెడ్డి, లెంకల రాజభాస్కర్ రెడ్డి, మాజీ సర్పంచ్ అంబికాదేవి, కార్పొరేట్ వేముల కవితాచంద్రశేఖర్, జనార్ధన్ రెడ్డి తదితరులతో పాటు వివిధ పట్టన, గ్రామాలకు చెందిన ప్రజలు, భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో సహకరించిన తెలంగాణ శ్రీనివాసుల సేవా సంస్థకు భక్తులకు శ్రీ వెంకటేశ్వర దేవాలయ ట్రస్టు, కొత్తపల్లి ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

ఇందిరమ్మ ఇల్లు.. నిరుపేద కుటుంబానికి కొత్త వెలుగు

కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలతో పేదల జీవితాల్లో మార్పు: దేశిని కోటి

జమ్మికుంట సెప్టెంబర్ 7 : పదేళ్లుగా సొంతింటి కోసం ఎదురుచూస్తున్న నిరుపేద కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా సొంతింటి కల సాకారమైంది. జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లి ప్రాంతం 4వ వార్డుకు చెందిన లాడే శ్యామ్‌రావు దంపతులు నూతన గృహంలోకి అడుగుపెట్టారు. ఈ సందర్భంగా నిర్వహించిన గృహప్రవేశ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు దేశిని కోటి పాల్గొని శ్యామ్‌రావు దంపతులను అభినందించారు. ఈ సందర్భంగా శ్యామ్‌రావు మాట్లాడుతూ.. గత పదేళ్లుగా సొంత ఇల్లు నిర్మించుకోవాలనే కోరిక ఉన్నప్పటికీ ఆర్థిక పరిస్థితుల కారణంగా సాధ్యం కాలేదని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా, హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్‌బాబు సహకారంతో ఇల్లు మంజూరైందన్నారు. ఆరు నెలల్లోనే ఇంటి నిర్మాణం పూర్తి చేసుకుని గృహప్రవేశం చేసుకోవడం ఎంతో ఆనందంగా ఉందని, తన కలను సాకారం చేసిన సీఎం రేవంత్‌రెడ్డికి, వొడితల ప్రణవ్‌బాబుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసి శ్యామ్‌రావు దంపతులు భావోద్వేగానికి గురయ్యారు. దేశిని కోటి మాట్లాడుతూ.. నిరుపేద కుటుంబాలకు అండగా నిలవడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రభుత్వం మాటల్లో కాకుండా చేతల్లో సంక్షేమాన్ని చూపిస్తోందని తెలిపారు. వొడితల ప్రణవ్‌బాబు నాయకత్వంలో హుజురాబాద్ నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్లు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల మంజూరు, పట్టణాలు, గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు వొడితల ప్రణవ్‌బాబుకు ప్రజలు అండగా నిలిచి ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో 18వ వార్డు కౌన్సిలర్ కుదాడి తిరుపతి, మాజీ కౌన్సిలర్ బొంగోని వీరన్న, పట్టణ కాంగ్రెస్ నాయకులు పంజాల అజయ్, 4వ వార్డు అధ్యక్షులు టెంకురాల కిషోర్, రాజేష్, లాడే రామారావు, సాయినాథ్, యూత్ అసోసియేషన్ సభ్యులు కందారపు రాజేష్, బలబత్తుల శ్రీకాంత్, గోపి, శ్రీధర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా పాలనలో అర్హతగల ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు

మహేశ్వరం మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు నేనావత్ రాజు నాయక్

మహేశ్వరం సెప్టెంబర్ 07,: ప్రజా పాలనలో అర్హతగల ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందేలా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందని మహేశ్వరం మండల సర్పంచ్ ల ఫోరం అధ్యక్షుడు ఉప్పుగడ్డ తండా సర్పంచ్ నేనవత్ రాజు నాయక్ పేర్కొన్నారు. సోమవారం మహేశ్వరం మండల పరిధిలోని ఉప్పుగడ్డ తండా గ్రామపంచాయతీలో అర్హత కలిగిన కుటుంబాలకు డిజిటల్ రేషన్ కార్డులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు గృహ జ్యోతి రుణమాఫీ 500 రూపాయలకే వంట గ్యాస్ సిలిండర్ ఉచిత బస్సు ఆరోగ్యశ్రీ లాంటి మరెన్నో పథకాలను ప్రజలకు లభిస్తుండడంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారని ఆయన ఈసందర్భంగా గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి ఈశ్వర్ నాయక్ ఉపసర్పంచ్ మోహన్ నాయక్ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, పార్టీ నాయకులు శ్రీను నాయక్, తదితరులు పాల్గొన్నారు.

పురాతన ఆలయాల సంరక్షణకు కట్టుబడి ఉన్నాం

● గోదావరి పుష్కరాలను అద్భుతంగా నిర్వహిస్తాం ● ధర్మపురి నియోజకవర్గంలో రూ. 200 కోట్లతో పుష్కరాళ్ల అభివృద్ధి పనులు ● ఉగ్ర నరసింహా స్వామి పునర్ నిర్మాణంలో పాల్గొనడం అదృష్టం ● ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

ధర్మపురి, సెప్టెంబర్ 7, : రాష్ట్రంలోని పురాతన ఆలయాల సంరక్షణకు రాష్ట్రంలో రేవంత్ రెడ్డి నాయకత్వంలో పనిచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. జగిత్యాల జిల్లా ధర్మపురి లోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో ఉగ్ర నరసింహా స్వామి పునర్ నిర్మాణ పనులకు సోమవారం తెల్లవారుజామున రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు లతో కలిసి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ వేద పండితులు మంత్రులకు పూర్ణకుంభ తో స్వాగతం పలికారు. ముందుగా ఉగ్ర నరసింహ స్వామి ఆలయంలో ఉపముఖ్యమంత్రి తో పాటు మంత్రి లక్ష్మణ్ కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శాస్త్రోక్తంగా నిర్వహించిన భూమి పూజ కార్యక్రమంలో మంత్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క మాట్లాడుతూ 9 ఏళ్ల బీఆర్ఎస్ పాలనకు చరమగీతం పాడిన తెలంగాణ ప్రజలు రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకున్నారని అన్నారు. ప్రజలు ఎన్నుకున్న ప్రజా ప్రభుత్వంలో ప్రజల ఆలోచనలకు అనుగుణంగా పరిపాలన సాగిస్తున్నామని అన్నారు. 2027లో నిర్వహించే గోదావరి పుష్కరాలను రాష్ట్ర ప్రభుత్వం అద్భుతంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. ఇందులో భాగంగా బాసర నుండి భద్రాచలం వరకు ఉన్న ప్రముఖ ఆలయాలను అభివృద్ధి చేయడంతో పాటు పుష్కరాలకు వచ్చే భక్తులకు మౌలిక సదుపాయాలు కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. పుష్కరాల పనులు నిర్వహించడానికి బడ్జెట్లో వెయ్యి కోట్లు కేటాయించినట్లు ఉప ముఖ్యమంత్రి తెలిపారు. ధర్మపురి నియోజకవర్గంలోని ధర్మపురి, కోటిలింగాల క్షేత్రాల అభివృద్ధికి రూ. 200కోట్లు కేటాయించినట్లు భట్టి తెలిపారు. వందల ఏళ్ల చరిత్ర కలిగిన ధర్మపురి ఉగ్ర నరసింహా స్వామి పునర్ నిర్మాణ పనుల ప్రారంభానికి రావడం అదృష్టంగా ఉందని ఉపముఖ్యమంత్రి అన్నారు. అద్భుతమైన కార్యక్రమంలో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నట్లు భట్టి విక్రమార్క తెలిపారు. వచ్చే పుష్కరాల నాటికి ఆలయ అభివృద్ధి పనులు పూర్తి చేస్తామని భట్టి విక్రమార్క ఈ సందర్భంగా వివరించారు. ధర్మపురి లోని ఉగ్ర నరసింహా స్వామి ఆలయ పునర్ నిర్మాణ పనులకు ప్రభుత్వం రూ. 10 కోట్ల కేటాయించగా పనుల ప్రారంభానికి ఉపముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. ధర్మపురి మండలం తిమ్మాపూర్ గ్రామంలో నూతనంగా రూ. 2.48 కోట్లతో ఏర్పాటు చేస్తున్న నూతన సబ్ స్టేషన్ పనులకు శంకుస్థాపన చేశారు. 2027 గోదావరి పుష్కరాలకు చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా ధర్మపురి వద్ద గోదావరిలో పుష్కర ఘాట్ల నిర్మాణానికి రూ. 22. 16 కోట్లతో చేపట్టిన పనులకు శంకుస్థాపన చేశారు. ధర్మపురి, కోటి లింగాలలో రూ. 58.55 కోట్లతో తొమ్మిది రోడ్ల నిర్మాణ పనులకు భట్టి విక్రమార్క శంకుస్థాపన చేశారు. ధర్మపురి నియోజకవర్గంలో పర్యటించిన ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ధర్మపురి నియోజకవర్గంలో నిర్వహించే గోదావరి పుష్కరాలకు మరో 80 కోట్ల రూపాయలు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. గోదావరి పుష్కరాలకు ఇప్పటికే ధర్మపురి నియోజకవర్గానికి 117 కోట్లు విడుదల గాక ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క రూ. 80కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించడంతో ధర్మపురి నియోజకవర్గానికి గోదావరి పుష్కరాల నిధులు సుమారుగా 200 కోట్లకు చేరింది. అనంతరం లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ లక్ష్మీ నరసింహ స్వామి దయతో గోదావరి పుష్కరాల పనులు ఎలాంటి ఆటంకం లేకుండా ముందుకు సాగాలని వేడుకున్నారు. ధర్మపురి క్షేత్రంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి దయతో ముందుకు సాగుతున్నామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ధర్మపురి ప్రజల ఆశీస్సులతో విజయం సాధించి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నానని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

‘విజ్జన్నగర్’ బోర్డుకు.. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధమేంటి?

● వీరనారి చాకలి ఐలమ్మ పేరు పెట్టాలని రజక సంఘం డిమాండ్

పెద్దపల్లి ప్రతినిధి : పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని మినీ ట్యాంక్‌బండ్ సమీపంలో రాందేవ్ బాబా ఆలయం వద్ద ఏర్పాటు చేసిన ‘విజ్జన్నగర్’ బోర్డుపై జిల్లా రజక సంఘం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ బోర్డు ఏర్పాటు వెనుక ఉద్దేశం ఏమిటని, ఇందిరమ్మ ఇళ్లకు దీనికి ఉన్న సంబంధం ఏమిటని స్థానిక ఎమ్మెల్యే చింతకుంట విజయరామారావు, సంబంధిత కాంగ్రెస్ నాయకులు స్పష్టత ఇవ్వాలని రజక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. బోర్డు ఏర్పాటు చేసిన స్థలానికి సంబంధించిన హక్కులు, అనుమతులు, ఆధారాలు, నిర్ణయ ప్రక్రియపై పూర్తి వివరాలను ప్రజలకు వెల్లడించాలని కోరారు. ‘విజ్జన్నగర్’ పేరుతో బోర్డు ఏర్పాటు చేయడానికి, ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు మధ్య ఏదైనా సంబంధం ఉంటే అందుకు సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వులు, నిబంధనలు, అధికారిక ఆధారాలను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. రజకుల హక్కులకు సంబంధించినదిగా పేర్కొంటున్న భూమిపై బోర్డు ఏర్పాటు చేయడానికి ఎలాంటి అనుమతులు ఉన్నాయో స్పష్టం చేయాలని విజ్ఞప్తి చేశారు. ‘విజ్జన్నగర్’ పేరుకు బదులుగా రజకుల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన వీరనారి చాకలి ఐలమ్మ పేరు పెట్టాలని నాయకులు డిమాండ్ చేశారు. ప్రస్తుత బోర్డును తొలగించి ఐలమ్మ పేరుతో కొత్త బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే రజక సంఘం వ్యవహారాలు, నిర్ణయాలపై సభ్యులకు పూర్తి సమాచారం అందించాలని అన్నారు. సభ్యులను పోలీస్‌స్టేషన్‌కు పిలిచిన సందర్భాలు ఉంటే అందుకు గల కారణాలు, ఫిర్యాదు లేదా చట్టపరమైన అంశాలను స్పష్టంగా తెలియజేయాలని కోరారు. “ప్రశ్నించడం ప్రజాస్వామ్య హక్కు. ప్రశ్నలకు వాస్తవాధారాలతో సమాధానం ఇవ్వాలి” అని నాయకులు పేర్కొన్నారు. సమస్య పరిష్కారం కాకపోతే కుల, ప్రజా సంఘాల మద్దతుతో ప్రజాస్వామ్యబద్ధంగా, శాంతియుత పద్ధతిలో తదుపరి కార్యాచరణ చేపడతామని రజక సంఘం నాయకులు తెలిపారు. అవసరమైతే ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట కూడా శాంతియుత నిరసన చేపడతామని ఓ పత్రిక ప్రకటనలో జిల్లా అధ్యక్షుడు రమేష్ బొడ్డుపల్లి, లాండ్రీ షాప్ అసోసియేషన్ అధ్యక్షుడు నవీన్ కుమార్, జిల్లా రజక సంఘం నాయకుడు కుమారస్వామి, జిల్లా కార్యదర్శి సంపత్ కుమార్, అంజిబాబు తదితరులు డిమాండ్ చేసారు.

తాతా మధు వెంటనే దళితులకు క్షమాపణ చెప్పాలి..

స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు దళితుల ఆత్మగౌరవాన్ని కించపరిచేలా ఉన్నాయి..

కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ సెక్రటరీ, ఎస్సీ సెల్ జనరల్ సెక్రటరీ దొడ్డే శ్రీకాంత్

జమ్మికుంట సెప్టెంబర్ 7 : బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ తాతా మధు దళిత స్పీకర్‌పై చేసిన అనుచిత, అమర్యాదకర వ్యాఖ్యలను కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ తరఫున తీవ్రంగా ఖండిస్తున్నామని కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ సెక్రటరీ, ఎస్సీ సెల్ జనరల్ సెక్రటరీ దొడ్డే శ్రీకాంత్ అన్నారు.స్పీకర్ పదవి భారత రాజ్యాంగం కల్పించిన అత్యున్నత పదవుల్లో ఒకటని, అలాంటి పదవిలో ఉన్న ఒక దళిత బిడ్డను హేళనగా మాట్లాడటం అంటేరాజ్యాంగాన్ని, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాలను అవమానించడ మేనని ఆయన పేర్కొన్నారు. తాతా మధు వ్యాఖ్యల ద్వారా దళితులు ఉన్నత పదవుల్లో ఎదగడాన్ని జీర్ణించుకోలేని బీఆర్ఎస్ నాయకుల కుల అహంకారం బయటపడిందని శ్రీకాంత్ విమర్శించారు. అధికారం కోసం దళితుల సంక్షేమం పేరుతో నినాదాలు చేసి, అదే దళితులను అవమానించడం వారి నిజస్వరూపాన్ని తెలియజేస్తోందన్నారు. సాధారణ దళితకుటుంబం నుంచివచ్చి స్పీకర్ స్థాయికి ఎదిగిన వ్యక్తిని విమర్శించడం కాకుండా గౌరవించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. స్పీకర్‌ను కించపరిచే వ్యాఖ్యలు చేయడం రాష్ట్రంలోని దళిత సమాజం ఆత్మగౌరవాన్ని కించపరిచినట్లేనని అన్నారు.ఈ సందర్భంగా తాతా మధుతో పాటు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, కేటీఆర్‌లు 24 గంటల్లోగా బహిరంగంగా స్పీకర్‌కు, దళిత సమాజానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అలాగే తాతా మధుపై బీఆర్ఎస్ పార్టీ తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.లేనిపక్షంలో కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని శ్రీకాంత్ హెచ్చరించారు. దళితుల ఆత్మగౌరవం కోసం ఎంతవరకైనా పోరాడుతామని స్పష్టం చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

లక్షెట్టిపేట, సెప్టెంబర్ 07, : పట్టణంలోని 33/11 కెవి సబ్ స్టేషన్ లో నూతన బ్రేకర్స్ అమర్చుట, మరమ్మతుల కొరకు మంగళవారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు లక్షెట్టిపేట, ఉత్కూర్ , మొదెల, గంపలపల్లి, ఇటిక్యాల గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుంది. కావున వినియోగదారులు సహకరించాలని లక్షెట్టిపేట విద్యుత్ శాఖ ఏఈ గణేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఎలక్ట్రిసిటీ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్‌గా తిరుపతి

లక్షెట్టిపేట, సెప్టెంబర్ 7 :: ఎలక్ట్రిసిటీ డిపార్ట్మెంట్ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ (ఆపరేషన్స్) గా తిరుపతి సోమవారం ఏడీ కార్యాలయంలో ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. కాగా, హనుమకొండ కార్పొరేట్ కార్యాలయం నుంచి బదిలీపై వచ్చిన నూతన ఏడీఈ లక్షెట్టిపేట డివిజన్ లోని దండేపల్లి, జన్నారం, లక్షెట్టిపేట మండలాలను పర్యవేక్షిస్తారు. ఇంతకుముందు ఇక్కడ విధులు నిర్వహించిన ఏ డీ ఈ ప్రభాకర్ ప్రమోషన్ లో బెల్లంపల్లి కి బదిలీ అయ్యారు. నూతన ఏ డీ ఈ తిరుపతిని సిబ్బంది మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రభుత్వ భూమి ఆక్రమణపై కలెక్టర్‌కు ఫిర్యాదు...

కంచె, హెచ్చరిక బోర్డు తొలగించి ట్రాక్టర్‌తో దున్ని ఆయిల్‌ఫామ్ మొక్కలు నాటారని ఆరోపణ

పెద్దపల్లి ప్రతినిధి : పెద్దపల్లి జిల్లా కాల్వ శ్రీరాంపూర్ మండలం పందిల్ల గ్రామ రెవెన్యూ పరిధిలోని ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురవుతోందని ఆరోపిస్తూ పందిల్ల మాజీ ఉపసర్పంచ్ దాసరి రమేష్ జిల్లా కలెక్టర్‌కు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ ఆధీనంలో ఉన్న భూమిలోకి అక్రమంగా ప్రవేశించి కంచె, హెచ్చరిక బోర్డును తొలగించడంతో పాటు ట్రాక్టర్‌తో భూమిని దున్ని ఆయిల్‌ఫామ్ మొక్కలు నాటినట్లు ఆయన ఆరోపించారు. రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. పందిల్ల రెవెన్యూ శివారులోని సర్వే నంబర్ 805/3లో 4 ఎకరాల 20 గుంటల ప్రభుత్వ భూమిని గతంలో రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకుని, హద్దులు నిర్ణయించి కంచె, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. అయితే కౌంజు కుమారస్వామి అనే వ్యక్తి తిరిగి ఆ భూమిలోకి ప్రవేశించి సాగు చేస్తున్నట్లు ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. అదేవిధంగా ప్రభుత్వ భూమిలో రెండు ఇళ్లను నిర్మించి వాటిని ఇతరులకు అద్దెకు ఇస్తున్నారని, ఆయా నిర్మాణాలకు గ్రామపంచాయతీ నుంచి ఎలాంటి అనుమతులు పొందలేదని రమేష్ ఆరోపించారు. మిషన్ భగీరథ ప్రధాన తాగునీటి పైప్‌లైన్ నుంచి అక్రమంగా నల్లా కనెక్షన్ తీసుకున్నట్లు కూడా ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై గతంలో 2025 మే 26, ఆగస్టు 4 తేదీల్లో జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని రమేష్ తెలిపారు. తాజాగా 2026 సెప్టెంబర్ 4న రాత్రి సమయంలో ప్రభుత్వ భూమికి ఏర్పాటు చేసిన కంచెను తొలగించి, ట్రాక్టర్‌తో భూమిని దున్ని ఆయిల్‌ఫామ్ మొక్కలు నాటినట్లు ఆరోపించారు. ప్రభుత్వ భూమి ఆక్రమణపై సమగ్ర విచారణ చేపట్టి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రమేష్ జిల్లా కలెక్టర్‌ను కోరారు. ఆక్రమణకు గురైనట్లు ఆరోపిస్తున్న భూమిని తిరిగి ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకుని ఐకేపీ వడ్ల కొనుగోలు కేంద్రం లేదా నర్సరీ ఏర్పాటుకు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.

ఎమ్మెల్సీ తాత మధుసూదన్ పై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి: కాంగ్రెస్ పార్టీ నేత చిరుమర్తి రాజు

కూకట్ పల్లి సెప్టెంబర్ 07 : తెలంగాణఅసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ తాత మధుసూదన్ పై కూకట్ పల్లి ఏసీపీకి పిర్యాదు చేసిన తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర నాయకుడు చిరుమర్తి రాజు. దళిత స్పీకర్ పైన బూతులు మాట్లాడుతూ యావత్ దళితులు తలదించుకునేలా మాట్లాడిన. తాత మధు వెంటనే బేషరతుగా దళిత సమాజానికీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసారు. వారికి ఇంకా అహంకారం తగ్గలేదని, వారి డ్రామాలు ఎవ్వరూ నమ్మరని, ప్రజల్ని రెచ్చగొట్టే విధంగా మాట్లాడితే చూస్తూ ఊరుకోమన్నారు. ప్రజాపాలన లో తాము ప్రజల వైపు ఉంటామని, ఇంకొకసారి నోరు జారితే నాలుక కోస్తాం అని హెచ్చరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అల్వాల్ భాస్కర్, కచ్చిగాళ్ల రమేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

“గౌరవ సభను కౌరవ సభ”గా మార్చిన ఘనత కాంగ్రెస్కే దక్కుతుంది

మానకొండూర్, సెప్టెంబర్7: కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలకేంద్రంలో సోమవారం అసెంబ్లీ ఆవరణలో బిఆర్ఎస్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డికి జరిగిన అవమానానికి నిరసనగా బిఆర్ఎస్ నాయకులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టి బొమ్మను దహనం చేశారు. పార్టీ మండలాధ్యక్షుడు తాళ్ళపల్లి శేఖర్ గౌడ్ మాట్లాడుతూ....నల్లచీర కట్టుకుని అసెంబ్లీకి వచ్చిన కారణంగా మహిళ అని కూడా చూడకుండా ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి చీరకొంగును పోలీసులు లాగడం పట్ల గౌరవ సభను కౌరవ సభగా మార్చిన ఘనత కాంగ్రెస్కే దక్కుతుందని, అసెంబ్లీ చరిత్రలో రేవంత్ రెడ్డి పాలనను ఒక దుశ్శాసన పర్వంగా భావిస్తున్నామన్నారు. మహిళలను అవమానించడమే ఇందిరమ్మ రాజ్యమాని ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ ముఖ్యమంత్రి డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. అనంతరం ఎన్నికల్లో ప్రజలకిచ్చిన ఇచ్చిన హామీలను ప్రభుత్వం తక్షణమే నెరవేర్చాలి డిమాండ్ చేస్తూ ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఎంపీడీవోకు నాయకులు వినతిపత్రం అందజేశారు. పార్టీ సర్పంచ్ ఎరుకల శ్రీనివాస్ గౌడ్, నాయకులు రామంచ గోపాల్ రెడ్డి,రాయికంటి కిరణ్,శామంతుల శ్రీనివాస్ తదితరులు కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

ఆలయానికి కొత్త శోభ: కుషాయిగూడ శ్రీ పద్మావతి వెంకటేశ్వర స్వామి దేవాలయంలో రాజగోపుర ముఖద్వారం ప్రారంభం

కుషాయిగూడ, సెప్టెంబర్ : కుషాయిగూడలోని శ్రీ పద్మావతి వెంకటేశ్వర స్వామి దేవాలయంలో నూతనంగా నిర్మించిన రాజగోపుర ముఖద్వారాన్ని సోమవారం ఘనంగా ప్రారంభించారు. ఆలయ తూర్పు ఈశాన్య ప్రాంతంలో నిర్మించిన రాజగోపుర ముఖద్వారానికి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేద మంత్రోచ్చారణలు, ప్రత్యేక పూజల మధ్య రాజగోపుర ముఖద్వారాన్ని ప్రారంభించారు. ఈ రాజగోపురాన్ని ఆలయ చైర్మన్ ఉప్పల యాదగిరిరెడ్డి పెద్ద కుమారుడు కీ.శే. ఉప్పల శ్రీనివాస్‌రెడ్డి జ్ఞాపకార్థం నిర్మించారు. ఆయన జ్ఞాపకాలను చిరస్థాయిగా నిలిపేలా రాజగోపురాన్ని నిర్మించడం జరిగిందని ఆలయ వర్గాలు తెలిపాయి. నూతన రాజగోపుర ముఖద్వారం అందుబాటులోకి రావడంతో ఆలయానికి మరింత శోభ చేకూరిందని భక్తులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఉప్పల యాదగిరిరెడ్డి, ఆయన చిన్న కుమారుడు ఉప్పల విజయభాస్కర్‌రెడ్డి దంపతులు పాల్గొన్నారు. అర్చకుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అభివృద్ధిలో భాగంగా భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు చేపడుతున్న కార్యక్రమాల్లో భాగంగా నూతన రాజగోపుర ముఖద్వారాన్ని నిర్మించినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ మెంబర్లు పల్లె సురేందర్‌రెడ్డి, పల్లె భద్రారెడ్డి, పల్లె సుధాకర్‌రెడ్డి, పల్లె శ్రీకాంత్‌రెడ్డి, ఆలయ ఈవో ఎం.వీరేశం, పల్లె నరేందర్‌రెడ్డి, పంజాల శ్రీనివాస్‌గౌడ్, ఆలయ అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు. నూతన రాజగోపుర ముఖద్వారాన్ని భక్తులు ఆసక్తిగా తిలకించారు. శ్రీనివాస్‌రెడ్డి జ్ఞాపకార్థం నిర్మించిన రాజగోపురం ఆలయానికి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని నిర్వాహకులు పేర్కొన్నారు.

రక్త నిర్ధారణ శిబిరం..



జమ్మికుంట సెప్టెంబర్ 7: జమ్మికుంట పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకులు కేసి గుప్త జయంతి వారోత్సవాలలో సందర్భంగా వికేఎస్పీ జమ్మికుంట క్లబ్ ఆధ్వర్యంలో రక్త నిర్ధారణ శిబిరం నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా వికేఎస్పీ క్లబ్ అధ్యక్షుడు గుండా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులకు వ్యక్తిగత అవసరాల దృష్ట్యా సమాజ శ్రేయస్సు దృష్ట్యా వారి వారి రక్త నమూనాలు తెలిసి ఉండడం వలన అత్యవసర పరిస్థితులలో అవసరం ఉన్నవారికి సహకరించడానికి ఉపయోగకరంగా ఉంటుందని ఆలోచనతో అమ్మ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ జమ్మికుంట వారి సౌజన్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించగా పాఠశాలలోని తొమ్మిది పదవ తరగతి విద్యార్థులు 50 మంది తమ రక్త నిర్ధారణ పరీక్షలు చేసుకోవడం జరిగింది ఈ కార్యక్రమంలో వీకేఎస్పీ జమ్మికుంట క్లబ్అధ్యక్షుడు గుండా రాజేంద్రప్రసాద్ జోన్ చైర్ పర్సన్ రమేష్, ఐపీసీ గంప మహేందర్, వాసవి క్లబ్ సభ్యులు పాఠశాల ప్రధానోపాధ్యాయులు దేవరకొండ సతీష్ బాబు, ఉపాధ్యాయ బృందం అమ్మ హాస్పిటల్ సిబ్బంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు

బిఆర్ఎస్ ఎమ్మెల్యేలపై పోలీసుల దురుసు ప్రవర్తన....

● అసెంబ్లీ సాక్షిగా ప్రజాస్వామ్యంపై దాడి ● మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి

పెద్దపల్లి ప్రతినిధి : రాష్ట్ర అసెంబ్లీ వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరు తీవ్రంగా ఖండించాల్సిన విషయమని పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి అన్నారు. అసెంబ్లీ సాక్షిగా ప్రజా ప్రతినిధుల పట్ల పోలీసుల దురుసు ప్రవర్తనకు నిరసనగా పెద్దపల్లి బస్టాండ్ వద్ద సోమవారం బిఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అసెంబ్లీలో ప్రస్తావించేందుకు ప్రజాప్రతినిధులు వస్తే వారిని అడ్డుకుని తోపులాటకు దిగి అదుపులోకి తీసుకోవడం ప్రజాస్వామ్య వ్యవస్థకు ఏమాత్రం మంచిది కాదన్నారు. కేటీఆర్, హరీశ్‌రావు, సునీత లక్ష్మారెడ్డి, జగదీశ్‌రెడ్డి, గంగుల కమలాకర్ తదితర బీఆర్ఎస్ ప్రజాప్రతినిధుల పట్ల పోలీసుల దురుసు ప్రవర్తన, తోపులాటలో కొందరికి గాయలవడం ప్రభుత్వ వైఖరిని స్పష్టం చేస్తుందన్నారు. ముఖ్యంగా మహిళా ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి పట్ల పోలీసులు అనుచితంగా వ్యవహరించడం మరింత తీవ్రంగా పరిగణించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షానికి మాట్లాడే హక్కు ఉందని, ప్రజల తరఫున ప్రశ్నించే హక్కు ఉందని, ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలదీసే హక్కు ఉందని ఆ హక్కులను పోలీసుల బలంతో అడ్డుకోవాలని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నించడం సరికాదన్నారు. అసెంబ్లీ ప్రజల సమస్యలను చర్చించే పవిత్రమైన వేదికని, అక్కడికి వచ్చే ప్రజాప్రతినిధులను పోలీసులు అడ్డుకోవడం అంటే ప్రజల గొంతును అడ్డుకోవడమేన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనపై ప్రజల్లో ఉన్న అసంతృప్తిని ప్రశ్నిస్తున్నందుకే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై ఇలాంటి చర్యలకు పాల్పడుతూ ప్రజల తరఫున

ప్రశ్నిస్తే అరెస్టులు చేయడం, నిరసన తెలిపితే పోలీసులతో అణచివేయడం సరికాదన్నారు. ఎమ్మెల్యేల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరుపై ప్రభుత్వం వెంటనే సమగ్ర విచారణ జరిపించి బాధ్యులైన పోలీసు అధికారులపై చర్యలు తీసుకుని ప్రజాప్రతినిధుల హక్కులను గౌరవించాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పార్టీ ప్రజల సమస్యలపై పోరాటాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఆపదన్నారు. పోలీసుల బెదిరింపులకు, అక్రమ నిర్బంధాలకు భయపడేది లేదున్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

● ఆశా వర్కర్ల ధర్నాకు సంఘీభావం తెలిపిన మాజీ ఎమ్మెల్యే, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్...

పెద్దపల్లి ప్రతినిధి : ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించి వారి న్యాయమైన డిమాండ్లను వెంటనే అమలు చేయాలని కోరుతూ సోమవారం పెద్దపల్లి కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నా, రాస్తారోకో కార్యక్రమానికి పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ దాసరి మమతారెడ్డిలు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా దాసరి మనోహర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య పరిరక్షణలో క్షేత్రస్థాయిలో కీలకంగా పనిచేస్తున్న ఆశా వర్కర్ల సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. తక్కువ పారితోషికంతో, అనేక రకాల బాధ్యతలు నిర్వహిస్తున్న ఆశా వర్కర్లపై అదనపు పనిభారం, టార్గెట్లు మోపడం వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఆశా వర్కర్ల ప్రధాన డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఆయన కోరారు. ఆశా వర్కర్లపై విధిస్తున్న టార్గెట్లను ఎత్తివేయాలని, ఖాళీగా ఉన్న ఆశా వర్కర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, ఆశా వర్కర్లను బి ఎల్ ఓ విధుల నుంచి తొలగించాలని, ఆశా వర్కర్లకు నెలకు రూ.18,000 ఫిక్స్‌డ్ వేతనం చెల్లించాలని, ఆశా వర్కర్లకు హెల్త్ కార్డులు జారీ చేయాలని, ప్రభుత్వ పథకాలు, ఆరోగ్య కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఆశా వర్కర్లు అందిస్తున్న సేవలు ఎంతో కీలకమైనవని దాసరి మనోహర్ రెడ్డి అన్నారు. వారి సేవలను గుర్తించి గౌరవప్రదమైన వేతనం, మెరుగైన పని పరిస్థితులు, సామాజిక భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు. మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ దాసరి మమతారెడ్డి మాట్లాడుతూ ఆశా వర్కర్ల డిమాండ్లు న్యాయమైనవేనని, ప్రభుత్వం వారి సమస్యలను సానుభూతితో పరిశీలించి వెంటనే పరిష్కరించాలని కోరారు. మహిళా కార్మికులపై అదనపు పనిభారం మోపకుండా వారి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. ఆశా వర్కర్ల పోరాటానికి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని, ప్రభుత్వం స్పందించే వరకు వారి తరఫున ప్రజా ఉద్యమానికి అండగా నిలుస్తామని దాసరి మనోహర్ రెడ్డి, దాసరి మమతారెడ్డిలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్లు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి అర్జీలను వెంటనే పరిష్కరించాలి: అధికారులకు కలెక్టర్ మను చౌదరి ఆదేశం

మేడ్చల్, సెప్టెంబర్ 07: ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను ఏమాత్రం ఆలస్యం చేయకుండా నిబంధనల ప్రకారం పరిశీలించి వెంటనే పరిష్కరించాలని మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఫైజాన్ అహ్మద్‌తో కలిసి కలెక్టర్ ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. రెవెన్యూ, పంచాయతీరాజ్, సివిల్ సప్లైస్, మున్సిపల్ తదితర శాఖలకు సంబంధించిన మొత్తం 105 దరఖాస్తులు ప్రజావాణిలో స్వీకరించినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రజలు సమర్పించిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. వివిధ ప్రాంతాల నుంచి సమస్యలతో ప్రజావాణికి వచ్చే బాధితుల సమస్యలకు ప్రాధాన్యత ఇచ్చి వేగంగా పరిష్కారం చూపాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా నిబంధనల ప్రకారం పరిష్కరించాలని, సమస్య పరిష్కారానికి ఇతర శాఖలతో సమన్వయం అవసరమైతే వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులపై తీసుకున్న చర్యలు, వాటి పరిష్కార స్థితికి సంబంధించిన వివరాలను ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ప్రజల

నుంచి వచ్చే ఫిర్యాదులు, వినతుల పరిష్కారంలో జాప్యం జరగకుండా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజలకు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి లేకుండా సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా శాఖల అధికారులు బాధ్యతతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్వో మాలతి, లా ఆఫీసర్ చంద్రావతి, వివిధ శాఖల జిల్లా అధికారులు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ప్రజావాణి లో వినతిపత్రం సమర్పించిన బిఆరెస్ నాయకులు

ధర్మపురి, సెప్టెంబర్ 7, : ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ప్రజావాణి లో బిఆరెస్ నాయకులు వినతిపత్రం సమర్పించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 1000 రోజులు అయినా సందర్భంగా 100 రోజుల్లో ఆరు గ్యారంటీలు 420 హామీలు అమలు చేస్తా అని మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి నిరసనగా సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో స్థానిక ఎంపిడివో కార్యాలయంలో వెంటనే 6 గ్యారంటీలు 420 హామీలు అమలు చేయాలని మండల అభివృద్ధి అధికారికి మరియు మున్సిపల్ కమీషనర్ కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. తదనంతరం అసెంబ్లీ వద్ద బిఆర్ఎస్ ఎమ్మెల్యేల అక్రమ అరెస్ట్ కు మరియు మహిళ ఎమ్మెల్యేల పై దురుసుగా ప్రవర్తించినందుకు నిరసనగా బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించడ జరిగింది. అనంతరం మాజీ డీసిఎంఎస్ చైర్మెన్ ఎల్లాల శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ అసెంబ్లీ వద్ద మహిళా ఎమ్మెల్యేల పట్ల దురుసుగా ప్రవర్తించిన తీరు బాగాలేదని మా బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు 8.00 గంటలకే అసెంబ్లీ లో చర్చకు సిద్ధం అయితే మా పార్టీ నాయకులకు భయపడి ఇలా అరెస్ట్ లు చేయడం జరిగిందని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రజలకిచ్చిన ప్రతి హామీలను అమలు చేసేదాక కాంగ్రెస్ ప్రభుత్వం ను అడుగడుగునా నిలదేస్తూనే ఉంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ అయ్యోరి రాజేష్ కుమార్, పట్టణ కన్వీనర్ బండారి రంజిత్, నాయకులు సంగి శేఖర్, చిలువేరి శ్యామ్ సుందర్, పెరుమాండ్ల ఎల్లగౌడ్, చిర్నెని నర్సయ్య, బండారి అశోక్, చుక్క రవి, తరాల కార్తీక్, అనంతుల లక్ష్మణ్,ఎస్డీ ఆసిఫ్, బాకీ శేఖర్, జెట్టి రాజన్న, ఎండీ షమిమా, అక్కనపెల్లి సురేందర్, కుక్కల గంగారెడ్డి, ప్రభాకర్ రావు, కాశెట్టి విజయ్, కనుకుల స్వామి, బుక శ్రీనివాస్, చీపిరిశెట్టి రాజన్న, కాళ్ళ జగన్, దుర్గం రవీందర్, సుమన్, కళ్లెం రాజిరెడ్డి, మోలుగురి ప్రశాంత్, మూటపెల్లి లడ్డు, షేకెల్లి సాయి, నూనె సాయి, ఎండీ అర్బాజ్, మూటపెల్లి రాహుల్, సాక సాయి కమల్ తదితరులు పాల్గొన్నారు.

హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి

ప్రజావాణిలో హామీల అమలుపై బీఆర్ఎస్ వినతిపత్రాలు..

పెద్దపల్లి ప్రతినిధి : కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో ఎన్నికల సమయంలో ఇచ్చిన 420 హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు బీఆర్ఎస్ పార్టీ నిర్వహిస్తున్న ఆందోళన కార్యక్రమాల్లో భాగంగా సోమవారం పెద్దపల్లి కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 420 హామీల అమలుపై వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రజలకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి ఆ తర్వాత హామీల అమలును విస్మరించిందని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోకుండా కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనను పూర్తి చేసుకుందని అన్నారు. మహిళలు, రైతులు, యువత, విద్యార్థులు, వృద్ధులు, వికలాంగులు, ఉద్యోగులు, నిరుద్యోగులు సహా అన్ని వర్గాలకు కాంగ్రెస్ పార్టీ హామీలు ఇచ్చిందని, కానీ వాటిలో చాలావరకు పూర్తిస్థాయిలో అమలు కాలేదని ఆయన ఆరోపించారు. ఆరు గ్యారంటీలతో పాటు ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన హామీలను కాలపరిమితితో అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై ప్రభుత్వం స్పష్టమైన శ్వేతపత్రం విడుదల చేయాలని కోరారు. ప్రజలకు ఇచ్చిన 420 హామీల అమలుపై బీఆర్ఎస్ పార్టీ నిరంతరం ప్రజల తరఫున ప్రశ్నిస్తుందని, ప్రభుత్వం స్పందించి పెండింగ్‌లో ఉన్న హామీలను వెంటనే అమలు చేసే వరకు ప్రజా ఉద్యమాన్ని కొనసాగిస్తామని దాసరి మనోహర్ రెడ్డి స్పష్టం చేశారు. మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ దాసరి మమతా రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలులో నిర్లక్ష్యం చేయడం వల్ల రాష్ట్ర ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ముఖ్యంగా మహిళలు, యువత, విద్యార్థులు, పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీల్లో ఇండియన్ పబ్లిక్ పాఠశాల ఘన విజయం

సుల్తానాబాద్, సెప్టెంబర్ 07: సుల్తానాబాద్ మండల కేంద్రంలోని ఇండియన్ పబ్లిక్ పాఠశాల (ఐపీఎస్)లో మూడు రోజులపాటు నిర్వహించిన మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీల్లో ఆ పాఠశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి, బహుమతుల పంట పండించారు. వివిధ క్రీడా విభాగాల్లో పాఠశాల విద్యార్థులు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను కైవసం చేసుకుని పాఠశాల కీర్తిని చాటారు. కబడ్డీ (అండర్-17 బాలికలు): ప్రథమ బహుమతి, వాలీబాల్ (అండర్-17 బాలురు): ప్రథమ బహుమతి, షాట్‌పుట్ (అండర్-14 బాలికలు): ప్రథమ బహుమతి, షాట్‌పుట్ (అండర్-17 బాలికలు): ప్రథమ బహుమతి, ఖోఖో (అండర్-14 బాలికలు): ద్వితీయ బహుమతి, వాలీబాల్ (అండర్-17 బాలికలు): ద్వితీయ బహుమతి, షాట్‌పుట్ (అండర్-14 బాలురు): తృతీయ బహుమతి ఈ సందర్భంగా వివిధ క్రీడాంశాల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులను, వారి విజయానికి కారణమైన వ్యాయామ ఉపాధ్యాయులను పాఠశాల చైర్మన్ మాటేటి సంజీవ్‌కుమార్, ప్రిన్సిపాల్ కృష్ణప్రియ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతోపాటు క్రీడలపై ఆసక్తి పెంచుకుని నిరంతరం సాధన చేయాలని సూచించారు. ఇక్కడితో ఆగకుండా భవిష్యత్తులో జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లోనూ రాణించి పాఠశాలకు, మండలానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల మేనేజర్ శివ, వైస్ ప్రిన్సిపాల్ సునీత, వ్యాయామ ఉపాధ్యాయులు సత్యనారాయణ, సతీష్, జ్యోతి , విద్యార్థులు పాల్గొన్నారు.

నోటీసులు ఇచ్చినా ఆగని అక్రమ నిర్మాణాలు...

స్థలం కబ్జా చేస్తున్నారంటూ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన అడప సంతోష్‌కుమార్

పెద్దపల్లి ప్రతినిధి : పెద్దపల్లి పట్టణంలోని సుభాష్‌నగర్‌లో కోర్టు పరిధిలో ఉన్న భూవివాద స్థలంలో అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నాయని ఆరోపిస్తూ పట్టణానికి చెందిన అడప సంతోష్‌కుమార్ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. మున్సిపల్ అధికారులు ఇప్పటికే నోటీసులు జారీ చేసినప్పటికీ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని ఆయన ఆరోపించారు. ఈ సందర్భంగా ఆడప సంతోష్‌కుమార్ మీడియాతో మాట్లాడుతూ పట్టణంలోని గాంధీ బొమ్మ వెనుక ఉన్న 425 గజాల స్థలాన్ని బ్యాంకు వేలం ద్వారా కొనుగోలు చేసిన పడాల నరేష్‌గౌడ్, పడాల శంకరయ్యలు సదర స్థలానికి అదనంగా మరో 115 గజాల స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారని ఆరోపించారు. ఈ భూవివాదానికి సంబంధించి కోర్టులో కేసు కొనసాగుతున్నప్పటికీ నిర్మాణ పనులు చేపడుతున్నారని తెలిపారు. దీంతో మున్సిపల్ అధికారులు నిర్మాణదారులకు నోటీసులు జారీ చేసినట్లు పేర్కొన్నారు. అయినప్పటికీ కోర్టు నుంచి ఇంజక్షన్ ఆర్డర్ ఉన్నప్పటికీ నిర్మాణ పనులను నిలిపివేయకుండా కొనసాగిస్తున్నారని ఆరోపించారు. తన వద్ద ఉన్న భూమికి సంబంధించిన డాక్యుమెంట్లకు విరుద్ధంగా నిర్మాణాన్ని అడ్డంగా, నిలువుగా విస్తరిస్తూ పనులు చేపడుతున్నారని సంతోష్‌కుమార్ పేర్కొన్నారు. నిర్మాణ పనులను అడ్డుకునేందుకు ప్రయత్నిస్తే రౌడీ మూకలతో బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆయన ఆరోపించారు. భూవివాదానికి సంబంధించిన కోర్టు ఉత్తర్వులు, ఇంజక్షన్ ఆర్డర్, మున్సిపల్ అధికారులకు అందించిన ఫిర్యాదులు తదితర పత్రాలను జిల్లా అధికారులకు సమర్పించినట్లు తెలిపారు. కోర్టులో కేసు పరిష్కారం అయ్యే వరకు వివాదాస్పద స్థలంలో నిర్మాణ పనులను నిలిపివేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయంపై స్థానిక పోలీసులు, మున్సిపల్ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ తగిన చర్యలు తీసుకోలేదని సంతోష్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో జిల్లా కలెక్టర్‌ను కలిసి సమస్యను వివరించినట్లు తెలిపారు. దీనిపై స్పందించిన కలెక్టర్ అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకుంటామని, నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన గోడను తొలగించేందుకు చర్యలు చేపడతామని హామీ ఇచ్చినట్లు సంతోష్ కుమార్ వెల్లడించారు. కోర్టు పరిధిలో ఉన్న భూవివాదంలో నిర్మాణ పనులు కొనసాగకుండా అధికారులు తక్షణమే జోక్యం చేసుకుని, నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని సంతోష్ కుమార్ కోరారు.

అప్పు విషయంలో బెదిరింపులు ప్రాణహాని ఉందంటున్న బాధితుడు

పెద్దపల్లి ప్రతినిధి (: అప్పుగా తీసుకున్న డబ్బుల విషయంలో తనపై దాడి చేసి, తీవ్రంగా బెదిరించారని కమాన్‌పూర్ మండలానికి చెందిన సతీష్ ఆరోపించారు. తనకు ప్రాణహాని ఉందని, తనకు, తన కుటుంబానికి రక్షణ కల్పించాలని పోలీసులను, ప్రజాప్రతినిధులను ఆయన వేడుకున్నారు. సతీష్ తెలిపిన వివరాల ప్రకారం.. జూలపల్లి గ్రామానికి చెందిన సాంబయ్య వద్ద తన వ్యక్తిగత అవసరాల నిమిత్తం కొంత మొత్తాన్ని అప్పుగా తీసుకున్నట్లు తెలిపారు. ఈ వ్యవహారంలో సాంబయ్య కుమారుడు మార్కెట్ కమిటీ చైర్మన్ వైనాల రాజు, వైనాల వినోద్ బెదిరింపులకు గురి చేస్తూ ఇంటికి పిలిపించి తనపై దాడి చేశాడని ఆరోపించారు. అంతేకాకుండా ఎక్కడ కనిపించినా చంపేస్తానని, తనపై అక్రమ కేసులు పెట్టించి ఇబ్బందులకు గురిచేస్తామని బెదిరించినట్లు సతీష్ పేర్కొన్నారు. దీంతో తన ప్రాణాలకు ముప్పు ఉందని, ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు ప్రయత్నించినట్లు తెలిపారు. తనపై దాడి జరుగుతున్న సమయంలో భయంతో 100కు ఫోన్ చేయగా పోలీసులు స్పందించి తనను పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారని సతీష్ తెలిపారు. అయితే అక్కడ కూడా తనకు న్యాయం జరగలేదని, తనపైనే కేసు నమోదు చేస్తామని బెదిరింపులకు గురిచేశారని ఆరోపించారు. తనకు ప్రాణహాని ఉందని పలుమార్లు పోలీసులకు విన్నవించినప్పటికీ తగిన రక్షణ కల్పించలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వైనాల రాజు. వైనాల వినోద్ వల్ల తాను భయభ్రాంతులకు గురవుతున్నానని తెలిపారు. తాను డబ్బులు అప్పుగా తీసుకున్న విషయం వాస్తవమేనని, అయితే ఆ కారణంగా తనపై దాడి చేయడం, బెదిరించడం సరికాదని సతీష్ అన్నారు. తనకు, తన కుటుంబానికి రక్షణ కల్పించి, తనపై జరిగిన దాడి, బెదిరింపులపై సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు. ఈ మేరకు పోలీసు ఉన్నతాధికారులతో పాటు ప్రజాప్రతినిధులను ఆయన వేడుకున్నారు. తన ప్రాణాలను కాపాడి, కుటుంబానికి భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కును హరిస్తే సహించేది లేదు

● ధర్మపురి అభివృద్ధిపై కాంగ్రెస్ ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలి బీజేపీ పట్టణ అధ్యక్షుడు గాజు భాస్కర్

ధర్మపురి, సెప్టెంబర్ 7, : ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కును హరిస్తే సహించేది లేదని ధర్మపురి అభివృద్ధిపై కాంగ్రెస్ ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు గాజు భాస్కర్ డిమాండ్ చేశారు. భారతీయ జనతా పార్టీ ధర్మపురి పట్టణ అధ్యక్షులు గాజు భాస్కర్ ఆధ్వర్యంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ నిన్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ధర్మపురి పర్యటనకు వచ్చిన సందర్భంగా బీజేపీ నాయకులు ప్రశ్నించే అవకాశం ఉందనే ఉద్దేశంతో వెల్గటూర్ వద్ద ముందస్తుగా అరెస్ట్ చేసి, రాత్రి 12 గంటల నుంచి ఉదయం వరకు పోలీస్ స్టేషన్‌లో నిర్బంధించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని వారు తీవ్రంగా ఖండిశీచారు. ప్రజాస్వామ్య దేశంలో ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కు ప్రతి పౌరుడికి ఉంటుందని, ప్రజల సమస్యలపై ప్రశ్నించడం నేరం కాదని, అభివృద్ధి పనులను అడ్డుకోవాలన్నది బీజేపీ ఉద్దేశం అసలే కాదని ఈ సందర్భంగా తెలియజేశారు. మీరు నిజంగా అభివృద్ధి చేయడానికి వస్తే బీజేపీ ఎందుకు అడ్డుకుంటుందని ప్రశ్నించారు. ధర్మపురి దేవాలయ అభివృద్ధి, రాబోయే గోదావరి పుష్కరాలను దృష్టిలో పెట్టుకుని కేవలం 8 నెలల వ్యవధిలో పనులను ఎలా పూర్తి చేస్తారో అనే ప్రశ్నకు ప్రభుత్వం ప్రజలకు స్పష్టమైన సమాధానం చెప్పాలని మాత్రమే మేము కోరినట్లు తెలిపారు. వెయ్యి రోజుల పాలనపై కాంగ్రెస్, బిఆర్ఎస్‌లకు ప్రశ్నలు కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన, అభివృద్ధి అంటూ గొప్పలు చెప్పుకుంటోంది తప్ప మరోవైపు బీఆర్ఎస్ నాయకులు కూడా కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా రోడ్డెక్కుతున్నారని, ఈ రెండు పార్టీల రాజకీయాలను ధర్మపురి ప్రజలు గమనిస్తున్నారని వారు స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఏమయ్యాయని బీజేపీ నాయకులు ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ధర్మపురి ప్రజలకు ఇచ్చిన హామీలలోధర్మపురి కి బస్సు డిపో ఏది, ఆర్డీవో సెంటర్ ఏక్కడ, డివిజన్ సెంటర్ ఏదని, దేవాలయ అభివృద్ధికి ఇచ్చిన హామీలు ఏమయ్యాయని, పుష్కరాలకు వచ్చే లక్షలాది భక్తులకు అవసరమైన మౌలిక వసతులు ఎక్కడ ఉన్నాయి, ఎప్పుడు పూర్తి చేస్తారని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో ఎన్ని అమలు చేశారని, ప్రభుత్వం నిజంగా అభివృద్ధి చేసిందని భావిస్తే ధర్మపురి ప్రజల ముందుకు వచ్చి చేసిన అభివృద్ధి పనుల పూర్తి వివరాలను వెల్లడించాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు. రాబోయే గోదావరి పుష్కరాలను దృష్టిలో పెట్టుకుని ధర్మపురికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రహదారులు, పారిశుధ్యం, తాగునీరు, పార్కింగ్, వసతి, భద్రత, దేవాలయ పరిసరాల అభివృద్ధి వంటి మౌలిక వసతులను ప్రభుత్వం ముందుగానే పూర్తి చేయాలని కోరారు. పుష్కరాలకు కేవలం 8 నెలల సమయం ఉన్న నేపథ్యంలో ప్రభుత్వం ఇప్పటి నుంచే స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికను ప్రకటించాలని ఈ సందర్భంగా బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. అభివృద్ధి పేరుతో ఆలయ అభివృద్ధిని ఆలస్యం చేయడం, భక్తుల విశ్వాసాలకు లేదా హిందువుల మనోభావాలకు ఇబ్బంది కలిగించే విధంగా వ్యవహరించడం జరిగితే భారతీయ జనతా పార్టీ చూస్తూ ఊరుకోదని హెచ్చరిశీచ్చారు. ధర్మపురి అభివృద్ధి కోసం, భక్తుల సౌకర్యాల కోసం, ప్రజల హక్కుల కోసం భారతీయ జనతా పార్టీ నిరంతరం ప్రజల పక్షాన పోరాడుతుందని ఈ సందర్భంగా వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు గాజు భాస్కర్, జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లి శ్రీనివాస్, పట్టణ ప్రధాన కార్యదర్శులు తిరుమందాస్ సత్యనారాయణ, సంఘీ మాధవ్, సీనియర్ నాయకులు తోట శ్రీనివాస్, ఎండోమెంట్ కన్వీనర్ కలకోట రాజు, బీజేవైఎం నాయకులు మండలోజి సూరజ్, మండల ఉపాధ్యక్షులు ఓడేటి అంజన్న, పట్టణ ఉపాధ్యక్షులు సుంకు మధుసూదన్, కార్యదర్శి ఠాగూర్ రాకేష్, కోశాధికారి సంఘీ రాజేష్, సోమిశెట్టి శివ సాయి, పూదరి పవన్, కాసారపు వెంకటేష్, మామిడిపల్లి రంజిత్, పాత నాగరాజు, సోషల్ మీడియా ఇన్‌చార్జ్ కా శెట్టి హరీష్ తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలు.. ఆపై హామీలు.. అమలేది?

- వెయ్యి రోజులు గడుస్తున్నా హామీల కోసం ప్రజల ఎదురుచూపులు - ప్రజావాణికి వెల్లువెత్తిన దరఖాస్తులు

బ్యూరో,: ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 6 గ్యారంటీలు, 420 హామీల అమలు కోసం పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండల ప్రజలు మరోసారి గళమెత్తారు. హామీలు ఇచ్చి వెయ్యి రోజులు గడుస్తున్నా పూర్తిస్థాయిలో అమలు కాలేదని ఆరోపిస్తూ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు పెద్ద ఎత్తున ప్రజావాణి కార్యక్రమంలో దరఖాస్తులు సమర్పించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి ఆదేశాల మేరకు బీఆర్ఎస్ నాయకులు ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొని ప్రజల ద్వారా అధికారులకు దరఖాస్తులు అందేలా చేశారు. హామీలు కాగితాలకే పరిమితమా? ప్రజల జీవితాల్లో మార్పు ఎప్పుడు? అంటూ పలువురు ప్రశ్నించారు. ఇచ్చిన 6 గ్యారంటీలు, 420 హామీలను అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బైరెడ్డి రామ్‌రెడ్డి, మాజీ ఎంపీపీ తానిపర్తి మోహన్‌రావు, సర్పంచ్ బాపయ్య, బద్దం తిరుపతిరెడ్డి, నాతిరిపోచాలు, దుర్గయ్య, వినోద్, కుమార్ యాదవ్, రవీందర్‌రెడ్డి, రాజ్ కొమురయ్య, కోమల్‌రెడ్డితో పాటు పెద్ద సంఖ్యలో మహిళలు, వృద్ధులు పాల్గొన్నారు.

తాతా మధు తక్షణమే రాజీనామా చేయాలి....!

మానకొండూర్, సెప్టెంబర్7: కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలకేంద్రంలో స్పీకర్ ప్రసాద్ కుమార్ పై ఎమ్మెల్సీ తాతా మధు అనుచిత వ్యాఖ్యలపై కాంగ్రెస్ నాయకులు రోడ్డుపై నిరసన తెలిపి తాతా మధు దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం బ్లాక్ కాంగ్రెస్ నాయకుడు తాళ్ళపల్లి సంపత్ గౌడ్ మాట్లాడుతూ.... ప్రతిపక్ష హోదాలో రాష్ట్రంలో ఉన్న సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించాలని, కానీ స్పీకర్ పై పరుషపదాలతో అవమానించిన ఎమ్మెల్సీ తాతా మధు తక్షణమే రాజీనామా చేయలని డిమాండ్ చేశారు. లేదంటే ఏ ఒక్క బిఆర్ఎస్ ఎమ్మెల్యేనూ అసెంబ్లీ గేటును తాకనివ్వమని, కాంగ్రెస్ ప్రభుత్వంపై గానీ నాయకులపైగానీ ఇకపై నోరుజారితె బిఆర్ఎస్ ఎమ్మెల్యేలకు దేహశుద్ధి తప్పదని హెచ్చరించారు. జిల్లా ఉపాధ్యక్షుడు నందగిరి రవీంద్రచారి, సొసైటీ చైర్మన్లు రొంటాల లక్ష్మారెడ్డి, గంగుల రాం రెడ్డి, ముద్దసాని శ్రీనివాస్ రెడ్డి, వైస్ చైర్మన్ వరహాల చారి, నాయకులు ఓదెలు యాదవ్, రామిడి తిరుమల్ రెడ్డి, రేమిడి శ్రీనివాస్ రెడ్డి, గుడాల మహేందర్, తోట శ్రీనివాస్, పెంచాల రాజయ్య, జీడీ శ్యాం, బుర్ర శ్రీధర్ గౌడ్, శ్రీకాంత్ గౌడ్, కనకం కుమార్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

సీఎంఆర్ రైస్ డెలివరీని నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలి

● డిఫాల్ట్ రైస్ మిల్లర్లు బకాయిలు చెల్లించకుంటే ఆస్తులపై చర్యలు ● జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి ప్రతినిధి : 2025-26 సంవత్సరానికి సంబంధించిన ఖరీఫ్, రబీ పంటల కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) డెలివరీని రైస్ మిల్లర్లు నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు సంబంధిత అధికారులతో కలిసి రైస్ మిల్లర్లతో సీఎంఆర్ డెలివరీ, డిఫాల్ట్ రైస్ మిల్లర్లు, బకాయిల చెల్లింపులు, గోదాముల లభ్యత తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ 2025-26 ఖరీఫ్, రబీ సీజన్లకు సంబంధించిన సీఎంఆర్ బియ్యం డెలివరీలో ఎలాంటి జాప్యం లేకుండా నిర్దేశిత లక్ష్యాలను పూర్తి చేయాలని రైస్ మిల్లర్లను ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా సీఎంఆర్ డెలివరీ పూర్తి చేసేలా మిల్లర్లు చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో డిఫాల్ట్ అయిన రైస్ మిల్లర్లు తమ బకాయిలను వెంటనే చెల్లించాలని స్పష్టం చేశారు. బకాయిలు చెల్లించని డిఫాల్ట్ రైస్ మిల్లర్లపై రెవెన్యూ రికవరీ యాక్ట్ ప్రకారం ఆస్తులపై చర్యలు తీసుకోవడంతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. బకాయిలను పూర్తిగా చెల్లించిన రైస్ మిల్లర్లకు తదుపరి సీజన్‌లో ధాన్యం అలాట్మెంట్ చేసే అవకాశం కల్పిస్తామని తెలిపారు. మిల్లర్లు తమ బకాయిలను సకాలంలో చెల్లించి ప్రభుత్వానికి సహకరించాలని సూచించారు. వానాకాలం ధాన్యం కొనుగోళ్లను దృష్టిలో ఉంచుకొని జిల్లాలో సుమారు 2 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని నిల్వ చేసేందుకు అవసరమైన గోదాములను ముందుగానే గుర్తించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్ల అనంతరం నిల్వకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని సూచించారు. జిల్లాలోని ప్రభుత్వ గోదాములను అనుమతి లేకుండా ఎవరికీ కేటాయించడానికి వీల్లేదని స్పష్టం చేశారు. గోదాముల లభ్యత, నిల్వ సామర్థ్యం, వినియోగానికి సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. సీఎంఆర్ డెలివరీ, ధాన్యం నిల్వ, గోదాముల నిర్వహణ తదితర అంశాలపై సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని, ప్రభుత్వ లక్ష్యాలను నిర్ణీత సమయంలో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనాథ్, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ శ్రీకాంత్, సంబంధిత అధికారులు, రైస్ మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.

సుల్తానాబాద్‌లో బిఆర్ఎస్ నిరసన

ప్రభుత్వ అక్రమ అరెస్టులపై ఆగ్రహం

సుల్తానాబాద్, సెప్టెంబర్ 7: వర్షాకాల అసెంబ్లీ సమావేశాలకు హాజరయ్యేందుకు వెళ్తున్న బిఆర్ఎస్ పార్టీ శాసనసభ్యులు, శాసన మండలి సభ్యులను ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేసిన తీరును నిరసిస్తూ సుల్తానాబాద్ పట్టణంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ప్రభుత్వ వైఖరిని ఖండిస్తూ బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సుల్తానాబాద్ పట్టణంలోని రాజీవ్ రహదారిపై భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించేందుకు వెళ్తున్న ప్రజాప్రతినిధులను అడ్డుకోవడం, అక్రమంగా అరెస్టులు చేయడం ప్రజాస్వామ్య హక్కులను పూర్తిగా కాలరాయడమేనని మండిపడ్డారు. ప్రజల తరఫున ప్రశ్నించే గొంతుకలను అణచివేయాలని ప్రభుత్వం చూస్తోందని, ఇలాంటి చర్యలను బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు చూస్తూ ఊరుకోబోవని హెచ్చరించారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం, ప్రజల హక్కుల కోసం బిఆర్ఎస్ పార్టీ నిరంతరం పోరాటం చేస్తుందని నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, యువజన విభాగం నాయకులు, కార్యకర్తలు , అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని నిరసనను విజయవంతం చేశారు.

రాఘవేంద్రనగర్‌లో రోడ్ల పరిస్థితిపై అధికారుల పరిశీలన

గుంతలను వెంటనే పూడ్చాలి.. మరమ్మతులు సకాలంలో పూర్తి చేయాలి

మేడ్చల్, సెప్టెంబర్ 07: ప్రజలకు సురక్షితమైన, సాఫీ రాకపోకలు అందించేందుకు రహదారుల అభివృద్ధి, నిర్వహణపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. నాచారం రాఘవేంద్రనగర్‌లో రహదారుల పరిస్థితి, రోడ్లపై ఏర్పడిన గుంతలు, దెబ్బతిన్న ప్రాంతాలను ఎంఎంసీ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి, డీసీ నిత్యానంద్, డిప్యూటీ ఈఈ (ఎస్‌డబ్ల్యూఎం), ఇంజినీరింగ్ అధికారులు సోమవారం క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించారు. స్థానికంగా రహదారుల పరిస్థితిని పరిశీలించిన అధికారులు వాహనదారులు, పాదచారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసుకున్నారు. వర్షాలు, నిరంతర రాకపోకల కారణంగా దెబ్బతిన్న రహదారులను గుర్తించి వాటికి అవసరమైన మరమ్మతులు చేపట్టాలని అధికారులకు సూచించారు. రాఘవేంద్రనగర్‌లోని ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రోడ్లను కూడా పూర్తిస్థాయిలో పరిశీలించి గుంతలను గుర్తించాలని ఆదేశించారు. గుర్తించిన గుంతలను ఎలాంటి జాప్యం లేకుండా పూడ్చి రహదారులను రాకపోకలకు అనుకూలంగా తీర్చిదిద్దాలని సూచించారు. మరమ్మతు పనులు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా చేపట్టాలని, నిర్ణీత గడువులోగా పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. కేవలం గుంతలను పూడ్చడంతో పనులు ముగించకుండా మరమ్మతులు చేపట్టిన ప్రాంతాల్లో రహదారుల పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. రోడ్ల మరమ్మతుల అనంతరం తిరిగి గుంతలు ఏర్పడకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని, రహదారుల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలిగించే సమస్యలను గుర్తించి తక్షణమే పరిష్కరించేలా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ పెంచాలని సూచించారు. సురక్షితమైన రహదారులు, మెరుగైన రాకపోకలు, ప్రజలకు ఇబ్బందులు లేని పరిసరాలే లక్ష్యంగా పనులను వేగవంతం చేయాలని అధికారులకు స్పష్టం చేశారు.

420 హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

ఓదెల ప్రజావాణిలో బీఆర్ఎస్ వినతిపత్రాలు

బ్యూరో,: ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన 420 హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనలో హామీల అమలు ఆశించిన స్థాయిలో జరగలేదని విమర్శిస్తూ సోమవారం ఓదెల మండల ప్రజావాణి కార్యక్రమంలో ప్రభుత్వానికి వినతిపత్రాలు సమర్పించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకముందు మహిళలు, రైతులు, యువత, విద్యార్థులు, వృద్ధులు, వికలాంగులు, ఉద్యోగులు, నిరుద్యోగులు, పేద, మధ్యతరగతి వర్గాలకు అనేక హామీలు ఇచ్చిందని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత వాటి అమలును విస్మరించిందని ఆరోపించారు. ఆరు గ్యారంటీలతో పాటు ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన హామీలను కాలపరిమితితో అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటివరకు అమలు చేసిన హామీలు, పెండింగ్‌లో ఉన్న హామీలపై ప్రభుత్వం స్పష్టమైన శ్వేతపత్రం విడుదల చేయాలని కోరారు. ప్రజలకు ఇచ్చిన 420 హామీల అమలుపై బీఆర్ఎస్ ప్రజల తరఫున నిరంతరం ప్రశ్నిస్తుందని, పెండింగ్ హామీలను అమలు చేసే వరకు ప్రజా ఉద్యమాన్ని కొనసాగిస్తామని నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా ఇటీవల కేంద్ర ప్రభుత్వం ఉద్యోగ భవనం సముదాయంలో జరిగిన ఒక కార్యక్రమంలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును బర్కత్ పురా అవంతి డిగ్రీ అండ్ పీజీ కాలేజ్ చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్ సోమేశ్వర రావు కు కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి కిషన్ రెడ్డి సన్మానిస్తున్న దృశ్యం.

గవర్నర్‌ను కలిసిన లెఫ్టినెంట్ జనరల్, వైస్ ఛాన్సలర్‌లు

హైదరాబాద్ (తారా జ్యోతి): రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను పలువురు ప్రముఖులు సోమవారం లోక్‌భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఇండియన్ ఆర్మీ దక్షిణ భారత ప్రాంతం జెనరల్ ఆఫీసర్ కమాండింగ్ లెఫ్టినెంట్ జనరల్ ఉల్హాస్ కిర్పేకర్ గవర్నర్ ను కలిశారు. సైనిక, రక్షణ అంశాలపై గవర్నర్‌తో చర్చించారు. ఏఎస్‌సీఐ ఛైర్మన్ కె. పద్మనాభయ్య , యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ వీసీ ప్రొఫెసర్ జె. అనురాధ, కాకతీయ విశ్వవిద్యాలయం వీసీ ప్రొఫెసర్ కె. ప్రతాప్‌రెడ్డి, ఉస్మానియా విశ్వ విద్యాలయం వీసీ ప్రొఫెసర్ కుమార్ మొలుగారం, సాలార్‌జంగ్ మ్యూజియం నూతన బోర్డు సభ్యులు ప్రొఫెసర్ వి. కిషన్‌రావు, డాక్టర్ పెరంబుదూర్ జైకిషన్, డాక్టర్ రాజిరెడ్డి సీలం తదితరులు గవర్నర్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆయా సంస్థలకు సంబంధించిన వివిధ అంశాలపై గవర్నర్‌తో వారు చర్చించారు.

అంగరంగ వైభవంగా ముగిసిన కోట మైసమ్మ పోచమ్మ తల్లి, బోనాలు

కందుకూరు సెప్టెంబర్ 07 : కందుకూరు మండల పరిధిలోని పులిమామిడి గ్రామంలో సోమవారం కోట మైసమ్మ తల్లి, పోచమ్మ బోనాల వేడుకలు భక్తిశ్రద్ధలతో అంగరంగ వైభవంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ ఎంబడి రమేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు గ్రామస్థులు, భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. మహిళలు సంప్రదాయబద్ధంగా బోనాలు ఎత్తుకొని, మంగళహారతులతో అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. శ్రీ శ్రీ శ్రీ కోట మైసమ్మ తల్లి, పోచమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులు నైవేద్యాలను సమర్పించారు. ఆలయ పరిసరాలు భక్తుల నామస్మరణలు, డప్పు చప్పుళ్లతో మార్మోగాయి. అమ్మవార్ల కృపతో గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని భక్తులు కోరుకున్నారు. బోనాల వేడుకలు భక్తులను ఆధ్యాత్మిక పరవశంలో ముంచెత్తాయి. గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ పాపగల రాములు వార్డు సభ్యులు గ్రామ పెద్దలు వివిధ గ్రామాల నుంచి భక్తులు భారీగా తరలించారు.

సైబర్ నేరాల కట్టడిలో సైబర్ వారియర్స్ కీలక పాత్ర

రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా

గోదావరిఖని క్రైమ్ (ది క్రైమ్ న్యూస్) : సైబర్ మోసాల బారిన పడిన బాధితులకు పోలీసు శాఖ అండగా ఉంటుందని, వారు కోల్పోయిన డబ్బును తిరిగి రికవరీ చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా అన్నారు. సోమవారం రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో కమిషనరేట్ పరిధిలోని సైబర్ వారియర్స్‌తో సీపీ అంబర్ కిశోర్ ఝా, టీజీసీఎస్‌బీ ఎస్పీ సాయి శ్రీ ముఖ్య అతిథులుగా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టీజీసీఎస్‌బీ ఎస్పీ సాయి శ్రీ మాట్లాడుతూ, సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న సైబర్ వారియర్స్ తమ పరిధిలోని నేరాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. వినాయక చవితి సందర్భంగా ప్రతి గణేష్ మండపంలో సైబర్ అవగాహన పోస్టర్లను ప్రదర్శించి ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని, సైట్రెయిన్ మరియు సైబర్ శిక్షణ కార్యక్రమాలకు హాజరై నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న కేసులు, ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా సీపీ అంబర్ కిశోర్ ఝా మాట్లాడుతూ, బాధితుల ఫిర్యాదులపై వెంటనే స్పందించి కేసులు నమోదు చేయాలని, ప్రజలను రక్షించడంలో సైబర్ వారియర్స్ పాత్ర అత్యంత కీలకమని తెలిపారు. బ్యాంకు, న్యాయస్థాన అధికారులతో సమన్వయంతో పనిచేసి త్వరగా ఉత్తర్వులు వచ్చేలా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీజీసీఎస్‌బీ ఎస్పీ సాయిశ్రీ, సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ డీఎస్పీ వెంకటరంగా రెడ్డి, రాణా ప్రతాప్, పోలీస్ కమిషనర్ సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాస్, మారుతి, క్రాంతి, సీసీ సందీప్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలకు పారదర్శకమైన పోలీసు సేవలు అందించడమే మా లక్ష్యం

రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా

గోదావరిఖని క్రైమ్ (ది క్రైమ్ న్యూస్) : ప్రజలకు పారదర్శకమైన పోలీసు సేవలు అందించడమే తమ ప్రధాన లక్ష్యమని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా తెలిపారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహించగా, సీపీ అంబర్ కిశోర్ ఝా స్వయంగా ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ప్రతి ఒక్కరితో మాట్లాడి వారి బాధలను తెలుసుకున్న ఆయన, అర్జీలను పరిశీలించి తక్షణమే చట్టపరమైన న్యాయం చేయాలని సంబంధిత అధికారులకు తేల్చిచెప్పారు. ప్రజలు ఏలాంటి భయాలు పెట్టుకోకుండా నేరుగా పోలీస్ అధికారులను ఆశ్రయించి తమ సమస్యలను నివేదించాలని కోరారు. బాధితులకు అండగా నిలుస్తూ వేగంగా స్పందించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ పరిపాలన కె. శ్రీనివాస్ పాల్గొన్నారు.

రెండు రోజుల్లో ఐదు కేసులు.. జగద్గిరిగుట్ట పోలీసుల దూకుడు

మోసం కేసులో రూ.9 లక్షలు, బంగారం స్వాధీనం.. రూ.10 లక్షల బ్యాటరీల చోరీ ఛేదన

క్రైమ్ న్యూస్, రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి : జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన వివిధ నేరాలపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించి కేవలం రెండు రోజుల్లో ఐదు కేసులను ఛేదించారు. నిందితులను అరెస్ట్ చేయడంతో పాటు చోరీకి గురైన నగదు, బంగారం, మొబైల్ ఫోన్, రూ.10 లక్షల విలువైన నాలుగు బ్యాటరీలను స్వాధీనం చేసుకున్నారు. మోసం, ఐటీ చట్టానికి సంబంధించిన కేసులో పోలీసులు కామినేడ్డి శివమోహన్ రెడ్డిని అరెస్ట్ చేశారు. మార్కాపురం ప్రాంతానికి చెందిన అతడు గతంలో సుమారు 12 సంవత్సరాల పాటు సశస్త్ర సీమా బల్‌లో కానిస్టేబుల్‌గా పనిచేసినట్లు పోలీసులు తెలిపారు. విధి నిర్వహణలో అనుచిత ప్రవర్తనతో పాటు ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటు పడటంతో ఉద్యోగం నుంచి తొలగించబడినట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఉద్యోగం కోల్పోయిన అనంతరం పలువురితో పరిచయాలు పెంచుకున్న నిందితుడు వారి నమ్మకాన్ని సంపాదించి డబ్బులు తీసుకుని మోసాలకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. ప్రస్తుత కేసులో బాధితురాలితో ఫోన్ ద్వారా పరిచయం ఏర్పరచుకుని, కుటుంబ అవసరాలు, ఆసుపత్రి చికిత్స తదితర కారణాలు చెబుతూ పలు దఫాల్లో సుమారు రూ.9 లక్షల నగదు తీసుకున్నట్లు తెలిపారు. అదేవిధంగా 3.5 తులాల బంగారాన్ని కూడా తీసుకుని కంభంలోని కెనరా బ్యాంకులో తాకట్టు పెట్టినట్లు గుర్తించారు. నిందితుడిని అరెస్ట్ చేసి న్యాయస్థానంలో హాజరుపరచగా జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. అస్బెస్టాస్ కాలనీలో గత 15 రోజులుగా రాత్రివేళల్లో జరుగుతున్న వరుస ఇళ్ల దొంగతనాలపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు గరికపాటి వెంకటేష్‌ను అరెస్ట్ చేశారు. నిందితుడు మూడు ఇళ్లలో దొంగతనాలకు పాల్పడినట్లు గుర్తించారు. ఒక ఇంట్లో మొబైల్ ఫోన్, మరో ఇంట్లో వెండి వస్తువులు, ఇంకో ఇంట్లో 3 గ్రాముల బంగారం, రూ.60 వేల నగదు చోరీ చేసినట్లు తేలింది. అతని వద్ద నుంచి మొబైల్ ఫోన్, 3 గ్రాముల బంగారాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మరో కేసులో జగద్గిరిగుట్ట పరిధిలోని విద్యుత్ వాహనాల ఛార్జింగ్ కేంద్రంలో నాలుగు బ్యాటరీలు చోరీకి గురయ్యాయి. ఛార్జింగ్ కేంద్రం సూపర్‌వైజర్ మహేష్ యాదవ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు తోట గురువప్పను నిందితుడిగా గుర్తించారు. చోరీ చేసిన బ్యాటరీలను స్క్రాప్ దుకాణంలో విక్రయించి గిద్దలూరుకు వెళ్లిపోయినట్లు దర్యాప్తులో గుర్తించారు. ఒక్కో బ్యాటరీ విలువ సుమారు రూ.2.50 లక్షలు కాగా, నాలుగు బ్యాటరీల విలువ రూ.10 లక్షలుగా పోలీసులు తెలిపారు. ప్రత్యేక బృందాన్ని గిద్దలూరుకు పంపించి నిందితుడిని అరెస్ట్ చేసి, నాలుగు బ్యాటరీలను స్వాధీనం చేసుకున్నారు. నేరాల నియంత్రణతో పాటు కేసులను వేగంగా ఛేదించేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ పోలీసులు సమన్వయంతో దర్యాప్తు చేపట్టారు. కుత్బుల్లాపూర్ డీసీపీ కోటి రెడ్డి ఆదేశాల మేరకు, కుత్బుల్లాపూర్ ఏసీపీ బాలగంగి రెడ్డి ఆధ్వర్యంలో కేసులను ఛేదించారు. ఇన్‌స్పెక్టర్ సురేష్, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ నరేంద్ర రెడ్డి, ఏఎస్సై రామ్ కుమార్, పోలీసు సిబ్బంది నరేష్ గౌడ్, రమేష్, మహిళా పోలీసు సిబ్బంది సుమ కేసుల ఛేదనలో కీలకంగా వ్యవహరించారు. వారి కృషిని ఉన్నతాధికారులు అభినందించి రివార్డులతో సత్కరించారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలతో

తీవ్ర సంక్షోభంలోకి దేశం

స్వాతంత్ర్య స్ఫూర్తికి భిన్నంగా మోడి పాలన

ఏఐటీయూసి జాతీయ ప్రధాన కార్యదర్శి అమర్ జీత్ కౌర్.

మోడీ పాలనలో ప్రభుత్వ రంగ సంస్థల నిర్వీర్యం: చాడ వెంకట రెడ్డి

భవిష్యత్ కార్మిక ఉద్యమాలకు ఈ మహాసభ దిక్సూచిగా నిలవాలి: పంజాల శ్రీనివాస్

కరీంనగర్ టౌన్, సెప్టెంబర్7(ది క్రైమ్ న్యూస్) : కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల వల్ల దేశం తీవ్ర సంక్షోభంలోకి నెట్టివేయబడుతుందని ఏఐటీయూసి జాతీయ ప్రధాన కార్యదర్శి అమర్ జీత్ కౌర్ ఆరోపించారు. దేశంలో రోజురోజుకూ వ్యవసాయ సంక్షోభం తీవ్రమవుతోందని, నిరుద్యోగం పెరిగిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు.అమరజీవి మాదన నారాయణ స్మారక ప్రాంగణం లో ఏఐటీయూసీ రాష్ట్ర 4వ మహాసభల ప్రారంభ సూచికగా ఏర్పాటు చేసిన ఏఐటీయూసీ జెండాను జాతీయ ప్రధాన కార్యదర్శి అమర్ జీత్ కౌర్ ఎగురవేశారు.అమరవీరుల స్మారక స్తూపాన్ని మహాసభల చీఫ్ ప్యాట్రన్,మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన ప్రతినిధుల సభకు ఏఐటీయూసి రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ యూసుఫ్ అధ్యక్షత వహించగా,స్వాగతోపన్యాసం ఆహ్వాన సంఘం అధ్యక్షుడు, సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ కరీంనగర్ జిల్లా కార్మిక ఉద్యమ చరిత్ర, జిల్లా భౌగోళిక పరిస్థితులు, జిల్లాలో కార్మిక సంఘాల నిర్మాణం,కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు,కేంద్ర,రాష్ట్ర పాలకులు కార్మిక విధానాలు, భవిష్యత్తులో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిర్మించబోయే కార్మిక ఉద్యమాలకు ఈ మహాసభ దిక్సూచిగా నిలవాలని,33 జిల్లాల ప్రతినిధులు బలమైన ప్రతిజ్ఞ బూని పోరాటాలకు సమరశంఖం పూరించాలని, మహాసభ నిర్వహించేందుకు అవకాశం కల్పించిన రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు పంజాల శ్రీనివాస్ పేర్కొన్నారు. మహాసభల ప్రారంభానికి ముఖ్యఅతిథి విచ్చేసిన జాతీయ ప్రధాన కార్యదర్శి అమర్ జీత్ కౌర్ మాట్లాడుతూ మోదీ పాలనలో లక్షకు పైగా ప్రభుత్వ పాఠశాలలు మూతపడ్డాయని, ప్రభుత్వ కళాశాలలు, విశ్వవిద్యాలయాలకు నిధులు కోత విధించారని ఆరోపించారు. కార్పొరేట్లకు, విదేశీ విశ్వవిద్యాలయాలకు ఉచిత భూములు ఇస్తూ, వారు ఇష్టారీతిన ఫీజులు వసూలు చేసుకునేలా ప్రోత్సహిస్తున్నారని అన్నారు. దీనివల్ల సాధారణ, పేద కుటుంబాల పిల్లలు చదువుకు దూరమయ్యే ప్రమాదం ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రశ్నించే తత్వాన్ని అణచివేయడానికే విద్యావంతులను అర్బన్ నక్సల్స్ అని ముద్ర వేస్తున్నారని విమర్శించారు. స్వాతంత్ర్యోద్యమ సమయంలో దేశ సహజ వనరుల ఆధారంగా పరిశ్రమలు స్థాపించి, పేదరికాన్ని,నిరుద్యోగాన్ని నిర్మూలించాలని భావించగా, ప్రస్తుత ప్రభుత్వం జాతీయ ఆస్తులను అంబానీ, అదానీ వంటి బడా కార్పొరేట్లకు, విదేశీ కంపెనీలకు కట్టబెడుతోందని మండిపడ్డారు. దేశంలోని కార్మికులలో మెజారిటీ కార్మికులు అసంఘటిత రంగంలోనే ఉన్నారని, వారికి కనీస వేతనాలు, సామాజిక భద్రత, పెన్షన్ సౌకర్యాలు లేవని తెలిపారు. ఆర్టీసీ వంటి రంగాల్లో ఉద్యోగులు 12 నుండి 14 గంటలు పనిచేస్తున్నా కష్టాలు తీరడం లేదని, కాంట్రాక్ట్?, అవుట్‌సోర్సింగ్ వ్యవస్థల వల్ల భద్రత కరువైందని పేర్కొన్నారు. ప్రభుత్వం తీసుకొచ్చిన 4 లేబర్ కోడ్‌లతో కార్మిక హక్కులను కాలరాసి, ట్రేడ్ యూనియన్లను అణచివేసేందుకు కుట్ర జరుగుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెరుగుతున్న ధరలకు నిరసనగా నోయిడా, మనేసర్, గుర్గావ్ వంటి ప్రాంతాల్లో వీధిలోకి వచ్చిన కార్మికులపై కేసులు బనాయించి జైలుకు పంపడాన్ని ఏఐటీయూసీ తీవ్రంగా ఖండించిందని,కార్మికులందరూ ఏకమై తమ హక్కుల పరిరక్షణ కోసం పోరాడాలని అమర్ జీత్ కౌర్ పిలుపునిచ్చారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ మార్పు కోసం బద్లావ్ జరూరి హై అనే నినాదంతో ఇటీవల ఢిల్లీలో సిపిఐ పెద్ద ఎత్తున సభ నిర్వహించిందని,శ్రమను నమ్ముకొని జీవిస్తున్న కార్మిక వర్గానికి కల్పతరంగా నిలిచేందుకు ఏఐటియూసి నాయకత్వం పనిచేయాలని, 106 సంవత్సరాలుగా అవిశ్రాంత,అలుపెరుగని పోరాటాలు నిర్వహిస్తున్న నాయకత్వానికి శుభాకాంక్షలు తెలియజేస్తున్నాని భవిష్యత్ లో కార్మిక వర్గానికి అండగా ఉంటామని వెంకటరెడ్డి తెలిపారు.మహాసభకు సౌహార్ధ సందేశాలు ఇవ్వడానికి విచ్చేసిన ప్రపంచ కార్మిక సంఘాల ఫెడరేషన్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ సి.శ్రీకుమార్, ఏ.ఐ.టీ.యూ.సీ ఆంధ్రప్రదేశ్ కార్యదర్శి, వెంకట సుబ్బయ్య,వామపక్ష కార్మిక సంఘాలు సి.ఐ.టి.యు, హెచ్.ఎం.ఎస్ మరియు టి.యు.సి.ఐ.రాష్ట్ర కార్యదర్శులు పాలడుగు భాస్కర్, ఉపేందర్,సూర్యం, మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కార్మికుల హక్కులను పూర్తిగా కాలరాసే విధంగా వ్యవహరిస్తుందని ధ్వజమెత్తారు. గతంలో రైతులు చేసిన పోరాటాలకు తలగ్గిన మోడీ వ్యవసాయ రంగంలో తీసుకొచ్చిన నల్ల చట్టాలను రద్దు చేస్తూ నిర్ణయం తీసుకున్నాడు. అదేవిధంగా విద్యార్థులు ఇటీవల జంతర్ మంతర్ వద్ద చేసిన నిరసనలకు దిగివచ్చిన కేంద్రం కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేసి వాళ్ళ డిమాండ్స్ ను అంగీకరించే పరిస్థితి వచ్చింది. కార్మికులకు సంబంధించిన చట్టాలను మార్చి నాలుగు లేబర్ కోడ్ ల పేరుతో తీసుకొస్తే కార్మికులు ఏకతాటిపైకి వచ్చి అందరం ఒక్కటై పోరాడాల్సిన అవసరం ఉందని నాయకులు ముక్తకంఠంతో పిలుపునిచ్చారు. కేంద్రం తీసుకొచ్చిన ఈ లేబర్ కోడ్లను తిప్పి కొట్టాలంటే ఐక్య పోరాటాలతోనే సాధ్యమవుతుందని అందుకు కార్మిక సంఘాలన్నీ ఏకం అవ్వాలని ఈ సందర్భంగా వారు పిలుపునిచ్చారు.ఈ మహాసభలలో ఆహ్వాన సంఘం ప్యాట్రన్ కలవేన శంకర్, ఏఐటీయూసీ రాష్ట్ర నిర్మాణ బాధ్యులు వి. ఎస్. బోస్,గౌరవాధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య,డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఎం.నర్సింహా,ఉపాధ్యక్షులు కె.యేసురత్నం,బి.చంద్రయ్య, పి.ప్రేమ్ పావని, రాష్ట్ర కార్యదర్శులు ఎన్.కరుణ కుమారి,ఎస్.విలాస్.సింగు నర్సింహ రావు,బి.వెంకటేష్, పల్లా దేవేందర్ రెడ్డి,టేకుమల్ల సమ్మయ్య, వై. ఒమయ్య, నారాటి ప్రసాద్,మేకల శ్రీనివాస్ రావు,ఓరుగంటి యాదయ్య, ఎం.డి.ఇమ్రాన్, సత్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

25శాతం రాయితీతో ఎల్ఆర్ఎస్ గడువు పొడిగింపు

హైదరాబాద్,జూలై31 : ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులకు తెలంగాణ ప్రభుత్వం గుడ్‌న్యూస్ తెలిపింది. ఎల్ఆర్ఎస్ ఫీజులు, ఛార్జీలపై 25శాతం రాయితీ కొనసాగిస్తున్నట్లు ప్రకటించింది. ఆగస్టు 1వ తేదీ నుంచి నవంబర్ 30, 2026 వరకు రాయితీ వర్తింపజేస్తున్నట్లు స్పష్టం చేసింది. 25శాతం రిబేట్‌కు గ్రీన్‌సిగ్నల్ ఇస్తూ జీఓ ఎంఎస్ నంబర్ -.213 జారీ చేసింది. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఎల్ఆర్ఎస్ బకాయిల చెల్లింపునకు మరో నాలుగు నెలల గడువును పొడిగిస్తున్నట్లు స్పష్టం చేసింది. సంబంధిత శాఖలు తక్షణమే అమలు చర్యలు చేపట్టాలని తెలంగాణ ప్రభుత్వం ఆదేశించింది.

అర్హులకు సంక్షేమ పథకాలు ఎప్పుడు?

కాంగ్రెస్ పాలనపై బీఆర్ఎస్ శ్రేణుల నిరసన..

కుత్బుల్లాపూర్ (ది క్రైమ్ న్యూస్) : కొంపల్లి, సెప్టెంబరు 7: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ శ్రేణులు సోమవారం కొంపల్లి మున్సిపల్ సర్కిల్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టాయి. అనంతరం ఉప కమిషనర్ లావణ్యకు వినతిపత్రం అందజేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ఆధ్వర్యంలో చేపడుతున్న వారంరోజుల నిరసనల్లో భాగంగా ఆరో రోజు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు నాయకులు తెలిపారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు, 13 డిక్లరేషన్లు, 420 హామీలు అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం.. వెయ్యి రోజులు గడిచినా హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని ఆరోపించారు. కొంపల్లి, దూలపల్లి, సుభాష్‌నగర్ డివిజన్లలో అర్హత ఉన్నప్పటికీ పథకాలు అందని కుటుంబాలను గుర్తించి లబ్ధి చేకూర్చాలని కోరారు. హామీలను క్షేత్రస్థాయిలో అమలు చేయకపోతే మరింత పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ వైస్‌చైర్మన్ గంగయ్య నాయక్, మాజీ కౌన్సిలర్లు చింతల దేవేందర్, డప్పు కిరణ్, బూర్గుబావి సత్యనారాయణ, గంగయోల వెంకటేష్, మంత్రి రఘు, మహేష్, మధు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి ఆర్జీలను పరిష్కరిస్తాం

-ప్రజావాణికి రెండు ఫిర్యాదులు

-రామగిరి మండల ఎంపీడీవో బద్రి శైలజ రాణి

రామగిరి, సెప్టెంబర్ 07(ది క్రైమ్ న్యూస్):- ప్రజావాణి ఆర్జీలను పెండింగ్ లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామని రామగిరి మండల ఎంపీడీవో బద్రి శైలజ రాణి అన్నారు.సోమవారం ప్రజావాణి సందర్భంగా మండల ప్రజా పరిషత్ సమావేశపు మందిరంలో డీటీ మానస, ఎంపీవో సమ్మిరెడ్డి, ఏఓ శ్రీకాంత్, ఏపీఎం పద్మ, ఇంచార్జి ఏపీవో మౌనిక లతో కలిసి ప్రజల నుంచి రెండు ఆర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రజలు వివిధ శాఖలకు సంబంధించి ప్రజావాణికి మొత్తం ఇప్పటి వరకు రామగిరి మండలం లో రెండు ఆర్జీలు రాగా కుక్కలు, కోతుల బెడద కు సంభందించిన ఆర్జీ కాగా మరొకటి ఇందిరమ్మ ఇల్లుకు సంభందించిన దరఖాస్తులను ఇవ్వగా ఆర్జీలను పరిష్కరించాల్సి ఉందన్నారు. మండల స్థాయిలోనూ ప్రజావాణి కార్యక్రమంను నిర్వహిస్తున్నందున సంబంధిత శాఖల మండల స్థాయి అధికారులందరూ తప్పకుండా హాజరై తమ శాఖల పరిధిలో వచ్చిన ఆర్జీలను సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు.ప్రజావాణి కార్యక్రమానికి అధికారులు సకాలంలో హాజరుకావాలని , అలసత్వం చూపవద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, ఇతర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఆలస్యంగా తెరుచుకున్న చెంజర్ల గ్రామ పంచాయతీ కార్యాలయం

గ్రామస్థుల ఆగ్రహం

కరీంనగర్ టౌన్, సెప్టెంబర్ 7,(ది క్రైమ్ న్యూస్) కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం చెంజర్ల గ్రామ పంచాయతీ కార్యాలయం సోమవారం ఉదయం ఆలస్యంగా తెరుచుకోవడంతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఉదయం 11 గంటలైనా కార్యాలయానికి తాళం వేసి ఉండటంతో, వివిధ ధృవీకరణ పత్రాలు, ఇతర పనుల నిమిత్తం వచ్చిన ప్రజలు సుదీర్ఘ సమయం వేచి ఉండాల్సి వచ్చింది.కార్యాలయం తెరవకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేసిన కొందరు గ్రామస్థులు ఈ విషయాన్ని ఫోన్ ద్వారా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సమాచారం అందుకున్న పంచాయతీ కార్యదర్శి హుటాహుటిన అక్కడికి చేరుకుని తాళాలు తెరిచారు. అయితే, ఉన్నతాధికారులకు ఎందుకు ఫిర్యాదు చేశారంటూ కార్యదర్శి గ్రామస్థులను ప్రశ్నించడంతో అక్కడ కొంతసేపు వాగ్వాదం చోటుచేసుకుంది.ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాల్సిన పంచాయతీ కార్యాలయం ఇలా నిర్లక్ష్యంగా ఆలస్యంగా తెరవడంపై స్థానికులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, కార్యాలయం ప్రతిరోజు నిర్ణీత సమయానికి తెరుచుకునేలా, సిబ్బంది సమయపాలన పాటించేలా చర్యలు తీసుకోవాలని చెంజర్ల గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

విశ్వజి

ఎండాకాలంలో జుట్టుకు ఆయిల్ రాయాలా? వద్దా? నిపుణులు ఏమంటున్నారో తెలుసా..

ఈ రోజుల్లో చాలామందిని వేధించే సమస్యల్లో జుట్టు రాలడం ఒకటి. దీనికి అనేక కారణాలు ఉండవచ్చు. అయితే జుట్టుకి ఆయిల్ పెడితే వెంట్రుకలు ఊడిపోవు బలంగా ఉంటాయని తరచుగా పెద్దలు,నిపుణులు చెబుతుండటం మనం చూస్తుంటాం. వాస్తవానికి జుట్టుకు నూనె రాయడం వల్ల చాలా ఉపయోగాలే ఉంటాయి. అయితే ఎండాకాలంలో చాలామంది జుట్టుకు ఆయిల్ రాసుకోరు. సమ్మర్ లో చెమట, దుమ్ము, కాలుష్యం వల్ల జుట్టు జిడ్డుగా మారడం, నిర్జీవంగా తయారవడం, చిట్లడం వంటి సమస్యలు సాధారంగా వస్తుంటాయి. దుమ్ము,ధూళి, మట్టి సలుభంగా అంటుకుంటాయి. దీంతో ఆయిల్ రాయాలా వద్దా అనే సందేహం చాలామంది సందేహిస్తుంటారు. సమ్మర్ లో జుట్టుకి ఆయిల్ రాయాలా? వద్దా? వాస్తవానికి ఏ కాలమైనా సరే మీ జుట్టుకు నూనె రాయడం చాలా ముఖ్యం. ముఖ్యంగా వేసవిలో ఇది మరింత అవసరం అని నిపుణులు చెబుతున్నారు. ఎందుకంటే ఎండ తాపానికి మీ జుట్టు బలహీనంగా మారుతుంది. అధిక చెమట,తేమ జుట్టు కుదుళ్లను బలహీనపరుస్తాయి. దీనికి తోడు సూర్య కిరణాల తాకిడి వల్ల జుట్టు పొడిబారి తన సహజత్వాన్ని కోల్పోతుంది. ఇలాంటి పరిస్థితుల్లో ఆయిల్ రాయడం జుట్టుకి ఒక రక్షణ కవచంలా పనిచేస్తుంది. “%జీబఅవ 2025 ాబఎిఎ్గ శీసఋఖఎ ాఅస్త్రఅం%: గ్రహాల అద్భుత కలయిక..జూన్ నెలలో వీరే కింగ్ లు!” ఆయిల్ రాయడం వల్ల కలిగే ప్రయోజనాలు బలాన్నిస్తుంది నూనె మీ జుట్టు కుదుళ్లకు పోషణను అందించి..వాటిని బలంగా చేస్తుంది. తద్వారా జుట్టు రాలడం తగ్గుతుంది. మెరుపునిస్తుంది నెత్తికి ఆయిల్ రాయడం వల్ల మీ జుట్టు పొడిబారకుండా ఉంటుంది. ఇది జుట్టుకు సహజమైన మెరుపును అందించి ఆరోగ్యంగా కనిపించేలా చేస్తుంది. “ఓట్స్ ఇడ్లీ ఎప్పుడైనా తిన్నారా? పొద్దున్నే అసలు తినాల్సిందే ఇది కదా..ఏం టేస్టూ,ఎన్ని బెనిఫిట్స్..ఎలా చేయాలంటే “ మృదుత్వాన్నిస్తుంది ఎండాకాంలో గరుకుగా మారిన జుట్టును ఆయిల్ మృదువుగా చేస్తుంది. దువ్వెనతో సులభంగా దువ్వుకోవడానికి సహాయపడుతుంది. పెరుగుదలను ప్రోత్సహిస్తుంది సరైన నూనెతో మర్దన చేయడం వల్ల రక్త ప్రసరణ మెరుగుపడుతుంది. ఇది జుట్టు పెరుగుదలకు తోడ్పడుతుంది. హాని నుండి రక్షిస్తుంది ఆయిల్ ఒక పొరలా ఏర్పడి, దుమ్ము, కాలుష్యం, సూర్యకిరణాల యొక్క హానికరమైన ప్రభావాల నుండి మీ జుట్టును కాపాడుతుంది. “రాయలసీమ స్పెషల్ వంకాయ అలసందల పులుసు..ఎలా చేసుకోవాలంటే” ఏ ఆయిల్ మంచిది సమ్మర్ లో కొబ్బరి నూనె,ఆలివ్ ఆయిల్,విటమిన్ %జ% తో నిండి ఉండే బాదం నూనె జుట్టును మరింత ఆరోగ్యంగా ఉంచుందని..సమ్మర్ లో ఈ మూడింటిలో ఒకదాన్ని మీ జుట్టు రకాన్ని బట్టి ఎంచుకోవాలని నిపుణులు సూచించారు.

మామిడి ఆకులతో అందం!

మామిడి పండ్లే కాదు.. ఆకులూ ఎన్నో ప్రయోజనాలు అందిస్తాయి. చర్మాన్ని మెరిపించడంలో.. అందానికి మరిన్ని వన్నెలు అద్దడంలో మామిడాకులు అద్భుతమే చేస్తాయి. ఆయుర్వేదంలో విరివిగా వాడే ఆమ్రపత్రాలు.. మొటిమలు, మచ్చలను తగ్గించడంలో ప్రముఖ పాత్ర పోషిస్తాయి. మామిడి ఆకుల్లో ఉండే యాంటి ఆక్సిడెంట్లు.. చర్మాన్ని రక్షిస్తాయి. యూవీ కిరణాలు, కాలుష్యం నుంచి కాపాడుతాయి. చర్మాన్ని మృదువుగా మారుస్తాయి. ఫేస్‌ప్యాక్‌ను క్రమం తప్పకుండా వాడితే.. వృద్ధాప్య ఛాయలు కూడా తగ్గుతాయని ఆయుర్వేద నిపుణులు అంటున్నారు. తయారీ విధానం... గుప్పెడు మామిడి ఆకుల్ని తీసుకుని.. శుభ్రంగా కడగాలి. వాటిని పాన్‌పైన మెల్లిగా వేయించాలి. చల్లారిన తర్వాత ఆకుల్ని మెత్తని పొడిలా మిక్సీ పట్టుకోవాలి. ఈ పొడిని ఒక గిన్నెలోకి తీసుకొని.. రెండు టీస్పూన్ల కొబ్బరి నూనె వేసి, బాగా కలపాలి. మందపాటి పేస్ట్‌గా తయారు చేసుకొని.. ముఖం మొత్తానికి బాగా అప్లయి చేయాలి. ఓ ఇరవై నిమిషాలు అలాగే వదిలేసి.. గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకోవాలి. వారానికి రెండు మూడుసార్లు ఇలా మామిడి ఆకుల ఫేస్‌ప్యాక్ వేసుకుంటే.. ముఖవర్చస్సు మారిపోతుంది. ప్రయోజనాలు... మామిడి ఆకుల్లో ఉండే ‘మాంగిఫెరిన్’ అనే సమ్మేళనాలు.. మొటిమల వల్ల కలిగే మచ్చల్ని తగ్గిస్తాయి. మొటిమలతో ఇబ్బంది పడేవారికి మామిడి ఆకుల ఫేస్‌ప్యాక్ మంచి ఫలితం ఇస్తుంది. వీటిలో పుష్కలంగా లభించే ‘టైరోసిన్’.. చర్మం నల్లబడటాన్ని నివారిస్తుంది. ముఖం, ఇతర శరీర భాగాలపై ఏర్పడే నల్లటి మచ్చల్ని తగ్గిస్తుంది. క్రమం తప్పకుండా వాడితే.. గ్లాసీ గ్లోయింగ్ స్కిన్ మీ సొంతమవుతుంది. శరీరంలో కొల్లాజెన్ ఉత్పత్తిని పెంచడంలో మామిడి ఆకులు సాయపడతాయి. దాంతో చర్మం ముడతలు పడటం తగ్గుతుంది.

సన్ స్క్రీన్‌ను ఇలా రాసుకుంటేనే పని చేస్తుందట..

లేకపోతే చర్మం కాలిపోతుందట, ఎలా అంటే?

బయట ఎండలు ఘోరంగా దంచి కొడుతున్నాయి. ప్రజలు మధ్యాహ్నం సమయంలో ఇంట్లో నుంచి బయటికి రావాలంటే జంకుతున్నారు. బయటికి వెళ్లే వ్యక్తులు మాత్రం సన్ స్క్రీన్ వేసుకొని మరీ వెళ్తున్నారు. ఎండ నుంచి ఉపశమనం పొందడంతో పాటు చర్మానికి ఎలాంటి హాని కలగకుండా ఉండేందుకు ఈ క్రీంను ఎక్కువగా వినియోగిస్తుంటారు. అయితే ఈ సన్ స్క్రీన్ వినియోగించేందుకు కూడా ఒక విధానం ఉంటుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఆ విధానం పరంగా వినియోగిస్తేనే మంచి ఫలితాలు వస్తాయంటున్నారు. దీనివల్ల ప్రయోజనాలు పెరగడంతో పాటు.. చర్మం కూడా మరింత కాంతివంతంగా, ఆరోగ్యవంతంగా తయారవుతుందని చెబుతున్నారు. ఇంతకీ ఈ సన్ స్క్రీన్ ఎలా వినియోగించాలి, అనేది ఈ స్టోరీలో తెలుసుకుందాం. ఎలా అంటే.. సాధారణంగా సన్‌స్క్రీన్ అప్లికేషన్‌లో చిన్న తప్పిదం చేసినా, అది ఫలితాలపై ప్రభావం చూపిస్తుంది. అలాగే సరైన సన్‌స్క్రీన్‌ని ఎంచుకోకపోతే కూడా పూర్తి రక్షణ పొందలేరు. మరి సన్‌స్క్రీన్ వాడే విధానం ఏంటో ఇప్పుడు చూద్దాం. “%జీబఅవ 2025 ాబఎిఎ్గ శీసఋఖఎ ాఅస్త్రఅం%: గ్రహాల అద్భుత కలయిక..జూన్ నెలలో వీరే కింగ్ లు!” ఎప్పుడు అప్లై చేయాలి? సన్‌స్క్రీన్‌ను తప్పకుండా ఎండలోకి వెళ్లే ముందు 15 నుంచి 30 నిమిషాల ముందే అప్లై చేయాలి. అలా చేస్తే స్కిన్ దానిని బాగా శోషించుకుని, ఎండ నుంచి రక్షణ పొందేందుకు సిద్ధంగా ఉంటుంది. అప్లై చేసి వెంటనే బయటికి వెళ్తే అది తక్కువగా ప్రభావం చూపుతుంది. “ఓట్స్ ఇడ్లీ ఎప్పుడైనా తిన్నారా? పొద్దున్నే అసలు తినాల్సిందే ఇది కదా..ఏం టేస్టూ,ఎన్ని బెనిఫిట్స్..ఎలా చేయాలంటే “ ఎంత మోతాదులో అప్లై చేయాలి? చాలా మందికి చిన్న మోతాదులో అప్లై చేయడం అలవాటు. కానీ పూర్తి మొహానికి, మెడకు సరిపడేంత సన్‌స్క్రీన్ ఉపయోగించాలి. సులువుగా కొలవాలంటే “టూ ఫింగర్ రూల్” పాటించండి. అంటే రెండు వేల్స్ పొడవు మేర సన్‌స్క్రీన్ తీసుకుని అప్లై చేయడం ఉత్తమం. “రాయలసీమ స్పెషల్ వంకాయ అలసందల పులుసు..ఎలా చేసుకోవాలంటే” ఎక్కడెక్కడ అప్లై చేయాలి? కేవలం ముఖానికే కాదు, ఎండకి బహిర్గతమయ్యే అన్ని భాగాలకూ సన్‌స్క్రీన్ అప్లై చేయాలి. ప్రత్యేకంగా బీచ్‌లకు వెళ్తున్నప్పుడు ముఖం, చేతులు, కాళ్లు ఇలా పూయడం తప్పనిసరి. %ుాశీషవతీవస దీఎ ఖూా 2025ాదీఖూ జం వీ× : ాష్ట్రతీవఖుం ×ఎవతీ దీ×+ాూఎిష్ట్రఅవజవఎవత్ అఅ ఖూా ాముజవం ఖీుఅం ్రూజుజుజుూజుూా ఎ ాఅవఅఅఎఋ ఎవశ్రీబస్త్రబ% ఎలాంటి %్రూఖీ% ఎంచుకోవాలి? సన్‌స్క్రీన్‌లో కనీసం %్రూఖీ% 30 లేదా %్రూఖీ% 50 ఉండే ఉత్పత్తులను ఎంచుకోవడం మంచిది. ఇవి స్కిన్‌ను హానికారక %ఖఎ% కిరణాల నుంచి బాగా రక్షిస్తాయి. షాపింగ్ చేసే ముందు లేబుల్ చెక్ చేయడం మర్చిపోవద్దు. ఎన్ని గంటలకొకసారి అప్లై చేయాలి? సరైన రక్షణ కోసం కనీసం రెండు గంటలకొకసారి సన్‌స్క్రీన్ రీఅప్లై చేయాలి. స్విమ్మింగ్ చేసిన తర్వాత లేదా ఎక్కువగా చెమట పోయినప్పుడు తప్పకుండా తిరిగి పూయాలి. ఇంట్లో ఉన్నా అప్లై చేయాలా? ఇంట్లో ఉన్నప్పుడు కూడా సన్‌స్క్రీన్ అప్లై చేయడం అవసరం. చాలా మంది దీనిని తప్పుగా తీసుకుంటారు. అయితే కిటికీ గ్లాసులు గుండా వచ్చే కిరణాల వల్ల కూడా స్కిన్ డ్యామేజ్ అయ్యే ప్రమాదం ఉంది. అందుకే ఇంట్లోనైనా అప్లై చేయడం మంచిది. ఈ టిప్స్ పాటించి మీరు సన్ స్క్రీన్ వినియోగిస్తే కచ్చితంగా మెరుగైన ఫలితాలను పొందే అవకాశం ఉంటుంది. అలాగే మీ చర్మం ఎలాంటి సమస్యలకు లోనవకుండా ఆరోగ్యవంతంగా.. తాజాగా కనిపిస్తుంది.

మార్కెట్

ట్రంప్‌తో విభేదాలు.. 14 శాతం పతనమైన టెస్లా షేర్లు..

మస్క్‌కు రూ.13 లక్షల కోట్ల నష్టం

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ మధ్య స్నేహబంధం చెడింది. అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ గెలుపునకు సొంత డబ్బును నీళ్లలా ఖర్చు చేసిన మస్క్ ఇప్పుడు అదే ట్రంప్ వైఖరిని తప్పుబడుతున్నారు. ఇటీవల డోజ్ శాఖ నుంచి వైదొలిగిన మస్క్.. బహిరంగంగానే ట్రంప్‌పై సంచలన ఆరోపణలు చేస్తున్నారు. అదేసమయంలో మస్క్‌కు ట్రంప్ స్ట్రాంగ్ వార్నింగ్ కూడా ఇస్తున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో మస్క్‌కు తీవ్ర నష్టం వాటిల్లింది. ఆయన సంస్థ టెస్లా షేర్లు భారీగా పతనమయ్యాయి (%ువశ్రీఖ ంష్ఘుతీవం ుతీశీజూజూవు%). గురువారం నాటి ట్రేడింగ్‌లో టెస్లా షేర్లు ఏకంగా 14శాతం పతనమయ్యాయి. దాదాపు 152 బిలియన్ డాలర్ల సంపద ఆవిరైంది. అంటే భారత కరెన్సీలో దాదాపు రూ.13 లక్షల కోట్లన్నమాట. దీంతో కంపెనీ మార్కెట్ విలువ 1 ట్రిలియన్ మార్క్‌ను కోల్పోయి 916 బిలియన్ డాలర్లకు పడిపోయింది. టెస్లా సంపద ఒక్క రోజులోనే ఈ స్థాయిలో తరిగిపోవడం సంస్థ చరిత్రలోనే ఇదే తొలిసారి కావడం గమనార్హం. అమెరికన్లకు పన్ను తగ్గించేందుకు బిగ్ ట్యాక్స్ బ్రేక్ బిల్లును ట్రంప్ యంత్రాంగం తీసుకొచ్చింది. ట్రంప్–మస్క్ మధ్య దూరానికి ఈ బిల్లే ప్రధాన కారణమని చెప్తున్నారు. ఈ బిల్లుతో ధనికులకు 4.5 లక్షల కోట్ల డాలర్ల మేర లబ్ధి చేకూరి, పేదలకు ఉద్దేశించిన సంక్షేమ పథకాలు మరుగున పడుతాయని మస్క్ తప్పుబడుతున్నారు. ఇదో అసహ్యకరమైన బిల్లుగా ఆయన అభివర్ణించారు. రుణ

పరిమితిని పెంచి అమెరికా ఆర్థికాన్ని దివాలా తీయించేలా ఉన్న ఇలాంటి బిల్లుకు మద్దతిచ్చిన వారికి సిగ్గు ఉండాలని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ‘కిల్ ది బిల్’ అంటూ ట్వీట్ చేశారు. అయితే, ఎలక్ట్రిక్ కార్లకు రాయితీ తగ్గింపు అంశం బిల్లులో ఉండటం వల్లే మస్క్ దీన్ని వ్యతిరేకిస్తున్నారని ట్రంప్ వర్గం ఎదురుదాడికి దిగుతున్నది.

రఫేల్ విమానాల తయారీ ఇక్కడే



హైదరాబాద్‌లో ఫ్యూజ్‌లేజ్ తయారీ టాటా ఏవియేషన్-డసో మధ్య కుదిరిన ఒప్పందం

హైదరాబాద్ : ప్రపంచంలోనే అత్యంత అధునాతనమైన రఫేల్ యుద్ధ విమానాలకు అవసరమైన ఫ్యూజ్‌లేజ్(విమానం బాడీకి సంబంధించిన ప్రధాన విడిభాగం)లు హైదరాబాద్‌లో తయారు కానున్నాయి. ఫ్యూజ్‌లేజ్‌ల ఉత్పత్తికి సంబంధించి రఫేల్ మాతృ సంస్థ డస్సాల్ట్(డసో) ఏవియేషన్, టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్(టీఏఎస్ఎల్)లు ఇందుకు సంబంధించి ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. ఇది దేశీయ ఏరోస్పేస్ తయారీ సామర్థ్యాలను బలోపేతం చేయడంతోపాటు ప్రపంచ వ్యాప్తంగా సరఫరా చేయడానికి ఈ ఒప్పందం మరో ముందడుగు కానున్నది. ఈ ఒప్పందంలో భాగంగా మొదటి ఫ్యూజ్‌లేజ్ 2028 నాటికి సిద్ధమవుతుందని, ఈ యూనిట్‌లో నెలకు రెండు ఫ్యూజ్‌లేజ్‌లు తయారుకానున్నాయి. వీటి తయారీ కోసం హైదరాబాద్‌లో టీఏఎస్ఎల్ ఓ అత్యాధునిక ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేయనుంది.

బీఆర్ఎస్ హయాంలోనే.. టీఏఎస్ఎల్ 2007 నుంచి ఏరోస్పేస్ మరియు డిఫెన్స్ రంగ ఉత్పత్తులను తయా రు చేస్తున్నప్పటికీ బీఆర్ఎస్ హయాంలో 2018లో ఆదిభట్లలో ప్రత్యేక అధునాతన తయారీ కేంద్రాన్ని ఏర్పాటుచేసి తమ కార్యకలాపాలను భారీగా విస్తరించింది. సికోర్స్కీ ఎయిర్‌క్రాఫ్ట్ కార్పొరేషన్ భాగస్వామ్యంతో సికోర్స్కీ ఎస్–92 హెలీకాప్టర్ల క్యాబిన్‌లను ఇక్కడ తయారు చేస్తున్నారు. అలాగే, లాక్‌హీడ్ మార్టిన్, ఎయిర్‌బస్ డిఫెన్స్ అండ్ స్పేస్, బోయింగ్ తదితర కంపెనీల భాగస్వామ్యంతో అనేక విమాన విడిభాగాలను ఇక్కడ ఉత్పత్తి అవుతున్నాయి. బోయింగ్ భాగస్వామ్యంతో అపాచీ హెలీకాప్టర్ల కోసం ఫ్యూజ్‌లేజ్‌లను తయారు చేస్తున్నారు. జీఈ ఏరోస్పేస్ మరియు సఫ్రాన్ ఎయిర్‌క్రాఫ్ట్ ఇంజిన్, సీఎఫ్ఎం ఎంటర్నేషనల్ జాయింట్ వెంచర్ కోసం విమానాల ఇంజిన్ భాగాలను తయారుచేస్తున్నారు. మొరాకోసహా పలు ఆఫ్రికన్ దేశాలకు రక్షణ ఉత్పత్తులను సరఫరా చేసేందుకు టీఏఎస్ఎల్ ఒప్పందాలు చేసుకున్నది.

‘మొదటిసారిగా, రఫేల్ ఫ్యూజ్‌లేజ్‌లు ఫ్రాన్స్ వెలుపల ఉత్పత్తి కానుండటం ఇదే తొలిసారి. భారత్‌లో మా సరఫరా వ్యవస్థను మరింత బలోపేతం చేయడంలో ఇది నిర్ణయాత్మక దశ. దేశీయ ఏరోస్పేస్ పరిశ్రమలోని ప్రధాన కంపెనీల్లో ఒకటైన టీఏఎస్ఎల్‌సహా మా స్థానిక భాగస్వాముల విస్తరణకు ధన్యవాదాలు. నాణ్యమైన సేవలకు, సైనిక అవసరాలు తీర్చేందుకు దోహదపడుతుంది. ఎరిక్ ట్రాఫియర్, డస్సాల్ట్ ఏవియేషన్ సీఈవో

దేశీయ ఏరోస్పేస్ ప్రయాణంలో ఈ భాగస్వామ్యం అత్యంత కీలకమైనది. రఫేల్ ఫ్యూజ్‌లేజ్ ఉత్పత్తి టాటా అడ్వాన్స్ డ్ సిస్టమ్స్ సామర్థ్యాలపై పెరుగుతున్న నమ్మకానికి, మాపట్ల డస్సాల్ట్ ఏవియేషన్‌కు ఉన్న విశ్వాసానికి నిదర్శనం. ప్రపంచ వేదికలకు మద్దతు ఇవ్వగల ఆధునిక, బలమైన ఏరోస్పేస్ తయారీ పర్యావరణ వ్యవస్థను స్థాపించడంలో దేశం సాధించిన అద్భుతమైన పురోగతిని కూడా ఇది ప్రతిబింబిస్తుంది.

ఫ్లిప్‌కార్ట్..

ఎన్‌బీఎఫ్‌సీ సేవలు

న్యూఢిల్లీ, జూన్ 5: ప్రముఖ ఈ–కామర్స్ సంస్థ ఫ్లిప్‌కార్ట్..తాజాగా నాన్–బ్యాంకింగ్ సేవలు అందించడానికి సిద్ధమైంది. ఇందుకు సంబంధించి రిజర్వుబ్యాంక్ లైసెన్స్‌ను మంజూరు చేసింది. దీంతో ఎన్‌బీఎఫ్‌సీ సేవలకు లైన్ క్లియర్ అయినట్టు అయింది. దీనిపై ఫ్లిప్‌కార్ట్ ప్రతిని స్పందించడానికి నిరాకరించారు. కస్టమర్‌కు నేరుగా రుణాలు అందించడానికి వీలు పడనున్నదని, అలాగే కస్టమర్ ఈఎంఐ లేదా ఇన్‌స్టాల్‌మెంట్ మోడ్‌లో చెల్లించుకోవచ్చును.

ఆంధ్రప్రదేశ్

28 జిల్లాలకు ఇన్‌ఛార్జ్‌ల నియామకం

స్థానిక సమరానికి టీడీపీ సనద్ధం

అమరావతి,సెప్టెంబర్7 : ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల కోసం తెలుగుదేశం పార్టీ (టీడీపీ) సర్వసన్నద్ధమవుతోంది. ఈ దిశగా ఎన్నికల కసరత్తును వేగవంతం చేస్తూ, రాష్ట్రంలోని 28 జిల్లాలకు పార్టీ ఇన్‌ఛార్జ్‌లను నియమిస్తూ అధిష్ఠానం ఉత్తర్వులు జారీ చేసింది. అభ్యర్థుల ఎంపిక ప్రక్రియలో ఈసారి సరికొత్త వ్యూహాన్ని అనుసరించడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈసారి అభ్యర్థుల ఎంపిక బాధ్యతను సిట్టింగ్ ఎమ్మెల్యేలకు కాకుండా ఎంపీలు, ఎమ్మెల్సీలు, పార్టీలోని ఇతర కీలక నేతలకు అప్పగించారు. అభ్యర్థుల ఎంపిక, ఎన్నికల ప్రచారం, క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణులను క్రియాశీలం చేయడంతో పాటు మిత్రపక్షాలైన జనసేన, బీజేపీ నేతలతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగడం వంటి కీలక బాధ్యతలను ఈ ఇన్‌ఛార్జ్‌లు నిర్వర్తించనున్నారు. విజయనగరానికి ఎంపీ చింతకాయల విజయ్, తూర్పుగోదావరికి దేవినేని ఉమామహేశ్వరరావు, పల్నాడుకు కొనకళ్ల నారాయణ, పశ్చిమగోదావరికి ఎంపీ భాష్యం రామకృష్ణ వంటి పలువురు సీనియర్లకు పార్టీ కీలక బాధ్యతలు అప్పగించింది. మరోవైపు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్థానిక ఎన్నికలపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. తన సొంత నియోజకవర్గమైన కుప్పం నేతలతో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. స్థానిక ఎన్నికలను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని, నేతలు, కార్యకర్తలు సమష్టిగా పనిచేసి మెరుగైన ఫలితాలు సాధించాలని ఈ సందర్భంగా దిశానిర్దేశం చేశారు. ఫలితాల్లో ఏమాత్రం తేడా వచ్చినా సహించేది లేదని ఆయన స్పష్టం చేసినట్లు సమాచారం. త్వరలోనే తాను కుప్పంలో పర్యటిస్తానని కూడా చంద్రబాబు వెల్లడించారు.

నిరుద్యోగులపై బురదజల్లుతారా?

కష్టపడి మెగా డీఎస్సీ సాధించారు

ఏపీ మంత్రి రాంప్రసాద్ రెడ్డి ఫైర్

అమరావతి,సెప్టెంబర్7(ఆర్ఎన్ఎ): మెగా డీఎస్సీలో ప్రతిభతో ఉద్యోగాలు సాధించిన అభ్యర్థుల శ్రమను, వారి విజయాన్ని అవమానించేలా వైసీపీ నేతలు చౌకబారు ఆరోపణలు చేయడం అత్యంత బాధాకరమని ఏపీ మంత్రి రాంప్రసాద్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మెగా డీఎస్సీ సాధించిన అభ్యర్థులను వేధించడం, వారిపై బురదజల్లడాన్ని వైసీపీ నేతలు వెంటనే మానుకోవాలని హితవు పలికారు. 2018 డీఎస్సీలో తృటిలో ఉద్యోగం కోల్పోయినప్పటికీ నిరాశ చెందకుండా.. ఏడేళ్ల పాటు పట్టుదలతో, రాత్రింబవళ్లు తేడా లేకుండా చదివి ఎన్నో త్యాగాలు చేసి 2025 మెగా డీఎస్సీలో ఉద్యోగాలు సాధించారని మంత్రి కొనియాడారు. వారి విజయాన్ని స్వార్థ రాజకీయాల కోసం అవమానించడం తగదని మండిపడ్డారు. అప్లికేషన్ల స్వీకరణ నుంచి మెరిట్ జాబితా విడుదల వరకు కూటమి ప్రభుత్వం మెగా డీఎస్సీ ప్రక్రియను అత్యంత పకడ్బందీగా, పారదర్శకంగా పూర్తి చేసిందని స్పష్టం చేశారు. మెరిట్, అర్హత ప్రాతిపదికన ఉద్యోగాలు సాధించిన వారి కష్టాన్ని ప్రశ్నించడం ఆయా అభ్యర్థుల కుటుంబాల త్యాగాలను అవమానించడమేనని ధ్వజమెత్తారు. యువత భవిష్యత్తుతో రాజకీయ క్రీడలొద్దని, అభ్యర్థుల ఆవేదనను గ్రహించి జగన్ తక్షణమే తన వైఖరిని మార్చుకోవాలని అన్నారు.

కొత్త అర్హులకూ అవకాశం

సెప్టెంబర్ 7 నుంచి 16 వరకు కొత్త పింఛన్లకు దరఖాస్తుల స్వీకరణ

స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు కేంద్రాల్లో ప్రత్యేక ఏర్పాట్లు

అమరావతి, సెప్టెంబర్ 7 : రాష్ట్రంలో ప్రతి నెలా జరిగే 'పేదల పండుగ'ను ప్రభుత్వం మరో స్థాయికి తీసుకువెళ్తోంది. ఇప్పటికే దేశంలోనే అత్యధిక స్థాయిలో సామాజిక భద్రత పింఛన్లు అందిస్తూ 62 లక్షల మంది పేదలకు ప్రతి నెలా ఆర్థిక భరోసా కల్పిస్తున్న కూటమి ప్రభుత్వం, ఇప్పుడు ఆ భరోసాను మరింత విస్తరించేందుకు సిద్ధమైంది. అర్హత కలిగిన మరింత మంది పేదలు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఇతర బలహీన వర్గాలకు కొత్తగా అవకాశం కల్పిస్తూ ఎన్టీఆర్ భరోసా పింఛన్ పథకం కింద తాజా దరఖాస్తుల స్వీకరణకు శ్రీకారం చుట్టింది. సెప్టెంబర్ 7 నుంచి 16వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు కేంద్రాల్లో కొత్త పింఛన్ల కోసం దరఖాస్తులను స్వీకరించనున్నారు. దరఖాస్తుల పరిశీలన నుంచి అర్హత నిర్ధారణ, ప్రభుత్వ ఆమోదం వరకు ప్రతి ప్రక్రియను నిర్దిష్ట కాలపరిమితిలో పూర్తి చేసి, అర్హులైన వారికి దశలవారీగా పింఛన్లు మంజూరు చేయనున్నారు. అర్హులైన వారు తమకు సంబంధించిన స్వర్ణ గ్రామం లేదా స్వర్ణ వార్డు కేంద్రాల్లో దరఖాస్తులు సమర్పించవచ్చు. దరఖాస్తు స్వీకరణ, ఆన్‌లైన్ నమోదు, ఈ-కేవైసీ ప్రక్రియ పూర్తయిన తరువాత నిర్దిష్ట కాలపట్టిక ప్రకారం అర్హతను పరిశీలిస్తారు. అన్ని స్థాయిల్లో పరిశీలన పూర్తయిన అనంతరం అర్హులైన లబ్ధిదారులకు దశలవారీగా పింఛన్లు మంజూరు చేస్తారు. అర్హులు దరఖాస్తును పూర్తి చేసి, అవసరమైన ధృవపత్రాలతో సంబంధిత స్వర్ణ గ్రామం లేదా స్వర్ణ వార్డు కేంద్రంలో సమర్పించాలి. దరఖాస్తును ఆన్‌లైన్‌లో నమోదు చేసిన అనంతరం సిస్టమ్ జనరేటెడ్ అక్నాలెడ్జ్‌మెంట్ అందజేస్తారు. అవసరమైన ధృవపత్రాలు అన్ని కేటగిరీలకు సాధారణంగా ఆధార్ కార్డు, రైస్ కార్డు లేదా ఆదాయ ధృవపత్రంతో పాటు సంబంధిత కేటగిరీకి అవసరమైన ప్రత్యేక ధృవపత్రాలను సమర్పించాలి. వృద్ధాప్య పింఛన్ కొరకు వయస్సు నిర్ధారణకు ఆధార్, వితంతు పింఛన్ కొరకు భర్త మరణ ధృవపత్రం, భర్త ఆధార్ నంబర్ ఉండాలి. ఒంటరి మహిళ కొరకు వివాహిత అయితే కోర్టు/అదాలత్ విడాకుల డిక్రీ; అవివాహిత అయితే తహసీల్దార్ జారీ చేసే వివాహం కాని ధృవపత్రం, దివ్యాంగుల పింఛన్ కొరకు 40 శాతం లేదా అంతకంటే ఎక్కువ బెంచ్‌మార్క్ దివ్యాంగత్వాన్ని నిర్ధారించే సదరమ్ ధృవపత్రం సమర్పించాలి. చేనేత కార్మికుల కొరకు చేనేత, జౌళి శాఖ ధృవపత్రం, మత్స్యకారుల కొరకు మత్స్య శాఖ ధృవపత్రం, డప్పు కళాకారుల కొరకు సాంఘిక సంక్షేమ శాఖ జారీ చేసే ధృవపత్రం ఉండాలి. సంప్రదాయ చెప్పుల తయారీదారులు కొరకు సాంఘిక సంక్షేమ శాఖ జారీ చేసే ధృవపత్రం, కల్లుగీత కార్మికుల కొరకు నిషేధ, ఎక్సైజ్ శాఖ ధృవపత్రం, ట్రాన్స్‌జెండర్ లబ్ధిదారులకు జిల్లా వైద్య మండలి జారీ చేసే ధృవపత్రం తప్పనిసరి. దేశంలోనే అత్యున్నత సామాజిక భద్రత(పస్తుతం రాష్ట్రంలో 61,92,396 మంది పింఛనుదారులకు నెలకు రూ.2,694 కోట్ల మేర పింఛన్లు అందిస్తున్నారు. రాష్ట్ర జనాభాలో సుమారు 12.88 శాతం మంది సామాజిక భద్రత పింఛన్ల ప్రయోజనం పొందుతున్నారు. పింఛన్ మొత్తం, పింఛనుదారుల సంఖ్య, నెలవారీ వ్యయం, పింఛన్ల కోసం కేటాయిస్తున్న వార్షిక నిధుల పరంగా ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అత్యున్నత స్థానంలో ఉంది. ఇది కేవలం గణాంకాల్లో కనిపించే రికార్డు మాత్రమే కాదు... కోట్లాది పేద కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న నిరంతర ఆర్థిక భరోసాకు నిదర్శనం.

స్వర్ణభారత్ ట్రస్ట్ సేవలు అభినందనీయం

25 ఏళ్లుగా సేవలు అందించడం గొప్ప విషయం

యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ వెల్లడి

వెంకటాచలంలో రజతోత్సవ వేడుకలకు రాక

అమరావతి,సెప్టెంబర్7 : స్వర్ణభారత్ ట్రస్ట్ పేదపిల్లలకు విద్యాబుద్ధులు నేర్పిస్తోందని ఉత్తర్?ప్రదేశ్? ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ పేర్కొన్నారు. వారి కోసం అన్ని రకాల వసతులూ కల్పిస్తోందని చెప్పారు. పేదపిల్లలకు చదువు చెప్పడం అనేది గొప్ప సమాజ సేవన్నారు. యువతకు వివిధ రంగాల్లో శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తున్నారని వివరించారు. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్ రజతోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రసంగంలో భాగంగా అందరికీ వందనం అంటూ యోగి తెలుగులో మాట్లాడి సభికుల్లో ఉత్సాహం నింపారు. 'కరోనా మహమ్మారి వల్ల అనేకమంది తల్లిదండ్రులు చనిపోయారు. అనాథ పిల్లలకు యూపీలో అటల్ ఆవాస్ విద్యాలయ్‌లో ఉచిత విద్య. మా గురుకుల పాఠశాలల్లో వసతుల కల్పనకు వెంకయ్యనాయుడే స్ఫూర్తి. సాంకేతికత పరిజ్ఞానాన్ని సమర్థంగా వాడుకునే దేశమే ముందుకెళ్తోంది. ఎంత చదువుకుని, ఉన్నతస్థానానికి వెళ్లినా దేశం పట్ల భక్తి ఉండాలి, ఎక్కడికి వెళ్లినా నేషన్ ఫస్ట్ అనే భావన అందరిలో ఉండాలని' యోగి ఆదిత్యనాథ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, మంత్రులు నారాయణ, సత్యకుమార్?తోపాటు తదితరులు హాజరయ్యారు. స్వర్ణభారత్ ట్రస్ట్ 25 ఏళ్లుగా సేవలు అందించడం అభినందనీయం. సమాజసేవకు వెంకయ్యనాయుడు తీసుకున్న సంకల్పం గొప్పది. స్వర్ణభారత్ ట్రస్ట్‌లో విద్య తోపాటు నైపుణ్య శిక్షణనూ అందిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల యువత, మహిళలకు ఉపాధి కల్పిస్తున్నారు. ఉత్తరాదికి, దక్షిణాదికి వారధిగా వెంకయ్యనాయుడు పని చేశారు. మన పల్లెలు జ్ఞానానికి, ఆర్థికాభివృద్ధికి మూలకేంద్రాలు. ఒకప్పుడు మన గ్రామాలన్నీ స్వయంపోషకాలుగా ఉండేవి. అందుకే గ్రామాలకు తరలండి అంటూ గాంధీజీ పిలుపునిచ్చారు. పేద పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పడం జాతి నిర్మాణానికి సాయం చేయడమే. ఎక్కడికి వెళ్లినా భారతీయులం అంటూ గర్వంగా చెప్పుకోవాలి. గ్రామీణ ఉత్పత్తులకు ప్రపంచస్థాయి మార్కెటింగ్ సదుపాయాలు ఉన్నాయి. స్వర్ణభారత్ ట్రస్ట్ తనకు మానస పుత్రికని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు చెప్పారు. తన పేరుపై ఉన్న ఆస్తులు ట్రస్ట్‌కే చెందుతాయని ప్రకటించారు. ప్రతిఒక్కరూ జీవితంలో కొంతభాగం సేవకు కేటాయించాలని పిలుపునిచ్చారు. ఒకప్పుడు ఉత్తర్‌ప్రదేశ్ దేశంలో చాలా వెనుకబడిన ప్రదేశంగా ఉండేదని గుర్తుచేశారు. యోగి ఆదిత్యనాథ్ పాలనలో ఉత్తర్‌ప్రదేశ్ ఉత్తమప్రదేశ్‌గా మారిందని ఆయన ప్రశంసించారు. గ్రామీణ యువతకు నైపుణ్య శిక్షణ, ఉచిత విద్య, వైద్యం అందిస్తూ వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు ట్రస్ట్ నిరంతరం కృషి చేస్తోందని మేనేజింగ్ ట్రస్టీ దీపా వెంకట్ తెలిపారు. అంతకుముందు అక్షర విద్యాలయ ప్రాంగణంలోని హెలిప్యాడ్ వద్ద యోగి ఆదిత్యనాథ్‌కు ట్రస్ట్ నిర్వాహకులు, నేతలు స్వాగతం పలికారు. అనంతరం సోమా సాంకేతిక శిక్షణ కేంద్రాన్ని ఆదిత్యనాథ్ సందర్శించి అక్కడ శిక్షణ పొందుతున్న యువతతో మాట్లాడారు. స్వర్ణభారత్ ట్రస్ట్‌లో యువతకు ఇస్తున్న సాంకేతిక శిక్షణ, నైపుణ్యాలపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల స్కేటింగ్ ప్రదర్శనను ఆసక్తిగా వీక్షించారు. అక్షర విద్యాలయ నిర్వహణను యోగి ప్రశంసించారు.

వృద్ధ మహిళపై సీఐ దురుసు ప్రవర్తన

మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు

అమరావతి,సెప్టెంబర్7 : బాపట్ల జిల్లా చీరాల టూటౌన్ సీఐ శశికుమార్ కార్డన్ సెర్చ్ నిర్వహిస్తూ ఓ ఇంటి బయట వృద్ధురాలితో అసభ్యంగా ప్రవర్తించడం, దూషించడంపై సర్వత్రా విమర్శలు చెలరేగుతున్నాయి. సీసీ కెమెరాలో నమోదైన ఈ దశ్యాలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతూ హల్‌చల్ చేస్తున్నాయి. చట్టప్రకారం, నైతికంగా ఇది ఎంత మాత్రం ఆమోదయోగ్యం కాదంటూ ప్రజా సంఘాల నేతలు మండిపడుతున్నారు. బాపట్ల జిల్లా చీరాల రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రామ్‌నగర్‌లో తాజాగా చోటుచేసుకున్న ఘటన పోలీసు శాఖ ప్రతిష్టపై మరోసారి చర్చకు దారితీసింది. ఎస్టీ ఎరుకల సామాజిక వర్గానికి చెందిన ఓ వృద్ధ మహిళతో రెండో పట్టణ సీఐ శశికుమార్ వ్యవహరించిన తీరుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. సెప్టెంబర్ 6వ తేదిన ఆదివారం కార్డన్ సెర్చ్ సందర్భంగా ఈ ఘటన చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. వైరల్‌గా మారిన వీడియోలో సీఐ శశికుమార్ వృద్ధ మహిళతో దురుసుగా మాట్లాడుతున్న దృశ్యాలు, అభ్యంతరకరమైన పదజాలంతో సంభాషిస్తున్నట్లు కనిపించే, వినిపించే దృశ్యాలు పోలీస్ వ్యవస్థ పట్ల ప్రజలలో మరింత అపనమ్మకాన్ని కలిగించేలా ఉన్నాయి. అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం పేరుతో కొంతమంది పోలీసులు వ్యవహరిస్తున్న తీరు ఆక్షేపణీయంగా ఉంటోంది. ప్రజలకు రక్షణ కల్పించాల్సిన పోలీసు అధికారి ఒక వృద్ధ మహిళతో దురుసుగా వ్యవహరించినట్లు ఆరోపణలు రావడం తీవ్ర విమర్శలకు కారణమవుతోంది. పోలీస్‌శాఖ శాంతిభద్రతల పరిరక్షణ కోసం కార్డన్ సెర్చ్ లు నిర్వహించే హక్కు ఉన్నప్పటికీ, ఆ సమయంలో పౌరుల, ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, చిన్నారుల ఆత్మగౌరవానికి భంగం కలిగించేలా ప్రవర్తించే అధికారం ఏ చట్టం ఇవ్వలేదు. పోలీసు నియమావళి ప్రకారం ప్రజలతో, ముఖ్యంగా బలహీన వర్గాలు, వృద్ధులతో సంయమనంతో, గౌరవప్రదంగా వ్యవహరించాలి. డ్యూటీలో ఉండి కూడా దురుసుగా, అసభ్యంగా ప్రవర్తించిన అధికారులపై శాఖాపరమైన క్రమశిక్షణా చర్యలు తీసుకునే అవకాశం ఉంది. ఇలాంటి ఘటనలపై బాపట్ల జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ లేదా ఇతర ఉన్నతాధికారులకు సాక్ష్యాలతో కూడిన వీడియో, లేదా లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయవచ్చు. అలాగే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌కు కూడా ఫిర్యాదు చేసి న్యాయం కోరవచ్చు. పోలీసులు బూతులు తిట్టడం లేదా అసభ్య పదజాలం ఉపయోగించడం చట్టప్రకారం, నైతికంగా ఏమాత్రం సరైనది కాదు. భారత రాజ్యాంగం, చట్టాలు పౌరుల ఆత్మగౌరవానికి రక్షణ కల్పిస్తాయి. నిందితులతో లేదా సామాన్య ప్రజలతో మాట్లాడేటప్పుడు పోలీసులు గౌరవప్రదంగా ప్రవర్తించాలని నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి. పోలీస్ మాన్యువల్, సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం, డ్యూటీలో ఉన్న ఏ పోలీస్ అధికారి కూడా పౌరులను దూషించడం, అవమానించడం చేయకూడదు. ఎవరైనా వ్యక్తిని పబ్లిక్‌గా బూతులు తిడితే లేదా అవమానిస్తే భారతీయ న్యాయ సంహిత, ఇతర నిబంధనల ప్రకారం అది నేరంగా పరిగణించబడుతుంది. పోలీస్ స్టేషన్‌కు వచ్చిన వారిని లేదా రోడ్డుపై వెళ్లే వాహనదారులను బూతులు తిట్టడం మానవ హక్కుల ఉల్లంఘన కిందకు వస్తుంది. ఒకవేళ పోలీసులు అలా ప్రవర్తిస్తే సదరు పోలీస్ అధికారిపై ఉన్నత అధికారులు డిఎస్పి, ఎస్పికి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయవచ్చు.

అమరావతిపై నాకు అభ్యంతరం లేదు..

మా పార్టీ సీఎం అభ్యర్థి నేను కాదు, ఆ రెండు ముమ్మాటికీ ఫ్యాక్షన్ పార్టీలే..

ప్రజలకు గోరంత, తమకు కొండంత, విజయసాయిరెడ్డి సంచలన వ్యాఖ్యలు

అమరావతి,సెప్టెంబర్7 : "అమరావతిని రాజధానిగా ఒప్పుకోవడానికి నాకు ఎలాంటి అభ్యంతరం లేదు.. మనకు ఇష్టమున్నా లేకున్నా అమరావతిని రాష్ట్ర రాజధానిగా అంగీకరించి తీరాల్సిందే" అని మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో సరికొత్త రాజకీయ పార్టీ ఏర్పాటు చేయబోతున్నట్లు అధికారికంగా ప్రకటించిన ఆయన... భవిష్యత్ కార్యాచరణపై మీడియాతో మాట్లాడుతూ పలు ఆసక్తికర విషయాలను వెల్లడించారు. రాష్ట్రంలో పరిశ్రమలు నెలకొల్పి అభివృద్ధి సాధించడమే తమ లక్ష్యమని.. ఏపీని రూ. 12 లక్షల కోట్ల అప్పుల ఊబి నుంచి బయటపడేసేందుకే తమ కొత్త పార్టీ ఉద్భవిస్తోందని స్పష్టం చేశారు. కేవలం రెడ్డి, కమ్మ సామాజిక వర్గాల వారే సీఎం స్థానంలో ఉండాలా? ఆయన ప్రశ్నించారు. బీసీలతో సహా అన్ని వర్గాలకు సమాన అవకాశాలు కల్పిస్తామని... తమ పార్టీలో ఏకంగా 66 శాతం ప్రాధాన్యత యువతకే ఇస్తామని హామీ ఇచ్చారు. ఇదే సమయంలో ఆయన మరొక సంచలన ప్రకటన చేశారు. తన పార్టీకి తాను సీఎం అభ్యర్థిని కాదని స్పష్టం చేశారు. బాల్ థాకరే తరహాలో కేవలం 'మెంటర్' గా మాత్రమే దిశానిర్దేశం చేస్తానని తేల్చిచెప్పారు. తన కుటుంబ సభ్యులు ఎవరూ కూడా పదవుల్లో ఉండరని స్పష్టం చేశారు. రాష్ట్రం విడిపోయినప్పుడు రూ. 1.02 లక్షల కోట్లుగా ఉన్న అప్పులు, గత 12 ఏళ్ల పాలనలో రూ. 12 లక్షల కోట్లకు ఎలా చేరాయని... ఆ సొమ్ము ఎవరి జేబుల్లోకి వెళ్లిందని ప్రశ్నించారు. విపరీతంగా పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలు, విద్యుత్ ఛార్జీలు, ఇంటి అద్దెలను అదుపులోకి తీసుకురావడమే తమ పార్టీ ప్రధాన ధ్యేయమని వెల్లడించారు. మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి ఏపీ రాజకీయాలపై సంచలన వ్యాఖ్యలు చేశారు. త్వరలో తాను ఏర్పాటు చేయబోయే నూతన రాజకీయ పార్టీ జెండా, అజెండాను ప్రకటించే ముందు, రాష్ట్రంలోని సమస్యలను ప్రజల ముందు ఉంచుతానని స్పష్టం చేశారు. ఏపీకి ఇప్పుడు మూడో ప్రత్యామ్నాయం ఎంతో అవసరమని, ఈ విషయాన్ని ప్రజలకు వివరిస్తానని ఆయన తెలిపారు. విజయవాడలో సోమవారం పలు కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన, ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న వైసీపీ, టీడీపీ, జనసేన పార్టీలకు ప్రజా సమస్యలను పట్టించుకునే పరిస్థితి లేదని విజయసాయిరెడ్డి విమర్శించారు. ముఖ్యంగా రాష్ట్ర రాజకీయం మొత్తం రెండు పార్టీల చుట్టూనే తిరుగుతోందని, వైసీపీ, టీడీపీల మధ్య ఫ్యాక్షన్ తరహా యుద్ధం జరుగుతోందని ఆరోపించారు. ఈ పార్టీలకు పోలీసులు కూడా మద్దతు ఇస్తున్నారని ఆయన వ్యాఖ్యానించారు. టీడీపీ, వైసీపీలు ఫ్యాక్షన్ కుటుంబ రాజకీయ పార్టీలని విజయసాయిరెడ్డి అభివర్ణించారు. ఆరు కోట్ల ప్రజానీకం, రాష్ట్ర సంపదను ఏ పార్టీ దోచుకోవాలనే హక్కు కోసం ఈ రెండు పార్టీలు పోటీ పడుతున్నాయని ఆయన తీవ్రస్థాయిలో విమర్శించారు. "ప్రజలకు గోరంత, తమకు కొండంత" అన్నట్లుగా ఈ పార్టీల తీరు ఉందని, అందుకే రాష్ట్రానికి మరో రాజకీయ ప్రత్యామ్నాయం అవసరమని ఆయన నొక్కి చెప్పారు.

ఏపీలోని పలు ప్రాంతాలకు భారీ వర్ష సూచన

అమరావతి,సెప్టెంబర్7 : ఆంధ్రప్రదేశ్‌లోని నాలుగు కీలక జిల్లాలకు రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్డీఎంఏ) రెడ్ అలర్ట్ జారీ చేసింది. గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో రాబోయే మూడు గంటల్లో వాతావరణం ఒక్కసారిగా మారనుందని హెచ్చరించింది. ఈ ప్రాంతాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని స్పష్టం చేసింది. ఈ మేరకు సోషల్ మీడియా ద్వారా ప్రజలను అప్రమత్తం చేసింది. వాతావరణ మార్పుల నేపథ్యంలో ఆయా జిల్లాల్లోని పలు ప్రాంతాలపై ప్రభావం అధికంగా ఉండనుందని విపత్తుల సంస్థ పేర్కొంది. ముఖ్యంగా గురజాల, మాచర్ల, దర్శి, కందుకూరు, ఒంగోలు, బాపట్ల, గుంటూరు, పిడుగురాళ్ల, నరసరావుపేట, చిలకలూరిపేటతో పాటు వాటి పరిసర ప్రాంతాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించింది. వర్షంతో పాటు గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది. ఈ హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు, రైతులు, వాహనదారులు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని ఏపీఎస్డీఎంఏ విజ్ఞప్తి చేసింది. ముఖ్యంగా పొలాల్లో పనిచేసే రైతులు, కూలీలు వెంటనే సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించింది. ఉరుములు, మెరుపులు వస్తున్న సమయంలో చెట్ల కింద, విద్యుత్ స్తంభాల వద్ద, ఇతర తాత్కాలిక షెడ్ల కింద నిలబడటం అత్యంత ప్రమాదకరమని స్పష్టం చేసింది. ప్రజలు వీలైనంత వరకు ఇళ్లకే పరిమితం కావాలని కోరింది.

ఏపీ వక్ఫ్ బోర్డు డిజిటల్ పాలనలో మరో ముందడుగు

- త్వరలో వెబ్‌సైట్, మొబైల్ యాప్ ప్రారంభం
ఇన్‌స్పెక్టర్ ఆడిటర్లు, సిబ్బందికి ప్రత్యేక శిక్షణ
- ఏపీ వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్

అమరావతి, సెప్టెంబర్ 7 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వక్ఫ్ బోర్డును ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా తీర్చిదిద్దే దిశగా మరో కీలక ముందడుగు పడిందని ఏపీ వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ తెలిపారు. బోర్డు సేవలు, కార్యకలాపాలను డిజిటలైజ్ చేసేందుకు ప్రత్యేకంగా వెబ్‌సైట్, మొబైల్ యాప్ రూపొందించామని, త్వరలో ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా అధికారికంగా ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర వక్ఫ్ బోర్డు కార్యాలయంలో సీఈఓ యాకూబ్ ఖాజీ ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్ ఆడిటర్లు, సిబ్బందికి ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమం ప్రారంభంలో చైర్మన్ అబ్దుల్ అజీజ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొని సందేశం అందించారు. చైర్మన్ మాట్లాడుతూ, కొత్త వ్యవస్థను ప్రారంభించడం ఒక్కటే కాదని, దాన్ని క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయడం కూడా అంతే ముఖ్యమని అబ్దుల్ అజీజ్ పేర్కొన్నారు. ఈ డిజిటల్ మార్పులో క్షేత్రస్థాయి సిబ్బంది పాత్ర కీలకమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో కొనసాగుతున్న డిజిటల్ గవర్నెన్స్‌కు అనుగుణంగా వక్ఫ్ బోర్డులోనూ ఆధునిక సాంకేతిక విధానాలను అమలు చేస్తున్నామని తెలిపారు. చైర్మన్ సందేశం అనంతరం ప్రాక్టికల్ శిక్షణ తరగతులు నిర్వహించారు. ప్రత్యేకంగా ఎల్ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేసి, వెబ్‌సైట్, మొబైల్ యాప్ వినియోగాన్ని ప్రత్యక్షంగా ప్రదర్శించారు. లాగిన్, సమాచార నమోదు, ఇప్పటికే ఉన్న వివరాల పరిశీలన, అప్‌డేషన్, క్షేత్రస్థాయి సమాచారాన్ని డిజిటల్ వ్యవస్థలో పొందుపరిచే విధానాలను దశలవారీగా వివరించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ ఆడిటర్లు, సిబ్బంది లేవనెత్తిన సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో డీఈఈ అబ్దుల్ ఖాదిర్ పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిని సమాజం నుండి తరిమేయ్యాలి.

ఇంటింటి సర్వే గోడపత్రికలను ఆవిష్కరించిన జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి

ఏలూరు, సెప్టెంబరు 07 : జిల్లాలో కుష్టు వ్యాధిని సమాజం నుండి తరిమేయ్యాలని, ప్రాథమిక దశలోనే గుర్తించి, అవసరమైన వైద్యసేవలు, వైద్యచికిత్సలు అందించేందుకు చేపడుతున్న ఇంటింటి సర్వేను జిల్లా ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి సూచించారు. జిల్లా కలెక్టరేటు గోదావరి సమావేశ మందిరంలో సోమవారం జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, కుష్టునివారణ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 11వ తేదీ నుండి 29వ తేదీ వరకు 14 రోజులు పాటు ఇంటింటి కుష్టువ్యాధి నిర్మూలన సర్వేగోడ పత్రికలను జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలోకుష్టువ్యాధి నిర్మూలన ఇంటింటి సర్వే ఇంటింటికీ వెళ్ళి నిర్వహించే సర్వేలో సిబ్బందికి ప్రజలు సహకరించాలని కోరారు. చర్మంపై కనిపించే అనుమానాస్పద మచ్చలు, పొక్కులు,రంగు మార్పులు, స్పర్శతగ్గడం వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా సర్వే సిబ్బందికి తెలియచెయ్యాలని సూచించారు. అనుమానిత కేసులను గుర్తించి దగ్గరలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లేక పట్టణ ఆరోగ్య కేంద్రంలో వైద్యపరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు, చికిత్సలు అందించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు

ఏలూరు మేయర్, జడ్పీ చైర్మన్ పదవులు బీసీలకే కేటాయించాలి

ఏలూరు : ఏలూరు నగర మేయర్, జిల్లా పరిషత్ చైర్మన్ పదవులను బీసీలకు కేటాయించాలని, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు జనాభా దామాషా ప్రకారం ప్రాతినిధ్యం కల్పించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఏలూరు జిల్లా శాఖ డిమాండ్ చేసింది. ఏలూరులోని లేడీస్ క్లబ్ మీటింగ్ హాల్‌లో జిల్లా బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బీసీ కుల సంఘాల నాయకులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు.

200 కోట్ల క్లబ్‌లో రవితేజ 'ఇరుముడి'

మాస్ మహారాజ్ రవితేజ హీరోగా నటించిన తాజా చిత్రం 'ఇరుముడి'. శివ నిర్వాణ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించింది. ఈ చిత్రం విడుదలైన తొలి రోజు నుంచే హిట్ టాక్‌ను సొంతం చేసుకుంది. ఫలితంగా ఈ చిత్రం రూ.200 కోట్ల వసూళ్లను రాబట్టినట్టు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. అయితే, ఈ చిత్రం ఇంతటి భారీ విజయానికి గల కారణాలను పరిశీలిస్తే, ఎక్కువగా మాస్ యాంగిల్‌లో కనిపించే రవితేజ ఇందులో భిన్నమైన పాత్రలో కనిపించారు. సాధారణ మధ్యతరగతి తండ్రి (త్రినాథ్)గా కనిపించారు. కూతురి ప్రేమకోసం పరితపించే తండ్రిగా భావోద్వేగభరితమైన నటనతో ఆకట్టుకున్నారు. ఆయన అభినయం విమర్శకుల ప్రశంసలు అందుకుంది. తెలుగు ప్రజలకు, ముఖ్యంగా అయ్యప్ప స్వామి భక్తులకు బాగా తెలిసిన ఇరుముడి దీక్ష గురించి ఈ సినిమాలో చూపించారు. ఈ అంశం ప్రేక్షకులకు బాగా కనెక్ట్ అయింది. తన ప్రాణమైన కూతురు మణెమ్మ (బేబీ నక్షత్ర) కోసం రవితేజ 41 రోజుల అయ్యప్ప దీక్షను స్వీకరిస్తారు. ఆ దీక్ష ఆయన జీవితాన్ని ఎలా మార్చిందనేది కథలో కీలకమైన అంశం. ఈ రెండు అంశాలకు తోడు సెంటిమెంట్‌తో పాటు ఊహించని మలుపులు, క్లైమాక్స్ ట్విస్ట్ ప్రేక్షకులను ఉత్కంఠకు గురిచేశాయి. ఇది కూడా సినిమా విజయానికి ఓ కారణంగా చెప్పొచ్చు. అలాగే, ఓ తండ్రిగా తన కూతురిపై ప్రేమ చూపించడమే కాదు, సమాజంలో అమ్మాయిలకు జరిగే అన్యాయాలకు వ్యతిరేకంగా హీరో పోరాటం చేయడం కూడా ప్రేక్షకులను కదిలించింది. ఇతపోతే, చివరగా తెలుగు ప్రజలకు బాగా సుపరిచితమైన 'మల్లెపూల పల్లకి' పాటను ఈ సినిమాలో చూపించడం ప్లస్ పాయింట్. అభిమానులు ఆ పాటకు థియేటర్లలో భజనలు చేశారు. 'యాలాలో.. యాలాలో', 'కార్తీకమాసం' పాటలూ ఆకట్టుకున్నాయి. ఇలా అన్ని అంశాలు కలిసిరావడంతో ఈ చిత్రం బ్లాక్ బస్టర్ హిట్ మూవీగా నిలిచింది.

లైగన్‌లో అనవసరంగా నటించా : అనన్య పాండే

రౌడీ బాయ్ విజయ్ దేవరకొండ కెరీర్‌లో బిగ్గెస్ట్ డిజాస్టర్ 'లైగర్'. ఆ సినిమా ప్రస్తావన తీసుకురావడానికి కూడా అందులో నటించిన నటులు, టెక్నీషియన్స్ సాహసం చేయరు. భారతీయ సినిమా చరిత్రలో మోస్ట్ ట్రోలింగ్ కు గురైన సినిమా ఇది. కాగా ఈ సినిమాతో బాలీవుడ్ యాక్ట్రెస్ అనన్య పాండే తెలుగులో డెబ్యూ చేసింది. ఇది ఆమె ఫస్ట్ పాన్ ఇండియన్ ప్రాజెక్ట్. ఈ సినిమా ప్రమోషన్స్ లో విజయ్, అనన్యల మధ్య కెమిస్ట్రీ చూసి ఇండియన్ ఫిల్మ్ ఇండస్ట్రీ అంతా షాక్ అయ్యింది. కానీ.. ఈ సినిమా గురించి ఆమె చేసిన కామెంట్స్ ప్రస్తుతం వైరల్‌గా మారాయి. ఇంతకు ఏం జరిగిందంటే..అనన్య పాండే నెపో బేబీ అని ఇండస్ట్రీలోకి రాగానే చాలా విమర్శలను ఎదురుకుంది. కెరీర్ ఆరంభంలో ఆమె స్టోరీ సెలెక్షన్ బెడిసికొట్టడంతో సినీ అభిమానులు రెచ్చిపోయి మరి ట్రోలింగ్ చేశారు. ఇదంతా ఒక ఎత్తు అయితే.. లైగర్ మరో ఎత్తు.. భారీ అంచనాల మధ్య పూరి జగన్నాధ్ తెరకెక్కించిన ఈ సినిమాకు కరణ్ జోహార్, ఛార్మి నిర్మాతలుగా వ్యవహరించారు. హాలీవుడ్ తోప్ మైక్ టైసన్ నటించాడు. కానీ.. కథ, కథనం, నటన అన్ని తేలిపోయాయి. దీంతో సినిమా అట్టర్ ఫ్లాప్ గా నిలిచింది. తాజాగా అనన్య పాండే తండ్రి, బాలీవుడ్ నటుడు చంకీ పాండే ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. "అనన్యకు ఈ సినిమా ఆఫర్ వచ్చినప్పుడు అసౌకర్యంగా ఫీలైంది. ఆ పాత్రకు తాను సెట్ కానని, చిన్న పిల్లలా కనిపిస్తానని భావించింది. కన్ఫ్యూజన్ లో ఉండిపోయింది. నా దగ్గరకు వచ్చి 'పాపా.. ఈ పాత్ర చేయడానికి నేను చాలా చిన్నదాన్ని' అని అంది. కానీ ఈ సినిమా చేయమని నేను చెప్పాను. ఇది పెద్ద కమర్షియల్ సినిమా అని, సక్సెస్ అయితే మంచి పేరొస్తుందని ఒప్పించాను" అని అన్నారు. అంతకు ముందు ఓ షోలో అనన్య కూడా మాట్లాడుతూ.. పేరెంట్స్ చెప్పడంతోనే ఈ సినిమా చేశాను అంది. ప్రస్తుతం ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. సినిమా ఫ్లాప్ కావడంతోనే ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని పలువురు మండిపడుతున్నారు. హిట్ అయ్యుంటే వేరేలా చెప్పుకునేవారని అభిప్రాయాలని వ్యక్తపరుస్తున్నారు. కాగా అనన్య పాండే ఈ ఏడాది నెట్‌ఫ్లిక్స్‌లో కంట్రోల్ అనే అద్భుతమైన సినిమాతో ముందుకు వచ్చింది. దీనికి విమర్శకుల నుండి ప్రశంసల జల్లు కురిసింది.

అందాలతో వేడెక్కిస్తున్న మాళవిక శర్మ

మాళవిక శర్మ అంటే తెలియని సినీ అభిమాని ఉండరు. చేసింది తక్కువ సినిమాలే అయినప్పటికీ, తన గ్లామర్‌తో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది ఈ అమ్మడు. మాళవిక శర్మ 1999 జనవరి 26న ముంబైలో జన్మించింది. ఆమె న్యాయవాది కూడా. ఆమె రిజ్వీ లా కాలేజీ నుండి క్రిమినాలజీలో స్పెషలైజేషన్‌తో బ్యాచిలర్ ఆఫ్ లాస్ డిగ్రీని పొందింది. మోడల్‌గా కెరీర్ ప్రారంభించిన మాళవిక శర్మ, ఆ తర్వాత సినీ ఇండస్ట్రీలో అడుగుపెట్టింది. మాళవిక శర్మ ప్రధానంగా తెలుగు, తమిళ సినిమాల్లో నటించింది. ఆమె 2018 లో రవితేజతో కలిసి "నేల టిక్కెట్" చిత్రంలో నటించడం ద్వారా తెలుగు తెరకు పరిచయం అయ్యింది. ఆమె "రెడ్" ,"కాఫీ విత్ కాదల్" ,'హరోం హర , భీమా వంటి చిత్రాలలో నటించింది.అయితే ఈ సినిమాలు బాక్సాఫీస్ పెద్దగా విజయాన్ని నమోదు చేయలేకపోయాయి. దీంతో మాళవిక శర్మ కెరీర్ అనుకున్నంతస్థాయిలో సక్సెస్ కాలేకపోయింది. మాళవిక శర్మ చేతిలో పెద్దగా సినిమాలు లేకపోయినప్పటికీ సోషల్ మీడియాలో మాత్రం చురుకుగా ఉంటుంది.మాళవిక శర్మ ఎప్పటికప్పుడు సోషల్ మీడియా ద్వారా తన అభిమానులతో టచ్‌లో ఉంటుంది. ఇదే సమయంలో తన వ్యక్తిగత విషయాలతో పాటు, తన సినిమా విషయాలను సైతం అభిమానులతో సోషల్ మీడియా ద్వారా పంచుకుంటుంది. తన లేటెస్ట్ ఫొటోలను సైతం అభిమానులకు షేర్ చేస్తుంటుంది. తాజాగా మాళవిక శర్మ తన లేటెస్ట్ ఫొటోషూట్‌ను సోషల్ మీడియాలో షేర్ చేసింది.మరోసారి తనదైన హాట్‌నెస్ అభిమానులకు కిక్ ఇచ్చింది. బ్లూ కలర్ ఔట్ ఫిట్‌లో కనిపించి అదరగొట్టింది. లోపల్ బ్రా లేకుండా షట్ ఓపెన్ చేసి మరి తన అందాలను చూపించింది. ఈ ఫొటోలపై నెటిజన్లు పలు రకాలుగా స్పందిస్తున్నారు. పరఫెక్ట్ ఫిగర్ అని కొందరు కామెంట్స్ చేస్తుంటే, అన్ని మాకే చూపిస్తే రేపు పెళ్లి అయిన తర్వాత నీ భర్తకు ఏం చూపిస్తావు అంటూ మరి కొందరు కామెంట్స్ చేస్తున్నారు. ప్రస్తుతం మాళవిక శర్మ బ్రాలెస్ ఫొటోలు నెట్టింట వైరల్‌గా మారాయి.

సాయి పల్లవిని డామినేట్స్ చేసిన చైతు

కథ నచ్చి అందులో తన పాత్రకు ప్రాధాన్యత ఉంటే తప్పిస్తే ఆ సినిమాకు సాయి పల్లవి గ్రీన్ సిగ్నల్ ఇవ్వదనే టాక్ ఇండస్ట్రీలో ఉంది. చాలాకాలం తర్వాత తెలుగులో నటించింది సాయి పల్లవి. నాగ చైతన్య హీరోగా నటించి తండేల్ సినిమాలో సాయి పల్లవి హీరోయిన్‌గా నటించింది. సాధారణంగా సాయి పల్లవి తన స్క్రీన్ ప్రెజెన్స్‌తో అభిమానులను కట్టిపడేస్తోంది. స్టార్ హీరోలు సైతం ఆమె సినిమాల్లో సైడ్ క్యారెక్టర్ ఆర్టిస్టుల మాదిరిగా కనిపిస్తారు. ఆ రకంగా సాయి పల్లవి తన డామినేషన్ చూపిస్తుంటుంది. అలాంటి సాయి పల్లవిపై తొలిసారి ఓ హీరో తన అధిపత్యాన్ని ప్రదర్శించారు. ఆ హీరో మరెవ్వరో కాదు.నాగ చైతన్య. గత మూడేళ్లుగా సరైన హిట్ లేక సతమతం అవుతున్న నాగ చైతన్య, తండేల్ మూవీతో ప్రేక్షకు ముందుకొచ్చాడు. శుక్రవారం ప్రేక్షకుల ముందుకొచ్చిన ఈ సినిమా సూపర్ హిట్ టాక్‌ను సొంతం చేసుకుంది. సినిమా అద్భుతంగా ఉందని ప్రేక్షకులు కితాబిస్తున్నారు. నాగ చైతన్య, సాయి పల్లవి పోటీపడి నటించారు. మొదటి భాగంలో సాయి పల్లవి ఎమోషన్స్ బాగా పండాయి. "అలాంటి వారికి నా జీవితంలో చోటు లేదు.. నాగ చైతన్యపై సమంత షాకింగ్ కామెంట్స్" అదే విధంగా సాయి పల్లవిని డామినేట్ చేస్తూ నాగ చైతన్య నటించారు. ముఖ్యంగా సెకండాఫ్‌లో నాగ చైతన్య తన నటనతో కంటతడి పెట్టించాడు.నాగ చైతన్య యాక్టింగ్ చేస్తున్నాడని ఎక్కడా కనిపించలేదు. ఇంకా చెప్పాలంటే సాయి పల్లవి స్క్రీన్ ప్రెజెన్స్‌కు నాగ చైతన్య అడ్డుకట్ట వేశాడు. చేపల వేటకు వెళ్లే యువకుడిగా, ప్రేమికుడిగా, జాలరి గ్యాంగ్‌కు లీడర్‌గా, పాకిస్థాన్‌లో దొరికిపోయిన జాలరిగా ఇలా విభిన్న పాత్రల్లో నాగ చైతన్య మెప్పించారు. మొత్తానికి సాయి పల్లవిని డామినేట్ చేసిన హీరోగా నాగ చైతన్య నిలిచాడు..

తమన్నాకి ఆ హీరో ప్రపోజ్ చేసాడా?

మిల్కీబ్యూటీ తమన్నా భాటియా ప్రస్తుతం వరుస సినిమాలతో దూసుకెళ్తున్నారు. ప్రధానంగా తన ఫోకస్‌ను హిందీ చిత్ర పరిశ్రమపైనే పెట్టారు. ఐటెం సాంగ్స్‌తో పాటు హీరోయిన్‌గానూ ఆమెకు అవకాశాలు క్యూకడుతున్నాయి. విజయ్ వర్మతో బ్రేకప్ తర్వాత కెరీర్, వ్యాపారాలపై సరికొత్త ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఇదిలాఉండగా ఓ స్టార్ హీరో వేదిక మీదే తమన్నాకు ప్రపోజ్ చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. లస్ట్ స్టోరీస్ 2 సమయంలో తన సహనటుడు విజయ్ వర్మతో తమన్నాకి ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. ఇద్దరూ కొన్నాళ్లు సీక్రెట్‌గా డేటింగ్ చేశారు. సినిమా ఫంక్షన్లు, ఈవెంట్స్, విహారయాత్రలతో తమన్నా - విజయ్ హల్‌చల్ చేశారు. కానీ ఎక్కడా కూడా తమ బంధాన్ని బయటపెట్టలేదు. ఆ తర్వాత నెమ్మదిగా ఇద్దరూ ఓపెన్ అయ్యారు. రేపో మాపో పెళ్లి అనుకుంటుండగా తమన్నా - విజయ్ వర్మలు అనూహ్యంగా విడిపోయారు. వీరి మధ్య బ్రేకప్‌కు దారి తీసిన కారణాలు ఏంటన్నది మాత్రం తెలియరాలేదు. కెరీర్‌లో నిలదొక్కుకోవాలని విజయ్ వర్మ.. పెళ్లి చేసుకుని జీవితంలో స్థిరపడాలని తమన్నా నిర్ణయించుకోవడమే ఇందుకు ప్రధాన కారణంగా బాలీవుడ్ మీడియా కోడై కూసింది. బ్రేకప్ తర్వాత తమన్నా- విజయ్‌లు వారి జీవితాల్లో బిజీ అయ్యారు. సినిమాలు, షూటింగ్స్, బిజినెస్ ఇతర వ్యవహారాల్లో తలమునకలయ్యారు. ఈ బాధ నుంచి బయటకు రావడానికి సినిమాలను పెంచారు తమన్నా. అలాగే ఇప్పటి వరకు గ్లామరస్ రోల్స్ చేసిన నో కిస్ రూల్‌ను పక్కాగా ఫాలో అయిన ఈ ముద్దుగుమ్మ.. ఈ నిబంధనను కూడా పక్కనపెట్టారు. ఇంటిమేట్ సీన్స్, బెడ్ సీన్స్‌లో నటించేందుకు ఎలాంటి అభ్యంతరం లేదన్నట్లుగా సంకేతాలు ఇచ్చారు. దీనికి తగినట్లుగానే రాగిణి ఎంఎంఎస్ 3 వంటి బోల్డ్ సినిమాలో నటించేందుకు అగ్రిమెంట్ మీద సంతకం చేసింది. ప్రస్తుతం తమిళంలో పురుషన్, హిందీలో వీవాన్ ఫోర్స్ ఆఫ్ ది ఫారెస్ట్, వీ శాంతారామ్ బయోపిక్, రోహిత్ శెట్టి, జగన్ శక్తిలు తెరకెక్కించనున్న సినిమాలలో తమన్నా నటిస్తున్నారు.

ఇక తెరపైకి బాలకృష్ణ తనయుడు మోక్షజ్ఞ

నందమూరి బాలకృష్ణ వరుసగా సినిమాలు చేస్తూనే మొన్నటివరకు అన్ స్టాపబుల్ షో చేశారు. దీంతోపాటు తన తనయుడు మోక్షజ్ఞను వెండితెరకు పరిచయం చేసే పనుల్లో బిజీగా ఉన్నారు. పద్మభూషణ్ అవార్డు అందుకున్న తర్వాత రెట్టించిన ఉత్సాహంతో ఉన్న బాలయ్య తన కొడుకును స్టార్ హీరోగా తీర్చిదిద్దాలంటే తొలి సినిమాగా ఎటువంటి నిర్ణయం తీసుకోవాలనే యోచనలో ఉన్నారు. ఇచ్చిన మాట నిలబెట్టుకునే ప్రయత్నంలో వర్మ ప్రశాంత్ వర్మతో సినిమా అని వార్తలు వచ్చినప్పటికీ అతను డబ్బులు భారీగా డిమాండ్ చేశాడని, తన అసిస్టెంట్ తో సినిమా చేయిస్తానని, తాను దర్శకత్వం వహించనని, కథను మాత్రమే ఇస్తానని... ఇలా అనేక రకాలుగా వ్యవహరించడంతో అతనిపై బాలయ్య తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసి రెండు పీకినట్లు వార్తలు వచ్చాయి. అయితే ఈ సినిమాకు సంబంధించిన అప్ డేట్ తాజాగా వచ్చింది. ప్రీ ప్రొడక్షన్ పనులన్నీ పూర్తిచేసుకొని త్వరలోనే సెట్స్ పైకి అడుగుపెట్టబోతోంది. ప్రశాంత్ వర్మ ఈ సినిమాను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకొని దర్శకత్వం వహించనున్నారని, బాలయ్య తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవడాలనే ప్రయత్నాల్లో ఉన్నారని వార్తలు వస్తున్నాయి. ఈ సినిమాకు నిర్మాత ఎవరు అనేది ఇంకా ఖరారు కాలేదు.

Printed, Published & Owned by Dr. JBL, Printed at Abhyudaya Publications,& Printers Algunoor, MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S), RNI NO. APTEL/2006/19056